'10 నిమిషాల' డెలివరీ.. ఇక రద్దు!

గిగ్ వర్కర్ల ఆందోళన నేపథ్యంలో
ఆన్‌లైన్ సంస్థలతో కేంద్రం చర్చలు
వర్కర్ల భద్రతకు సానుకూల నిర్ణయం
నిలిపివేస్తామన్న సంస్థలు 2

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
భోగి శుభాకాంక్షలు

బుధవారం | 14-1-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 309 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: ఏకాదశి సా.5.53 తదుపరి ద్వాదశి, నక్షత్రం: అనూరాధ తె.3.04 తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: మ.12.02-12.46, అమృతఘడియలు: మ.3.23-5.11, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.52, సూర్యాస్తమయం 5.56 | గుంటూరు సిటీ
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పులివెందుల పులి.. రాయలసీమ ముద్దుబిడ్డ... ఇవీ వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఆయన పార్టీ నేతలు పెట్టుకున్న బిరుదులు. కానీ... ఐదేళ్లు సీఎంగా ఉన్న జగన్ కడప జిల్లాకు, రాయలసీమ ప్రాజెక్టులకు ఏం చేశారో తెలుసా? శ్రీశైలం డ్యామ్ నిర్వహణకు పైసా కూడా ఇవ్వలేదు. సొంత జిల్లాలో రూ.10,388 కోట్లతో వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసినా.. ఒక్క ప్రాజెక్టు పని కూడా మొదలు పెట్టలేదు. ఇంకా ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాల్లో గత టీడీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులను కూడా గాలికొదిలేశారు. జగన్ చేసిందల్లా ఏంటంటే.. సర్వరాయసాగర్ నుంచి ఆయనకు చెందిన భారతీ సిమెంట్స్‌కు, ఆయన మేనమామ, కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చేపల చెరువుకు నీటిని మళ్లించడమే. జగన్ పాలనలో పడకేసిన ప్రాజెక్టులను ఇప్పుడు కూటమి ప్రభుత్వం పట్టాలెక్కిస్తోంది. అయినా సరే... 'సీమ ద్రోహి చంద్రబాబు' అని నిందించడం జగన్‌కే చెల్లింది.

సీమ ద్రోహి ఎవరు?





జగన్ హయాంలో పడకేసి, కూటమి ప్రభుత్వం వచ్చాక కర్నూలు జిల్లా పత్తికొండ మండలంలో పూర్తి చేసిన హంద్రీనీవా విస్తరణ పనులు

సీమకు జగన్ సున్నం

రాయలసీమ ప్రాజెక్టులపై అంతులేని నిర్లక్ష్యం



ఉన్న ఐదేళ్లూ వాటి పనులకు ఫుల్‌స్టాప్
కూటమి వచ్చాకే మళ్లీ ప్రాజెక్టులకు కదలిక
'శ్రీశైలం' నిర్వహణకు పైసా ఇవ్వని జగన్
హంద్రీనీవా కాలువలో గంపెడు మట్టీ తీయలేదు
సొంత జిల్లాలో 10 వేల కోట్లతో శంకుస్థాపనలు
ఏ ఒక్కటీ మొదలు పెట్టని దైన్యం
అనంత, కర్నూలు జిల్లాల్లోనూ గాలికి
అయినా బాబు సీమ ద్రోహి అంటూ కువిమర్శలు

(కర్నూలు-ఆంధ్రజ్యోతి)

'చంద్రబాబు సీమ ద్రోహి'... అంటూ కొన్నాళ్లుగా జగన్ విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు! ఆయన హయాంలోనే పుట్టి, ఆయన హయాంలోనే కొండెక్కిన 'రాయలసీమ ఎత్తిపోతల'ను... చంద్రబాబు ఎందుకు పూర్తి చేయడంలేదంటూ వింత వాదనలు చేస్తున్నారు. 'రాయలసీమ అభివృద్ధి.. ప్రయోజనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు చీమంతైనా చిత్తశుద్ధి లేదు' అంటూ జగన్ రోత మీడియాలో కథనాలు వండి వారుస్తున్నారు. చంద్రబాబును ఇంతలా దూషిస్తున్నారంటే... రాయలసీమ ప్రాజెక్టులకు జగన్ ఎంత చేసి ఉంటారో! అనే సందేహం వస్తుంది కదూ! ఒక్క ముక్కలో చెప్పాలంటే... సీమ ప్రాజెక్టులకు జగన్ చేసింది సున్నా! ఇప్పుడు సీమ నేలను తడుపుతున్న ప్రాజెక్టులన్నీ తెలుగుదేశం హయాంలోవే! అంతే కాదు... 2014-19 మధ్య సీమ ప్రాజెక్టులపై

మిగతా 13వ పేజీలో...



'నమస్తే తెలంగాణ', 'సాక్షి'లో వచ్చిన కథనాల తీరును వివరిస్తున్న పట్టాభి

కేసీఆర్, జగన్ మ్యాచ్ ఫిక్సింగ్

కుటుంబ పత్రికలతో తెలుగు వారి మధ్య చిచ్చు
ప్రాజెక్టులపై సాక్షిది ఒక మాట, 'నమస్తే'ది మరో మాట
తెలంగాణ ప్రాజెక్టులు అడ్డుకున్నారంటున్న నమస్తే
తెలంగాణకే నీళ్లు ఇచ్చారంటూ 'సాక్షి' కథనాలు 13
తప్పుడు కథనాలతో ప్రజలను రెచ్చగొడుతున్నాయి
వైసీపీ, బీఆర్ఎస్‌పై విరుచుకుపడ్డ పట్టాభిరాం

సీమకు జగన్ చరిత్రాత్మక ద్రోహం

102 సీమ ప్రాజెక్టులు రద్దు చేశారు
అన్నమయ్య డ్యాం కొట్టుకుపోవడం ఆయన పాపమే
అనుమతుల్లేకుండా రాయలసీమ లిఫ్టు పనులు
990 కోట్ల ప్రజాధనం వృథా.. సోమిరెడ్డి ఆగ్రహం
'కండలేరు'ను సందర్శించిన టీడీపీ బృందం



తాడేపల్లి ప్యాలెస్ వద్ద జగన్, బీఆర్ఎస్ నేతల కటౌట్ ఫొటోను చూపుతున్న మంత్రి సవిత

జగన్, కేసీఆర్ కుట్ర రాజకీయాలు

తెలుగు ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారు: సవిత

ఏపీలో ఏప్రిల్ నుంచి 'సర్'!

తెలంగాణ, మరికొన్ని రాష్ట్రాల్లో కూడా



న్యూఢిల్లీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో ప్రత్యేక ఓటర్ల జాబితా విస్తృత సవరణ (ఎస్ఐఆర్-సర్)ను ఏప్రిల్-మే నెలల్లో పూర్తి చేస్తామని ఎన్నికల కమిషన్ వర్గాలు తెలిపాయి. మొదటి దశలో బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణను విజయవంతంగా పూర్తి చేసి ఎన్నికలను నిర్వహించిన తర్వాత.. రెండో దశను 9 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి, అండమాన్, లక్షదీవుల్లో ఈ ప్రక్రియ తుది అంకంలో ఉంది. మూడో దశ 'సర్' ఏపీ, తెలంగాణతో పాటు ఇంకొన్ని రాష్ట్రాల్లో జరుగుతుందని ఈసీ వర్గాలు తెలిపాయి.

ఇక స్వర్ణ గ్రామం.. స్వర్ణ వార్డు!

ఆర్డినెన్సు జారీ చేసిన గవర్నర్ నజీర్
మారనున్న సచివాలయాల ముఖచిత్రం
ప్రజలకు మరింత పారదర్శక సేవలు 14

ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై 25% అదనపు సుంకం

వెంటనే అమల్లోకి.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన
భారత్‌పై స్వల్పంగానే ప్రభావం.. ఇరాన్ వాణిజ్యంలో ప్రధాన వాటా చైనా, తుర్కియే, యూఏఈ, ఇరాక్‌లదే.. 2
తగిన విధంగా స్పందిస్తాం.. అమెరికాకు చైనా హెచ్చరిక
మీకోసం సాయం వస్తోంది!.. ఇరానీయులకు ట్రంప్ పిలుపు



తిరిగిరాని లోకాలకు మన రాజకుమారి 14

రాణి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్ కన్నుమూత
ప్రసిద్ధ కవి గుంటూరు శేషేంద్ర జీవన సహచరి
దక్షిణాదిలోనే ఒకనాటి సంపన్న కుటుంబాల్లో ధన్‌రాజ్‌గిర్ ఒకటి
1973లో నోబెల్‌కు నామినేట్



కుక్కలపై ప్రేమ.. మనుషులపై ఏదీ?

వీధి కుక్కలకు తిండి పెట్టాలంటే మీ ఇళ్లకు తీసుకుపొండి
అవి బయట తిరుగుతూ జనాన్ని కరవడమెందుకు? 2
శునకప్రియులకు సర్వోన్నత న్యాయస్థానం చురకలు
కుక్క కాట్లకు, మరణాలకు రాష్ట్రప్రభుత్వాలు భారీగా పరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇస్తామని హెచ్చరిక



రొమ్ము, ప్రొస్టేట్ క్యాన్సర్‌కు కొత్త ఔషధం!

ఏయూ కెమిస్ట్రీ విభాగం పరిశోధకుల అభివృద్ధి 13
నాఫ్తాలిమైడ్ డెరివేటివ్‌గా నామకరణం
మూడేళ్ల కృషికి దక్కిన పేటెంట్ ఫలితం
ట్రయల్స్ నిర్వహణ దిశగా అడుగులు



నారావారిపల్లెలో ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన చిన్నారుల ఆటల పోటీలను తిలకిస్తూ చప్పట్లు కొడుతున్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి, మంత్రి లోకేశ్, బ్రాహ్మణి, ఎమ్మెల్యే పులివర్తి నాని

సొంతూరులో బాబు

నారావారిపల్లెలో సంక్రాంతి ముందస్తు వేడుకల్లో పాల్గొన్న సీఎం దంపతులు
కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి సందడి
మహిళలకు ముగ్గులు, పిల్లలకు ఆటల పోటీలు
రూ. 150 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు 12



కుప్పం నియోజకవర్గంలోని మూలపల్లి చెరువును పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే పులివర్తి నాని

పాతాళగంగ పైపైకి!

నైరుతి, ఈశాన్య రుతుపవనాల్లో ఎక్కువ వర్షపాతం
తెలుగు రాష్ట్రాల్లో ఆశాజనకంగా భూగర్భ జలాలు
సీమలో 6.31 మీ., తెలంగాణలో 5.3 మీ. లోతులో


విశాఖపట్నం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో భూగర్భ జలాలు ఆశాజనకంగా ఉన్నాయి. గతనెలలో భూగర్భ జల మట్టాలు రాయలసీమలో సగటున 6.31 మీటర్లు (20.70 అడుగులు), కోస్తాలో 5.98 మీటర్లు (19.61 అడుగులు), తెలంగాణలో 5.3 మీటర్లు(17.38 అడుగులు) లోతులో ఉన్నాయి. గత జూన్ నుంచి సెప్టెంబరు వరకు నైరుతి రుతుపవనాలు, అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ఈశాన్య రుతుపవనాల సీజన్లలో కురిసిన మిగులు వర్షాలతో భూగర్భజలాలు పైకి వచ్చాయి. భూ ఉపరితలంలో

మిగతా 13వ పేజీలో...



వాహనాలపై రహదారి భద్రతా సెస్

లైఫ్ ట్యాక్స్‌పై 10% వసూలుకు ఆర్డినెన్స్
ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు



అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నివారించి.. రహదారి భద్రతను మరింత పటిష్ఠం చేసే కీలక లక్ష్యంతో సొంత(వైట్ బోర్డు) వాహనాల జీవితకాల పన్ను(లైఫ్ ట్యాక్స్)పై 10శాతం సెస్ వసూలు చేసేందుకు రవాణా శాఖ సిద్ధమైంది. ఈ మేరకు అదనపు సెస్ వసూలుకు సంబంధించి ఏపీ మోటార్ వాహన పన్ను చట్టం-1963ను సవరిస్తూ రవాణా శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. దీనిని రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదించింది. అనంతరం.. మంత్రి మండలి నిర్ణయాన్ని గవర్నర్‌కు పంపించడంతో

మిగతా 14వ పేజీలో...

'ప్రైవేటు' బాదుడుపై ఆర్టీఏ కొరడా

14

సంక్రాంతి స్పెషల్ డ్రైవ్‌లో పలు ప్రైవేటు బస్సులపై చర్యలు
అదనపు చార్జీల వసూలుపై 209 కేసులు, రూ.21 లక్షల ఫైన్
ఇతర ఉల్లంఘనలపై 678 కేసులు, రూ.37 లక్షల జరిమానా
కఠిన చర్యలు తప్పవు: రవాణా కమిషనర్



మంగళవారం రాత్రి బెజవాడలో విద్యుత్ వెలుగుల్లో మెరిసిపోతున్న హైటెక్ బరులు

పందేలకు సై

సంక్రాంతి వేడుకలకు సర్వం సిద్ధం

నేడు తెల్లవారగానే కోడి పందేలతో ఫుల్ జోష్

గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో భారీ ఏర్పాట్లు.. ఇప్పటికే సందడి
తెలంగాణ, ఇతర రాష్ట్రాల నుంచి భారీగా రాక.. రోడ్లన్నీ జామ్ జామ్
బెజవాడలో హోటళ్లు, లాడ్జీలు ఫుల్
వారం రోజులకు 5 వేల గదులు బుకింగ్
ఎన్టీఆర్-ఏలూరు జిల్లాల సరిహద్దున వీవీఐపీల కోసం క్యారవాన్లు సిద్ధం
రానున్న రాజకీయ, సినీ ప్రముఖులు



ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల సరిహద్దు బిళ్ళనపల్లి-మీర్జాపురం బరి వద్ద వీవీఐపీల కోసం పార్కింగ్ చేసిన క్యారవాన్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఏ ఇల్లు చూసినా కళకళ! కుటుంబ సభ్యులు, బంధువుల రాకతో ఒక్కటే సందడి! సంక్రాంతి ముందే గ్రామాల్లో పండగ వాతావరణం! మరోవైపు కోడి పందేలకు బరులు సిద్ధం! తెల్లవారడమే ఆలస్యం.. పందేలకు సై అంటున్నారు. బుధవారం భోగితో సంక్రాంతి సంబరాలతో పాటు కోడి పందేలూ మొదలవుతున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పందెంకోళ్లు కాళ్లు దువ్వుతున్నాయి. బరిలో తాడోపేడో తేల్చుకునేందుకు కొక్కొరో..కో అంటూ సవాల్ విసురుతున్నాయి. సంప్రదాయం పేరిట సంక్రాంతి మూడు రోజులూ యథేచ్ఛగా కోడి పందేలు

మిగతా 12వ పేజీలో...

బంగ్లాలో మరో హిందూ యువకుడి హత్య

న్యూఢిల్లీ, జనవరి 13: బంగ్లాదేశ్‌లోని ఫెని జిల్లాలో మరో హిందూ యువకుడిని ఆందోళనకారులు కొట్టి చంపారు. ఈ మరణంతో కలిపి, గత 42 రోజులుగా దేశంలో జరుగుతున్న హింసాత్మక ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన హిందువుల సంఖ్య 12కు చేరుకుంది. మృతుడు సమీర్ కుమార్ దాస్(28) వృత్తిరీత్యా ఆటో డ్రైవర్. ఆదివారం రాత్రి దుండగులు సమీర్‌పై దాడి చేసి హతమార్చారు. అనంతరం అతని ఆటోను దొంగిలించి పరారయ్యారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి సమీపంలో సమీర్ మృతదేహం లభ్యమైంది. ప్రాథమిక విచారణలో దీనిని దోపిడీ, హత్యకేసుగా భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముంబైలో 30 వేలతో పౌరసత్వం కొనుగోలు!

ముంబై/న్యూఢిల్లీ, జనవరి 13: సరిహద్దు రాష్ట్రాలైన అసోం, త్రిపుర, పశ్చిమబెంగాల్‌తో పాటు దేశ పశ్చిమాన ఉండే ముంబై కూడా అక్రమ వలసదారులకు హబ్‌గా మారింది. దీనిపై ముంబై స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ (ఎంఎస్ఈపీపీ) ప్రొఫెసర్ మేధా తాపిలాల తదితరులు రూపొందించిన నివేదికతో కూడిన ఓ జాతీయ మీడియా సంస్థ ప్రత్యేక కథనం పలు కీలక విషయాలు వెల్లడించింది. పరిశోధకులు నగరంలోని పలు ప్రాంతాల్లో 7 వేల మందిని పైగా ఇంటర్వ్యూ చేయగా.. వారిలో 3,014 మందిని అక్రమ వలసదారులుగా గుర్తించారు. వీరిలో 96% మంది బంగ్లాదేశ్, మయన్మార్ నుంచి వచ్చిన ముస్లింలేనని తాజా నివేదిక పేర్కొంది. చెల్లుబాటయ్యే వీసాలు లేకుండా భారత్‌లోకి ప్రవేశించిన వీరంతా.. ఆ తర్వాత ఏజెంట్లకు రూ.7 వేల నుంచి రూ.30 వేల వరకు డబ్బులు ఇచ్చి.. ఆధార్, ఓటర్ కార్డు వంటివి సమకూర్చుకొని.. ఇక్కడి పౌరులుగా నివసిస్తున్నారని తేల్చారు. అక్రమంగా వలస వచ్చిన వారు స్థానిక ఏజెంట్ వద్దకు వెళ్తారని, ఆ ఏజెంట్ బర్త్ సర్టిఫికెట్ నుంచి ఆధార్, ఓటు, పాన్ కార్డులన్నింటినీ సమకూర్చుతాడని వివరించారు.

2025లో లక్షకు పైగా అమెరికా వీసాలు రద్దు

న్యూయార్క్, జనవరి 13: అమెరికా గతేడాది లక్షకు పైగా వీసాలను రద్దు చేసింది. వీటిలో దాదాపు 8 వేల విద్యార్థి వీసాలు కాగా, నేర కార్యకలాపాలతో సంబంధం ఉన్న వ్యక్తులకు సంబంధించిన 2,500 ప్రత్యేక వీసాలు కూడా ఉన్నాయి. ట్రంప్ యంత్రాంగం ఒకే ఏడాదిలోనే లక్షకు పైగా వీసాలను రద్దు చేసిందని ఆ దేశ విదేశాంగ శాఖ ప్రధాన ఉప అధికార ప్రతినిధి టామీ పిగాట్ తెలిపారు. దాడులు, దొంగతనాలకు పాల్పడటం, మద్యం తాగి వాహనం నడపడం తదితర నేరాల్లో దోషులుగా నిర్ధారించిన వేలాది మంది విదేశీ పౌరుల వీసాలు రద్దయ్యాయని పేర్కొన్నారు. బైడెన్ పాలనలో 2024లో 40వేల వీసాలు రద్దు చేయగా ఇప్పుడు వాటి సంఖ్య రెట్టింపు కంటే ఎక్కువ కావడం గమనార్హం.

భారతీయులకు ఆస్ట్రేలియా విద్యార్థి వీసా కఠినం

న్యూఢిల్లీ, జనవరి 13: భారతీయ విద్యార్థులకు వీసా జారీ ప్రక్రియను ఆస్ట్రేలియా మరింత కఠినతరం చేసింది. బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్‌తో పాటు భారత్ దరఖాస్తుదారులను హై రిస్క్ కేటగిరీలోకి చేర్చింది. ఈ నేపథ్యంలో ఇకనుంచి వీసా దరఖాస్తుదారు డాక్యుమెంట్లను ఇమ్మిగ్రేషన్ అధికారులు మరింత క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ఆస్ట్రేలియాకు చెందిన సరళీకృత విద్యార్థి వీసా ఫ్రేమ్‌వర్క్ (ఎస్ఎస్‌వీఎఫ్) కింద భారతీయ విద్యార్థులను ఎవిడెన్స్ లెవెల్-2 నుంచి ఈ నెల 8 నాటికి ఎవిడెన్స్ లెవెల్-3కు మార్చారు. భారత్‌లో ఫేక్ డిగ్రీల కేసులు పెరిగిపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార యంత్రాంగం వెల్లడించింది. 2025లో ఆస్ట్రేలియాలో దాదాపు 6,50,000 మంది విదేశీ విద్యార్థులు ఉండగా, భారతీయులు దాదాపు 1,40,000 మంది వరకూ ఉన్నారు.

'జననాయగన్'కు ఆటంకం తమిళ సంస్కృతిపై దాడే!

- వారి గొంతు అణచివేసి మీరు గెలవలేరు: రాహుల్ గాంధీ

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తమిళ హీరో, టీవీకే అధినేత విజయ్ నటించిన 'జననాయగన్' సినిమాను సెంట్రల్ బోర్డ్ ఫర్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అడ్డుకోవడం తమిళ సంస్కృతిపై జరిగిన ప్రత్యక్ష దాడిగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అభివర్ణించారు. ఈ నెల 9న విడుదల కావలసిన ఈ సినిమా సెన్సార్ సమస్యల కారణంగా విడుదల కాలేదు. ఈ వివాదం మద్రాసు హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. ఈ తరుణంలో రాహుల్‌గాంధీ మంగళవారం 'ఎక్స్'లో విజయ్‌కు మద్దతు ప్రకటించారు. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖే ఈ సినిమా విడుదల కాకుండా అడ్డుకుంటోందన్నారు. 'ఈ సినిమాను అడ్డుకోవడం తమిళ సంస్కృతిపై దాడి లాంటిది. తమిళనాడు ప్రజల గొంతును అణచివేసి మీరు ఎప్పటికీ గెలవలేరు మోదీజీ' అని పోస్టుచేశారు. రాహుల్ పోస్టు రాజకీయ చర్చకు తెరతీసింది. అందరి దృష్టి కాంగ్రెస్, డీఎంకే మధ్య సంబంధాలపై పడింది. డీఎంకేను బెదిరించడానికి.. బ్లాక్‌మెయిల్ చేయడానికి రాహుల్ విజయ్‌కు మద్దతిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు కాంగ్రెస్ నేతలు విజయ్‌తో టచ్‌లోకి వెళ్లారు కూడా. ఈ ఏడాది ఏప్రిల్-మే నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తనకు మద్దతిచ్చే ప్రతి పార్టీకీ ప్రభుత్వంలో చోటిస్తామని విజయ్ ప్రకటించడమే దీనికి కారణం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రజానాడిని పసిగట్టడానికి, పొత్తులు, క్షేత్రస్థాయి వాస్తవాలను తెలుసుకోవడానికి రాబోయే రోజుల్లో కాంగ్రెస్ సమగ్ర సర్వే చేపట్టనుంది. దీని ఫలితం ఆధారంగా పొత్తులపై తుది వైఖరి తీసుకుంటుందని అంటున్నారు.

గ్రీన్‌లాండ్ విలీనానికి అమెరికా బిల్లు

వాషింగ్టన్, జనవరి 13: డెన్మార్క్‌లో స్వయంప్రతిపత్తి కలిగిన ద్వీపమైన గ్రీన్‌ల్యాండ్‌ను తమ దేశంలో విలీనం చేసుకునే యత్నాలను అమెరికా ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా 'గ్రీన్‌ల్యాండ్ విలీనం- రాష్ట్ర హోదా' పేరుతో రూపొందించిన బిల్లును రిపబ్లిక్ పార్టీకి చెందిన ర్యాండీ ఫైన్ అనే చట్టసభ్యుడు ప్రవేశపెట్టారు. గ్రీన్‌ల్యాండ్ విలీనానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు అమెరికా అధ్యక్షునికి ఈ బిల్లు అవకాశం కల్పిస్తుందని ర్యాండీ ఈ సందర్భంగా తెలిపారు. ఆర్కిటిక్‌లో పట్టు సాధించేందుకు అమెరికా విరోధులు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు. ఆర్కిటిక్‌లో చైనా, రష్యాను ఎదుర్కోవడానికి ఈ బిల్లు కీలకమని పేర్కొన్నారు. అయితే, అమెరికా చర్యను డెన్మార్క్, నాటో ఖండించాయి. అమెరికా బిల్లు చట్ట విరుద్ధమని పేర్కొన్నాయి.

బెంగళూరు-పారిస్ విమాన ఇంజన్‌లో సమస్య

న్యూఢిల్లీ, జనవరి 13: బెంగళూరు నుంచి పారిస్‌కు బయలుదేరిన ఎయిర్ ఫ్రాన్స్ విమానం ఇంజన్‌లో సమస్య తలెత్తడంతో దాన్ని తుర్క్‌మెనిస్థాన్‌కు మళ్లించారు. మంగళవారం తెల్లవారుజామున 3.37 గంటలకు తుర్క్‌మెనిస్థాన్‌లోని అష్గబాట్ విమానాశ్రయంలో విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యిందని ఎయిర్ ఫ్రాన్స్ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. అది బోయింగ్ 777 విమానమని ఫ్లైట్‌రాడార్24.కాం పేర్కొంది. ప్రయాణికులు 15 గంటలకుపైగా తుర్క్‌మెనిస్థాన్‌లో చిక్కుకుపోయారు. ప్రయాణికుల కోసం ప్రత్యేక విమానం ఏఎఫ్386ను అష్గబాట్‌కు పంపించామని ఎయిర్‌ఫ్రాన్స్ పేర్కొంది. విమానంలో ఎంతమంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారనే వివరాలు వెల్లడి కాలేదు.

మదురైలో మల్లెపూలు కిలో రూ.6 వేలు

చెన్నై, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆలయాల నగరం మదురై మాట్టుదావని మార్కెట్‌లో మల్లెపూల ధర ఆకాశాన్నంటుతోంది. అక్కడ కిలో మల్లెపూలు రూ.6 వేలు పలుకుతుండగా, చెన్నైలో రూ.4,500గా ధర ఉంది. అదేవిధంగా మదురై మార్కెట్‌లో కనకాంబరం కిలో రూ.2 వేలు ఉన్నట్టు వ్యాపారులు తెలిపారు.

స్పెయిన్ 'కిడ్' ఒక్కటే బయటపడింది

- పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ నుంచి విడిపోయి.. భూమికి సంకేతాలు

న్యూఢిల్లీ, జనవరి 13: కొత్త ఏడాది తొలిసారిగా సోమవారం ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ62 ప్రయోగం విఫలమైంది. ఈ రాకెట్ ద్వారా భూపరిశీలన కోసం పంపిన ఈవోఎస్-ఎన్1తోపాటు వివిధ దేశాలకు చెందిన మరో 15 ఉపగ్రహాలను కూడా నిర్దేశిత కక్ష్యలోకి చేర్చలేకపోయింది. దీంతో 16 ఉపగ్రహాలూ అంతరిక్షంలో కలిసిపోయినట్టేనని భావిస్తున్న వేళ... స్పెయిన్‌కు చెందిన స్టార్టప్ సంస్థ ఆర్బిటాల్ పారాడైమ్ ఓ శుభవార్త చెప్పింది. పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ద్వారా తాము పంపిన కెస్ట్రెల్ ఇనీషియల్ డెమాన్‌స్ట్రేటర్ (కిడ్) అనే బుల్లి ఉపగ్రహం పనిచేస్తోందని, అంతరిక్షం నుంచి కీలకమైన డేటాను పంపిందని వెల్లడించింది. "మా కిడ్ క్యాప్సూల్ పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ నుంచి విడిపోయింది. స్విచ్ ఆన్ అయిన మూడు నిమిషాల తర్వాత డేటాను ప్రసారం చేసింది. మేం దాన్ని పూర్తిస్థాయిలో పనిచేయించే పనిలో ఉన్నాం" అని ఆర్బిటాల్ పారాడైమ్ ఎక్స్‌లో పోస్టు చేసింది.

ఇరాన్‌లో ఊచకోత!


టెహ్రాన్‌లో రోడ్లపై మృతదేహాలు

నిరసనకారులపై కాల్పులకు ఖమేనీ ఆదేశాలు?

- 2 వేల మందికిపైగా మరణించారన్న అధికారులు
- 12వేల మందికిపైగా చనిపోయారన్న 'ఇరాన్ ఇంటర్నేషనల్'

న్యూఢిల్లీ, జనవరి 13: ఇరాన్‌లో ఊచకోత కొనసాగుతోంది. ఆందోళనలను అణచివేసేందుకు ఖమేనీ ప్రభుత్వం చేపట్టిన చర్యలు దారుణ మారణహోమానికి దారితీశాయి. ఇప్పటికే వేలాది మంది నిరసనకారులు, భద్రతా బలగాల సిబ్బంది మృతి చెందారు. ఘర్షణల్లో 2 వేల మందికిపైగా మరణించారని ఇరాన్ అధికార వర్గాలు వెల్లడించాయి. దీని వెనుక సాయుధ, ఉగ్రవాద గ్రూపులు ఉన్నాయని ఆరోపించాయి. మరోవైపు ఇరాన్‌లో జరుగుతున్న ఆందోళనల్లో భారీ స్థాయిలో హింస చోటుచేసుకున్నట్టు ఇరాన్ అధికారిక టీవీ అధికారికంగా అంగీకరించింది. నిరసనకారులను ఉగ్రవాద గ్రూపులుగా అభివర్ణిస్తూ, వారి మరణాల గురించి కాకుండా.. ఘర్షణల్లో చనిపోయిన భద్రతా బలగాలను కీర్తించింది. "దేశవ్యాప్తంగా జరిగి సాయుధ, ఉగ్రవాద గ్రూపుల నిరసనలను అణచివేసే క్రమంలో భారీ సంఖ్యలో చాలా మంది అమరులు అయ్యారు" అని ఇరాన్ అమరుల ఫౌండేషన్ నేత అహ్మద్ మౌసావి పేర్కొన్నట్టు వార్తను ప్రసారం చేసింది. ఇక గురువారం రాత్రి నుంచి ఆందోళనకారులపై ఇరాన్ భద్రతాదళం ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌తోపాటు బసిజ్ మిలీషియా గ్రూపు కాల్పులకు దిగాయని.. 12 వేల మందికిపైగా మరణించారని, వేలాది మంది గాయపడ్డారని 'ఇరాన్ ఇంటర్నేషనల్' వార్త సంస్థ కథనం ప్రచురించింది. ఇరాన్ సుప్రీంలీడర్ ఖమేనీ స్వయంగా కాల్పులకు ఆదేశాలు ఇచ్చారని ఆరోపించింది. నిజానికి ఇరాన్‌లో ఇంటర్నెట్‌ను పూర్తిగా నిలిపివేయడం, విదేశాలకు ఫోన్‌కాల్స్‌ను నిషేధించడంతో గత ఐదారు రోజులుగా.. అక్కడేం జరుగుతోందో బయటి ప్రపంచానికి ఎలాంటి సమాచారం అందలేదు. మంగళవారమే విదేశాలకు ఫోన్‌కాల్స్‌ను పునరుద్ధరించారు. దీనితో ఇరాన్‌లోని అధ్యక్ష కార్యాలయ వర్గాలు, స్థానిక నేతలు, అధికారులు, ఆస్పత్రుల నుంచి సేకరించిన సమాచారాన్ని ఉటంకిస్తూ ఇరాన్ ఇంటర్నేషనల్ సంస్థ '12 వేల మంది ఇరానీయులను చంపి నిశ్శబ్దంగా ఉండలేరు' అంటూ కథనం ప్రచురించింది. "ఇరాన్‌లో విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ నిలిపివేయడం, వార్తా సంస్థలపై నియంత్రణలు పెట్టడం వంటి చర్యలు కేవలం భద్రత కోసం కాదు. నిజాలను తొక్కిపెట్టడం కోసమే. ఇరాన్‌లోని 31 రాష్ట్రాల్లో క్షేత్రస్థాయిలో స్థానికుల నుంచి అధ్యక్ష కార్యాలయం వర్గాలదాకా సమాచారం సేకరించి, క్షుణ్ణంగా విశ్లేషించాం. గురు, శుక్రవారాల్లో కనీవినీ ఎరుగని రీతిలో అణచివేత, హింస చోటు చేసుకున్నాయి. భద్రతాదళాలు కావాలనే ప్రణాళికతో కాల్పులు జరిపాయి. 12 వేల మందికిపైగా మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. మృతుల్లో చాలా వరకు 30 ఏళ్లు, ఆలోపు వయసున్న యువతే. దారుణ మారణకాండను ఎక్కువకాలం కప్పిపుచ్చలేరు. వాస్తవాలు బయటికి వస్తాయి.." అని పేర్కొంది. ఇక మృతుల సంఖ్యపై ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటనా చేయలేదు. కాగా, ఇరాన్ ప్రభుత్వం తుది ఘడియల్లో ఉందని, ఆ ప్రభుత్వానికి ఇక రోజులు, వారాలు మాత్రమే మిగిలి ఉన్నాయని జర్మనీ చాన్స్‌లర్ మెర్జ్ పేర్కొన్నారు. ఇరాన్ అధికారులు తక్షణమే ఆందోళనకారులపై హింసకు ముగింపు పలకాలన్నారు. 'ఏదైనా ప్రభుత్వం బలప్రయోగం ద్వారా అధికారాన్ని కాపాడుకుంటుంటే.. ఆ ప్రభుత్వం ముగింపు దశకు చేరినట్టే. ఇప్పుడు మనం ఇరాన్ ప్రభుత్వ చివరి రోజులను చూస్తున్నాం' అన్నారు.

ఇరాన్‌తో వాణిజ్యం చేసే దేశాలపై 25% అదనపు సుంకాలు



న్యూఢిల్లీ, జనవరి 13: ఇన్నాళ్లూ రష్యాతో వాణిజ్యం చేస్తున్నాయంటూ భారత్‌తోపాటు పలు దేశాలపై అదనపు సుంకాలు విధించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇప్పుడు ఇరాన్‌పై పడ్డారు. ఆ దేశంతో వాణిజ్యం చేసే దేశాలపై 25% అదనపు సుంకాలు విధిస్తున్నట్టు మంగళవారం ప్రకటించారు. "ఇరాన్‌తో వాణిజ్యం చేస్తున్న ఏ దేశమైనా సరే అమెరికాకు చేసే ఎగుమతులపై 25శాతం అదనపు సుంకాలు చెల్లించాల్సి ఉంటుంది. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది. ఇదే తుది నిర్ణయం" అని ట్రంప్ ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. ఆంక్షలు, సుంకాలు, ఇతర దౌత్యపరమైన మార్గాల్లో ఇరాన్‌పై ఒత్తిడి పెంచేందుకే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారని వైట్‌హౌజ్ మీడియా సెక్రెటరీ కరోలిన్ లీవిట్ మంగళవారం వెల్లడించారు. అయితే వైమానిక దాడులు సహా అన్ని ప్రతిపాదనలు సిద్ధంగానే ఉన్నట్టు తెలిపారు. కాగా, ట్రంప్ తాజా సుంకాలతో భారత్‌పై ప్రభావం స్వల్పంగానే ఉండనుంది. ఇరాన్‌తో భారత వాణిజ్యం ఏటా సుమారు రూ.15 వేల కోట్లు (1.7 బిలియన్ డాలర్లు) మాత్రమే. ప్రస్తుతం ఇరాన్‌కు భారత్ నుంచి ప్రధానంగా మందులు, తృణధాన్యాలు, పశుదాణా, టీ, కాఫీ, పండ్లు, కూరగాయలు, నట్స్, ఆర్గానిక్ రసాయనాలు, ఎగుమతి అవుతున్నాయి. ఆ దేశం నుంచి చమురు, ఖనిజ ఆధారిత ఇంధనాలు, శుద్ధీకరణ ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటున్నాం.

ప్రతీకార చర్యలు చేపడతాం: చైనా

ఇరాన్ ప్రధాన వాణిజ్య భాగస్వాములు చైనా, యూఏఈ, ఇరాక్ దేశాలే. ముఖ్యంగా ఇరాన్ నుంచి చైనాకు చవకగా చమురు సరఫరా అవుతుంది. తాజా ట్రంప్ అదనపు టారిఫ్‌ల ప్రభావం చైనాపై ఎక్కువగా ఉండనుంది. దీనితో చైనా స్పందించింది. "ఇరాన్‌తో వాణిజ్యం విషయంలో చైనా ప్రయోజనాలు, చట్టబద్ధమైన హక్కులను రక్షించుకునేందుకు చర్యలు చేపడతాం. అవసరమైతే ప్రతీకార చర్యలకూ దిగుతాం" అని హెచ్చరించింది. నిజానికి మదురో హయాంలో వెనెజువెలాతో చైనా సంబంధాలు బలోపేతం అయ్యాయి. గత ఏడాది వెనెజువెలా నుంచి రోజుకు 4లక్షల బ్యారెళ్ల చొప్పున చమురు తక్కువ ధరకే చైనాకు సరఫరా అయింది.

మీకోసం సాయం వస్తోంది!

- ప్రభుత్వ సంస్థలను స్వాధీనం చేసుకోండి
- ఇరాన్ ఆందోళనకారులకు ట్రంప్ పిలుపు

వాషింగ్టన్, జనవరి 13: ఇరాన్‌లో ఆందోళనలను మరింతగా రెచ్చగొట్టేలా ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. ఆందోళనలు చేస్తూనే ఉండాలని, ప్రభుత్వ సంస్థలను స్వాధీనం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సాయం అందించేందుకు వస్తున్నామనీ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. "ఇరాన్ దేశభక్తులారా.. ఆందోళనలు చేస్తూనే ఉండండి. మీ దేశ సంస్థలను స్వాధీనం చేసుకోండి. హింసకు పాల్పడుతున్నవారు, హంతకుల పేర్లు రాసిపెట్టుకోండి. వాళ్లు తగిన మూల్యం చెల్లించుకుంటారు. ఇరాన్‌లో ఆందోళనకారులపై చంపడం ఆపేదాకా ఆ దేశ అధికారులతో అన్నిరకాల భేటీలను రద్దు చేస్తున్నాను. మీకోసం సాయం వస్తోంది. మిగా(ఎంఐజీఏ)!!" అని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ వ్యాఖ్యలతో అమెరికా సైనిక చర్యకు సిద్ధమైందని సంకేతాలు అందినట్టేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ట్రంప్‌గానీ, వైట్‌హౌజ్ వర్గాలుగానీ దీనిపై ఏ స్పష్టతా ఇవ్వలేదు. ట్రంప్ పోస్టు చివరిలో 'మిగా' అని పేర్కొనడం ఆసక్తి రేపుతోంది. అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్ 'మాగా(మేక్ అమెరికా గ్రేట్ అగైన్)' నినాదాన్ని ఎత్తుకున్నారు. గెలిచాక కూడా ఆ పేరిట ఓ ప్రభుత్వ విభాగాన్నే ఏర్పాటు చేశారు. ఇప్పుడు 'మిగా' అని పేర్కొనడంతో.. ఆందోళనకారులకు 'మేక్ ఇరాన్ గ్రేట్ అగైన్' అంటూ ఇచ్చిన నినాదంగా కనిపిస్తోంది.

లోకం తీరు



'10 నిమిషాల' డెలివరీ.. ఇక రద్దు!

న్యూఢిల్లీ, జనవరి 13: తినే ఆహార పదార్థాల నుంచి నిత్యావసర సరుకుల వరకు ఆన్‌లైన్‌లో బుక్ చేసిన 10 నిమిషాల్లోనే ఇంటికి చేరుస్తామంటూ బ్లింకిట్, జెప్టో, స్విగ్గీ, జొమాటో, అమెజాన్ వంటి సంస్థలు ప్రకటనలు ఇస్తున్న విషయం తెలిసిందే. ప్రకటనలకు అనుగుణంగా.. కేవలం 10 నిమిషాల్లోనే వినియోగదారులు బుక్ చేసుకున్న పదార్థాలు, వస్తువులను గిగ్ వర్కర్ల ద్వారా గడప వద్దకు చేరుస్తున్నాయి. అయితే.. ఈ నిర్దేశిత సమయాన్ని ఎత్తివేయాలని.. తమకు భద్రత కల్పించాలని గిగ్ వర్కర్లు దేశవ్యాప్త ఆందోళన చేపట్టారు. దీంతో ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంది. ఆన్‌లైన్ క్విక్ ప్లాట్‌ఫామ్ సంస్థలతో కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మంగళవారం చర్చలు జరిపారు. వర్కర్ల భద్రత దృష్ట్యా డెలివరీకి నిర్దేశించిన 10 నిమిషాల సమయాన్ని ఎత్తివేయాలని సూచించారు. దీనికి ఆయా సంస్థలు సానుకూలంగా స్పందించాయి. తక్షణమే 10 నిమిషాల నిర్దేశిత సమయాన్ని ఎత్తివేస్తున్నట్టు 'బ్లింకిట్' తెలిపింది. మిగిలిన సంస్థలు త్వరలోనే ఈ నిర్ణయాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చాయి. అంతేకాదు.. ఆయా సంస్థలు తమ ప్రకటనల నుంచి అదేవిధంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫాంల నుంచి కూడా '10 నిమిషాల నిర్దేశిత డెలివరీ' హామీని తొలగించనున్నాయి. కాగా, 10 నిమిషాల డెలివరీ సమయాన్ని నిర్దేశించడం.. తమకు తీవ్ర ఇబ్బందిగా మారిందని, తమకు భద్రత లేకుండా పోయిందని గిగ్ వర్కర్లు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్.. గత ఏడాది డిసెంబరు25-31 మధ్య దేశవ్యాప్తంగా సమ్మెకు దిగారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయా సంస్థలు 10 నిమిషాల సమయాన్ని తొలగించేందుకు నిర్ణయించాయి.

అవినీతి అధికారులపై విచారణకు ముందస్తు అనుమతి అవసరమా?

- వద్దని ఒకరు, కావాలని మరొకరు
- సుప్రీం ద్విసభ్య ధర్మాసనం భిన్న తీర్పులు

న్యూఢిల్లీ, జనవరి 13: అవినీతిపర సిఫార్సులు చేసిన ప్రభుత్వ అధికారులపై విచారణ జరిపేందుకు సంబంధిత కాంపిటెంట్ అథారిటీ నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలా? వద్దా? అనే అంశంపై సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం మంగళవారం భిన్నమైన తీర్పు ఇచ్చింది. అవినీతి అధికారులపై విచారణ జరిపేందుకు ఎలాంటి అనుమతులు అవసరం లేదని జస్టిస్ నాగరత్న తీర్పు చెప్పగా, వేధింపులకు గురికాకుండా నిజాయితీపరులైన అధికారులను రక్షించేందుకు ఈ నిబంధనను కొనసాగించాల్సిన అవసరం ఉందని జస్టిస్ విశ్వనాథన్ అభిప్రాయపడ్డారు. అవినీతి నిరోధక చట్టం-1988కు 2018 జులైలో సవరణ చేసిన ప్రభుత్వం ప్రత్యేకంగా 'సెక్షన్ 17ఏ'ను పొందుపరిచింది. దీని ప్రకారం విధి నిర్వహణలో భాగంగా ఏ పబ్లిక్ సర్వెంట్ అయినా చేసిన సిఫార్సులు అవినీతిపూరితంగా ఉన్నాయని భావించినప్పుడు సంబంధిత కాంపిటెంట్ అథారిటీ ముందస్తు అనుమతి తీసుకోకుండా పోలీసులు వారిపై 'విచారణ, పరిశీలన, దర్యాప్తు' చేయకూడదు. ఈ సవరణ అవినీతి నిరోధక చట్టం స్ఫూర్తికే విరుద్ధంగా ఉందని పేర్కొంటూ సెంటర్ ఫర్ పబ్లిక్ లిటిగేషన్(సీపీఐఎల్) స్వచ్ఛంద సంస్థ పిటిషన్ వేసింది. కాంపిటెంట్ అథారిటీ అంటే ప్రభుత్వమేనని, అవినీతి అధికారులపై దర్యాప్తునకు అది ఎప్పుడూ అనుమతులు ఇవ్వదని వాదించింది.

కుక్కలపై ప్రేమ.. మనుషులపై ఏదీ?

వీధి కుక్కలకు తిండి పెట్టాలంటే ఇళ్లకు తీసుకుపొండి.. అవి బయట జనాన్ని కరవడమెందుకు?

- శునకప్రియులకు సర్వోన్నత న్యాయస్థానం సూచన



న్యూఢిల్లీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలకు తిండి పెడుతున్నామనే వారు.. వాటిని తమ ఇళ్లకు తీసుకెళ్లి ఆ పని చేయాలని సుప్రీంకోర్టు సూచించింది. కుక్కల మీద ప్రేమలో కాస్తంతైనా మనషులపై ముఖ్యంగా అనాథ పిల్లల మీద ఎందుకు చూపించడం లేదని కుక్కల తరపున వాదిస్తున్న న్యాయవాదులను ప్రశ్నించింది. ఇక నుంచి ప్రతికుక్క కాటుకు, ప్రతి ప్రాణనష్టానికి రాష్ట్రప్రభుత్వాలే బాధ్యత వహించి భారీ పరిహారం చెల్లించేలా ఆదేశాలు ఇస్తామని స్పష్టం చేసింది. అలాగే, కుక్కలకు ఆహారం పెట్టేవారు కూడా బాధ్యత వహించేలా ఆదేశాలు ఇస్తామని తెలిపింది. వీధికుక్కల తరపున చాలమంది న్యాయవాదులు వాదిస్తున్నారని, కానీ మనషుల తరపున వాదించేవారు ఎవరూ లేరని ఆవేదన వ్యక్తం చేసింది. కుక్కకాటు వల్ల పిల్లలు, వృద్ధులు చనిపోతుంటే ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయని ప్రశ్నించింది. గేటెడ్ కమ్యూనిటీల్లో 95% మందికి ఇష్టం లేకపోయినా, కేవలం 5% మంది కుక్కల ప్రేమికుల కోసం అందరూ భయపడుతూ బతకాలా? అని కోర్టు నిలదీసింది. వీధికుక్కలను ప్రత్యేక షెల్టర్లకు తరలించాలంటూ నిరుడు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. "తొమ్మిదేళ్ల ఓ చిన్నారిపై కుక్క దాడి చేస్తే.. దానికి బాధ్యులెవరు? వీధికుక్కలకు తిండి పెడుతున్న సంస్థా? ఈ సమస్యను మేం కళ్లు మూసుకుని పట్టించుకోకుండా ఉండాలని మీరు కోరుకుంటున్నారా?" అని జస్టిస్ సందీప్ మెహతా ప్రశ్నించారు. అలాగే.. వీధికుక్కలను సంరక్షించే, వాటికి తిండిపెట్టే మహిళలు వేధింపులకు గురవుతున్నారన్న ఫిర్యాదును పరిశీలించేందుకు కోర్టు తిరస్కరించింది. పోలీసు స్టేషన్లలో కేసు పెట్టొచ్చని సూచించింది.

మనుషుల గురించి వాదించట్లేదు..

ఢిల్లీలో దాదాపు 200 వీధికుక్కలకు ఆహారం పెడుతూ.. 'డాగ్ అమ్మ'గా పేరొందిన 80 ఏళ్ల ప్రతిమాదేవి అనే వృద్ధురాలి తరపున ఈ కేసులో సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది వైభవ్ గగ్గర్ వాదనలు వినిపించారు. వీధికుక్కల దత్తతపై ఒక విధానాన్ని పరిగణనలోకి తీసుకోవాలని.. ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించారు. దీనికి జస్టిస్ సందీప్ మెహతా.. "నేను ఇక్కడికి పదోన్నతిపై 2011లో వచ్చా. అప్పట్నుంచీ ఇప్పటిదాకా నేను విన్న అతి సుదీర్ఘమైన వాదనలు ఇవే. ఇప్పటిదాకా మనుషుల గురించి, అనాథ పిల్లల దత్తత గురించి ఎవరూ ఇంతలా వాదించలేదు" అని తీవ్రవ్యాఖ్యలు చేశారు. "వీధికుక్కలకు సంబంధించిన అంశాలు భావోద్వేగ పూరితమైనవి" అని మరో సీనియర్ న్యాయవాది మేనక పేర్కొనగా.."ఆ భావోద్వేగాలు కేవలం కుక్కల పట్ల మాత్రమే కనిపిస్తున్నాయి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.విచారణను 20కి వాయిదా వేసింది.

వితంతు కోడలికి మామ నుంచి భరణం

మామకు చెందిన ఎస్టేట్ నుంచి వితంతువైన కోడలికి భరణం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మామ మరణించిన తరువాత కూడా ఆ ఎస్టేట్ ద్వారా భరణం పొందే హక్కు ఆమెకు ఉందని తెలిపింది. హిందూ లా ప్రకారం ఆశ్రితులను పోషించే బాధ్యత వారసులు అందరిపైనా ఉంటుందని తెలిపింది. ఆ వితంతువుకు ఆదాయ మార్గం లేనప్పుడు ఆమెను ఆశ్రితురాలిగా పరిగణించాలంది.

కలిసిన కుడి, ఎడమ!

- బీజేపీ హెడ్‌క్వార్టర్స్‌లో కమలం నేతలతో చైనా కమ్యూనిస్ట్ పార్టీ నాయకుల భేటీ
- ఆర్ఎస్ఎస్ నేత హోసబలేతో కూడా


బీజేపీ హెడ్‌క్వార్టర్స్‌లో చైనా ప్రతినిధులు

న్యూఢిల్లీ, జనవరి 13 : చైనా కమ్యూనిస్టు పార్టీకి చెందిన ప్రతినిధి బృందం బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలతో వరుస భేటీలు నిర్వహించింది. సోమవారం ఢిల్లీకి చేరుకున్న ఈ బృందం బీజేపీ ప్రధాన కార్యాలయంలో పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్‌ను కలుసుకుని చర్చించింది. ఇరు పార్టీల మధ్య సంబంధాలను మెరుగుపరుచుకోవడం గురించి ఈ సందర్భంగా చర్చలు జరిపినట్టు బీజేపీ విదేశీ వ్యవహారాల విభాగం ఇన్‌చార్జి విజయ్ చౌతాలా 'ఎక్స్'లో తెలిపారు. సాధారణ ప్రక్రియలో భాగంగానే ఇరు పార్టీల మధ్య ఈ భేటీ జరిగినట్టు వివరించారు. మంగళవారం చైనా బృందం ఆర్ఎస్ఎస్ ముఖ్య నేత దత్తాత్రేయ హోసబలేను ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో కలిసింది. ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ మాత్రమేనని ఆర్ఎస్ఎస్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. చైనా బృందం కోరిన మీదట వారిని కలిసినట్టు ఈ వర్గాలు పేర్కొన్నాయి. ఈ బృందానికి చైనా ఉప మంత్రి (విదేశీ వ్యవహారాలు) సున్ హైయాన్ నేతృత్వం వహించారు. భారత్‌కు చైనా రాయబారి ఝూ ఫిహాంగ్ కూడా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో జరిపిన చర్చల్లో పాలుపంచుకున్నారు. కాగా, చైనా బృందం మంగళవారం కాంగ్రెస్ విదేశీ విభాగం ఇన్‌చార్జి సల్మాన్ ఖుర్షీద్‌ను కలుసుకుంది. చైనా బృందం కోరిన మీదట కేంద్ర ప్రభుత్వం అనుమతితోనే ఈభేటీ జరిగినట్టు ఏఐసీసీ మీడియా విభాగం ఇన్‌చార్జీ పవన్ ఖేడా చెప్పారు. కాగా, చైనా కమ్యూనిస్టు పార్టీకి చెందిన ప్రతినిధి బృందాన్ని బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు కలవడంపై కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనతే విమర్శలు గుప్పించారు. "ఆపరేషన్ సిందూర్‌లో పాక్‌కు మద్దతు ఇచ్చి, అరుణాచల్‌ప్రదేశ్‌లోని భూభాగాలను ఆక్రమించుకొని గ్రామాలను చైనా నిర్మిస్తోంది. గాల్వాన్‌లో మన వీర జవాన్లు అమరులయ్యారు. జమ్మూకశ్మీర్‌లోని శాక్స్‌గామ్ వ్యాలీని తనదిగా ఇప్పటికీ చైనా చెప్పుకొంటోంది. అలాంటి చైనాకు చెందిన ప్రతినిధి బృందంతో బీజేపీ నేతలు ఆలింగనాలను పంచుకోవడం ఏమిటి? టెండర్లలో పాల్గొనకుండా చైనాకు చెందిన కంపెనీలపై ఉన్న నిషేధాన్ని కేంద్రం సడలిస్తోంది. ఈ రహస్య ఒప్పందాన్ని బయటపెట్టాలి" ఆమె విమర్శలు గుప్పించారు.

11వ తరగతిలోనే ప్రవేశ పరీక్షలు

మల్టిపుల్ చాయిస్ ప్రశ్నల తరహాలో ప్లస్ టూ ఎగ్జామ్స్

- బోర్డు పరీక్షల స్థాయిలోనే ఎంట్రన్స్
- ప్రతిపాదనలపై కేంద్రం కసరత్తు
- కోచింగ్ సెంటర్ల ఆగడాలను అరికట్టడమే లక్ష్యం

న్యూఢిల్లీ, జనవరి 13: ప్లస్ టూ (ఇంటర్మీడియట్) పూర్తిచేసిన విద్యార్థులకు నిర్వహించే కీలక ప్రవేశ పరీక్షలన్నింటినీ.. ఇంటర్ ఫస్టియర్/11వ తరగతి పూర్తవగానే నిర్వహించే ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఒక కమిటీ కసరత్తు చేస్తోంది. విద్యార్థులపై 12వ తరగతిలో ఉండే తీవ్రమైన ఒత్తిడిని, కోచింగ్ సెంటర్ల మీద విద్యార్థులు ఆధారపడటాన్ని తగ్గించే లక్ష్యంతో ఇది జరుగుతోందని సంబంధిత వర్గాలు తెలిపాయి. కోచింగ్ సెంటర్లలో పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు, అగ్నిప్రమాదాలు, మౌలిక సదుపాయాల లేమి, విద్యార్థులపై ఒత్తిడి పెంచే బోధన విధానాలపై ఫిర్యాదుల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ గతేడాది 9 మంది సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వినీత్ జోషి సారథ్యంలోని ఈ కమిటీలో సీబీఎస్ఈ, ఎన్‌సీఈఆర్‌టీ, ఐఐటీ తదితర సంస్థలకు చెందిన వారు సభ్యులుగా ఉన్నారు. సమస్యలపై అధ్యయనంలో భాగంగా కమిటీ ముందు పలు ప్రతిపాదనలు వచ్చాయని.. 11వ తరగతి/ఇంటర్ ఫస్టియర్ పూర్తికాగానే ప్రవేశ పరీక్షలకు అనుమతించడం వాటిలో ఒకటని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ వర్గాల ప్రకారం కమిటీ పరిశీలించిన ఇతర ప్రతిపాదనలు ఇలా ఉన్నాయి..

- 11వ, 12వ తరగతుల పరీక్షలను కూడా ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ తరహాలో 'మల్టిపుల్ చాయిస్ ప్రశ్నల' విధానంలో నిర్వహించాలి.
- ఎంట్రెన్స్ పరీక్షల కఠినత స్థాయి (డిఫికల్టీ లెవెల్) 12వ తరగతి పరీక్షల స్థాయిలోనే ఉంటోందా లేదా? ఆ రెండింటినీ ఒకే స్థాయిలో నిలిపేలా పాఠ్యప్రణాళికలో చేయాల్సిన మార్పులేమిటి?
- బోర్డు పరీక్షల్లో వచ్చిన మార్కులకు మరింత వెయిటేజీ ఇవ్వటం.
- కోచింగ్ సెంటర్లపై విద్యార్థులు ఆధారపడేలా చేస్తున్న విద్యావిధానంలోని లోపాలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలి. కోచింగ్ వేళల్ని తగ్గించటం తదితర ప్రతిపాదనల్ని కేంద్ర ప్రభుత్వ కమిటీ పరిశీలిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

గిగ్ వర్కర్లకు ఊరట

గిగ్ వర్కర్ల జీవితాలతో చెలగాటమాడుతున్న ఆ పది నిముషాల ప్రమాణాన్ని క్విక్‌కామర్స్ సంస్థలు వెనక్కు తీసుకోవడం బాగుంది. కేంద్రమంత్రి మాన్సుఖ్ మాండవీయ జోక్యం, ఒత్తిడి కారణంగానే ఇది సాధ్యపడింది. పలు క్విక్‌కామర్స్ సంస్థలు పది నిముషాల్లోనే కస్టమర్లకు ఆర్డర్లను డెలివరీ చేస్తామంటూ ఊరించి, తదనుగుణంగా ఈ వర్కర్లను పరుగులు తీయిస్తున్న అమానవీయ విధానానికి తెరపడినందుకు సంతోషించాలి. దాదాపు అన్ని ప్రధాన సంస్థలూ తమ అప్లికేషన్లనుంచి 'టెన్‌మినిట్ డెలివరీ' ప్రమాణాన్ని ఉపసంహరించుకొని, డెలివరీ చేయగల కనిష్ఠ సమయాన్ని మాత్రం చూపిస్తున్నాయట. ఇది పదినిముషాలకు కాస్త అటూఇటూగా ఉంటున్నదంటూ సామాజిక మాధ్యమాల్లో కొందరు ఆక్షేపిస్తున్నప్పటికీ, గడువులు, హామీల పేరిట గిగ్‌వర్కర్లను వాయువేగంతో ప్రయాణాలు చేయించే ప్రస్తుత విధానం సడలినందుకు సంతోషించాల్సిందే.

పదినిముషాల మాటకు కట్టుబడి పనిచేయడానికీ, త్వరితంగా సరుకులు చేరవేయడానికీ తేడా ఉంది. ట్రాఫిక్‌లో సిగ్నల్ జంప్‌లు చేయడం, అడ్డుతోవలో చొచ్చుకురావడం వంటివి చూసినప్పుడు గిగ్ వర్కర్ల మీద మిగతా జనాలకు సహజంగానే ఆగ్రహం కలుగుతుంది. కానీ, చుట్టూ తిరిగి వస్తే సమయం మించిపోతుందన్న భయం, గడువు లోగా డెలివరీ ఇవ్వాలన్న ఆత్రం వారితో ఇటువంటి పనులు చేయిస్తుంది. బుక్‌చేసిన పది నిముషాల్లో కస్టమర్ల చేతికి కోరింది చేరుతుంది కానీ, అందుకోసం ఈ కుర్రాళ్ళు తమ భద్రతనీ, ప్రాణాలను పణంగా పెట్టవలసి వస్తోంది. మానసికంగానూ, భౌతికంగానూ తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్న డెలివరీ కుర్రాళ్ళపాలిట ఆ పదినిముషాలు శాపంగా పరిణమించాయి. ఒక పక్క మొబైల్‌లో దారి వెతుక్కుంటూ మరోపక్క వినియోగదారుల హెచ్చరికల మధ్య గాలితో పోటీపడి రెండు చక్రాల వాహనం మీద వీరు ఎగరవలసి వస్తోంది. కిందపడిపోవడం, ఒళ్ళంతా చీరుకుపోవడం, వాహనాలు దెబ్బతినడం ప్రతీ గిగ్‌వర్కర్‌కు సహజమైన అనుభవం. కాళ్ళూచేతులు విరిగినా, ఆస్పత్రుల పాలైనా వారిని పట్టించుకొనే అవసరం, బాధ్యత కంపెనీలకు లేదు. 'ఇండిపెండెంట్ కాంట్రాక్టర్' అన్న నిర్వచనంతో గిగ్‌వర్కర్లను దూరం పెడుతున్న ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ వారితో గొడ్డుచాకిరీ చేయించుకుంటున్నాయి. అంతిమంగా, వీరి కష్టాన్ని కంప్యూటర్లు, ఆల్గరిథమ్స్ లెక్కగట్టి, కొద్ది క్షణాల జాప్యానికే భారీగా కోతలు విధిస్తాయి. ఆ లెక్కలకు, శిక్షలకు ప్రాతిపదికలు ఏమిటో సదరు 'ఇండిపెండెంట్ కాంట్రాక్టర్'కు తెలియదు. జాతీయ మానవహక్కుల సంస్థకు గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ సర్వీస్ వర్కర్స్ యూనియన్ చేసిన ఫిర్యాదులో దీనిని నిర్బంధ కార్మిక విధానంగా అభివర్ణించింది. దీనికితోడు, కస్టమర్ల క్రౌర్యాలు, అవహేళనలను నోరు మెదపకుండా భరించవలసి రావడమే కాదు, ఆ ఫిర్యాదులు ఏకంగా ఈ అర్భకుల జీవితాలనే ప్రభావితం చేస్తాయి.

దాదాపు 80 శాతం మంది డెలివరీ బాయ్స్ ఆదాయం ఏడాదికి రెండున్నర లక్షల రూపాయలలోపేనని చాలా సర్వేలు లెక్కగట్టాయి. కేవలం రెండుశాతం మాత్రమే ఐదులక్షల పరిధి దాటారట. రోజుకు పన్నెండు నుంచి పదహారు గంటలపాటు కాళ్ళకు చక్రాలు కట్టుకొని కాలంతో పోటీపడుతూ తిరిగే వీరు ఎండ, వాన, చలి లెక్కచేయకుండా మనకు ఏది కావాలంటే అది క్షణాల్లో తెచ్చిపెడతారు. జలప్రళయాలకు సైతం ఎదురీదుతూ వీరు విధులు నిర్వహిస్తున్న దృశ్యాలను ఇటీవలి వర్షాలు, తుపానుల్లో చూశాం. తమకు ఓ గుర్తింపు కావాలని, ఆరోగ్య బీమా, కష్టానికి తగిన ప్రతిఫలం దక్కాలని, అర్థంలేని శిక్షలు వేయవద్దని డిమాండ్ చేస్తూ కొత్త సంవత్సరం ప్రవేశానికి ఒకరోజు ముందు గిగ్ వర్కర్లు చేసిన ఆకస్మిక సమ్మె ఈ కొత్త నిర్ణయానికి కారణం కావచ్చు. టెన్‌మినిట్ డెలివరీ రద్దు అందులో ప్రధానమైన అంశం. అప్పట్లో కొన్ని డిమాండ్లకు ఒప్పుకున్న సంస్థలు, ఈ విషయంలో మాత్రం దిగిరాలేదు. కొత్త లేబర్‌కోడ్స్ అమలులోకి వస్తున్న నేపథ్యంలో, వాటిలో గిగ్‌వర్కర్ల సంక్షేమానికి పెద్దపీట వేశామని ప్రభుత్వం చెప్పుకుంటున్న తరుణంలో, క్విక్‌కామర్స్ సంస్థలను దారికి తేవడం అవసరమని పాలకులు భావించి ఉంటారు. లేబర్‌కోడ్స్‌తో గిగ్‌వర్కర్లకు పూర్తిన్యాయం జరగదన్న విమర్శలను అటుంచితే, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం చేయాల్సింది చాలా ఉంది. సంక్షేమబోర్డులు, సంక్షేమనిధి వంటివి ఏర్పాటైతే వాటిద్వారా కార్మికులు తక్షణసాయం పొందే వీలుంటుంది.

ఒక పరాయి దేశాన్ని సైనిక, సాంకేతిక సామర్థ్యంతో దురాక్రమించడం ద్వారా ఆ దేశ సంపదను దోచుకోవడం అంత సులభతరమా? అయిన పక్షంలో ప్రపంచంలోకెల్లా శ్రేష్ఠతరమైన నాణ్యత ఉన్న చమురుగా వాసికెక్కిన ఇరాక్ చమురు నిక్షేపాలపై ఆధిపత్యాన్ని నిలబెట్టుకోకుండా ఆ దేశం నుంచే అమెరికా ఎందుకు నిష్క్రమించింది?

వెనెజువెలాలో అమెరికా అభీష్టం నెరవేరేనా?

చమురు విపణిపై ఆధిపత్యం అనేది అమెరికా విదేశాంగ విధానాన్ని నిర్ణయాత్మకంగా నిర్దేశించే అంశాలలో ముఖ్యమైనది. వెనెజువెలాను దురాక్రమించడం ద్వారా చమురు రాజకీయాగ్నులను ఎగదోసి, ప్రపంచ దేశాలతో సరికొత్త చెలగాటానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ శ్రీకారం చుట్టారు.

ఇప్పుడు వెనెజువెలా, అంతకు ముందు ఇరాన్, ఇరాక్, లిబియాలతో అగ్రరాజ్యానికి ఉన్న వైరానికి చమురు ప్రధాన కారణమని ప్రత్యేకంగా చెప్పవల్సిన అవసరం లేదు. తమ జాతీయ ప్రయోజనాలకు ఏ దేశమూ చమురు విషయంలోగానీ, మరే సహజసంపద విషయంలో గానీ స్వతంత్రంగా వ్యవహరించడం అమెరికాకు సుతరామూ గిట్టదు గాక గిట్టదు.

చమురు నిల్వలు సమృద్ధిగా ఉన్న దేశాలపై దండయాత్ర చేయడమనేది అమెరికాకు ఇదేమీ మొదటిసారి కాదు. ఇతర దేశాలలో జోక్యం మూలంగా అమెరికాకు వాటిల్లిన నష్టాల గురించి ట్రంప్ గత ఏడాది తన ఎన్నికల ప్రచారంలో తరచూ ప్రస్తావించారు. తత్కారణంగా అంతర్జాతీయ వ్యవహారాలలో గత అధ్యక్షుల వలే కాకుండా భిన్న విధానాలను ట్రంప్ అనుసరించవచ్చునని భావిస్తున్న తరుణంలో వెనెజువెలా ఉదంతం చోటుచేసుకోవడం అమెరికా ప్రజానీకాన్ని దిగ్భ్రాంతిపరిచింది.

గల్ఫ్ లేఖ

వెనెజువెలా సహజసంపదపై పెత్తనం చెలాయించే ప్రయత్నాలను ప్రపంచ ప్రజలూ నిశితంగా గమనిస్తున్నారు.

దేశాలను దురాక్రమించినంత మాత్రాన తాను ఆశించిన రీతిలో చమురు సంపదను ఉత్పత్తి చేయడం అమెరికాకు సాధ్యమవుతుందా? ఇరాక్, లిబియా దేశాల ఉదంతాల నుంచి అమెరికా గుణపాఠం నేర్చుకోలేదని అనిపిస్తోంది. చమురు ఉత్పత్తి సామర్థ్యం పెంపుదల అనేది నిరంతర కృషి, భారీ పెట్టుబడులతో కూడిన వ్యవహారం. ఏ వ్యాపార సంస్థ అయినా తమ పెట్టుబడులకు రాబడులు వస్తాయని ప్రగాఢంగా విశ్వసించిన చోట మాత్రమే మదుపులు చేస్తుంది. చమురు నిక్షేపాలను వెలికితీయడానికి భౌగోళిక పరిస్థితులతో పాటు ఆయా ప్రాంతాలలోని ప్రజా సహకారం కూడా అవసరం. స్థానికుల తోడ్పాటు లేకుండా పురోగతి అసాధ్యమనే విషయాన్ని ఇరాక్, లిబియాలను చూస్తే తెలుస్తోంది. జీవాయుధాలు, అణ్వస్త్రాలతో తమ ప్రజలపై దాడులు చేస్తోందనే వ్యూహాత్మక తప్పుడు ప్రచారంతో జార్జి బుష్ 2003లో ఇరాక్‌ను దురాక్రమించారు. ఆ కాలంలో చమురు ఉత్పాదక దేశాల కూటమి (ఒపెక్)లో సౌదీ అరేబియా తర్వాత రెండవ స్థానంలో ఇరాక్ ఉంది. అమెరికా, దాని మిత్ర దేశాల సైనిక బలగం, ఇరాక్‌లోని అసమ్మతి, తిరుగుబాటు దళాలు, తెగల



సహాయం ఉన్నప్పటికీ అమెరికన్ చమురు సంస్థలు తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఇతోధికంగా పెంపొందించుకోవడంలో విఫలమయ్యాయి. లిబియాలో ఆ దేశాధినేత గడాఫీని హతమార్చి ఆ చమురు ఉత్పాదక దేశాన్ని అమెరికా హస్తగతం చేసుకున్నది. అమెరికా లేదా ఐరోపా చమురు సంస్థలు ఏవీ కూడా ఇప్పటికీ లిబియాలో తమ ప్రతాపాన్ని చూపలేకపోతున్నాయనేది ఒక నమ్మవలసిన వాస్తవం.

ఒక పరాయి దేశాన్ని సైనిక, సాంకేతిక సామర్థ్యంతో దురాక్రమించడం ద్వారా ఆ దేశ సంపదను దోచుకోవడం అంత సులభతరమా? అయిన పక్షంలో ప్రపంచంలోకెల్లా శ్రేష్ఠతరమైన నాణ్యత ఉన్న చమురుగా పేరున్న ఇరాక్ చమురు నిక్షేపాలపై ఆధిపత్యాన్ని నిలబెట్టుకోకుండా ఆ దేశం నుంచే అమెరికా ఎందుకు నిష్క్రమించింది?

స్వల్ప మోతాదులో సల్ఫర్ ఉండి, అధిక మొత్తంలో పెట్రోలును తక్కువ వ్యయంతో విడుదల చేసే ఇరాక్ చమురుకు, వెనెజువెలా చమురుకు మధ్య పెద్ద వ్యత్యాసం ఉంది. ఇరాక్ ఎడారిలో తక్కువ లోతులో లభించే క్రూడ్‌లో ఎక్కువ మోతాదులో పెట్రోలు వెలువడుతుంది. ఆ తరువాత ప్లాస్టిక్ ఉత్పత్తి, ఆటోమొబైల్ పరిశ్రమల్లో వినియోగించే రసాయనాలు వెలువడుతాయి. ఇరాక్‌తో పాటు అరబ్బు దేశాలలో ఉత్పత్తి అయ్యే ఈ రకం చమురు తేలికగా ఉంటుంది. భారతదేశంలోని అన్ని రిఫైనరీలకు దీన్ని సునాయాసంగా శుద్ధి చేసే సామర్థ్యం ఉంది. వెనెజువెలాలో సాధారణంగా నీళ్ళ కింద లభించే క్రూడ్‌లో సల్ఫర్ అధికంగా ఉంటుంది. దట్టంగాను, జిగటగాను ఉంటుంది. దీని నుంచి డీజిల్ ఎక్కువ మోతాదులో వెలువడుతుంది. ఆ తర్వాత తారు ఉత్పన్నమవుతుంది. పెట్రోలు, రసాయనాల భాగం తక్కువగా ఉంటుంది. క్రూడ్‌ను పైపుల ద్వారా రవాణా చేయడానికి అందులో అదనంగా రసాయనాలు కలపవలసి ఉంటుంది. పైగా వెనెజువెలా క్రూడ్‌ను శుద్ధిచేయడం రిఫైనరీలకు అదనపు వ్యయంతో కూడుకున్న పని. భారతదేశంలో ఇటువంటి క్రూడ్‌ను శుద్ధి చేసే రిఫైనరీ ఒక్కటే ఉన్నది. అది రిలయెన్స్ కంపెనీది. విశాఖతో సహా మిగిలిన రిఫైనరీలకు వెనెజువెలా తరహా క్రూడ్‌ను శుద్ధి చేయడమనేది అదనపు పని భారం.

మరో ముఖ్యమైన వాస్తవం– చమురు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడానికి యంత్రసామగ్రి, విశాల భూభాగంలో పైపు లైన్ల కొరకు భారీ పెట్టుబడులు అవసరం. దీని ఫలితాలు రావడానికి కనిష్ఠంగా పది సంవత్సరాల కాలం పడుతుంది. అప్పటికి అమెరికా విధానం ఏ విధంగా ఉంటుందో చెప్పలేం. చమురు ఉత్పత్తి సామర్థ్యం పెంపుదలకు ఇంతకు ముందే చెప్పినట్లుగా నిరంతర కృషి, భారీ పెట్టుబడులతో పాటు ముందు చూపుతో కూడిన దీర్ఘకాలిక ప్రణాళికలు అవసరం. సత్వర లాభాపేక్షతో వ్యవహరించే అమెరికా సంస్థలు అందుకు సిద్ధంగా ఉన్నాయా అనేది సందేహమే. ప్రపంచవ్యాప్తంగా ధరలు పతనమవుతున్న ప్రస్తుత తరుణంలో స్థానిక ప్రజాభీష్టానికి విరుద్ధంగా వెనెజువెలాలో జూదమాడడానికి అమెరికన్ చమురు సంస్థలు ఎంత వరకు ఇష్టపడతాయి? ఈ విషయంపైనే అమెరికా విదేశాంగ విధాన సాఫల్యం ఆధారపడి ఉంది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

బెంగాల్‌లో బీజేపీ గెలవగలదా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

పాత ఏడాది చివరి ఘడియల్లోనూ కొత్త ఏడాది ఆగమిస్తున్న వేళ చాలా మంది రాజకీయనాయకులు తమ కుటుంబసభ్యులతో ఉల్లాసంగా గడపాలని భావిస్తారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా భిన్నమైన వ్యక్తి. ఆయన తరహాయే వేరు. డిసెంబర్ 31న ఆయన పశ్చిమబెంగాల్‌లో ఉన్నారు. మరో రెండు నెలల్లో రానున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలకు తమ పార్టీ నేతలను ఆయన సమాయత్తం చేశారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక సంస్థల కౌన్సిలర్లు, పార్టీలో కీలక పదవుల్లో ఉన్న వారితో ఆయన సమాలోచనలు జరిపారు. అసెంబ్లీ నియోజకవర్గాల మ్యాప్ లను ప్రదర్శించి, 294 స్థానాలకు గాను 162 స్థానాల్లో పార్టీ గెలిచే అవకాశాలున్నాయని, 49 స్థానాల్లో హోరాహోరీ పోరాడవలసి ఉంటుందని, 83 స్థానాల్లో బలహీనంగా ఉన్నామని వెల్లడించారు. పోలింగ్ బూత్‌ల వారీ వివరాలు, జిల్లా నివేదికలు, గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం ఆధారంగా సమీక్షలు నిర్వహించారు. రాష్ట్రాన్ని ఐదు జోన్లుగా విభజించి, ఏఏ జోన్లలో ఏ స్థాయిలో ప్రచారం నిర్వహించాలో సూచించారు. కేంద్ర హోం మంత్రి పర్యటనతో ఈ జనవరి 17, 18 తేదీల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పశ్చిమబెంగాల్ పర్యటనకు రంగం సిద్ధమయింది. రెండు రోజులు సుడిగాలి పర్యటన జరిపే మోదీ జనవరి 18న హౌరాలో భారీ ర్యాలీనుద్దేశించి ప్రసంగించనున్నారు.

బిహార్ ఎన్నికల తర్వాత మోదీ, అమిత్ షా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్న ఎన్నికలు పశ్చిమ బెంగాల్‌వే, సందేహం లేదు. ప్రతి ఎన్నికనూ జీవన్మరణ సమస్యగా తీసుకునే ఈ నేతలు బెంగాల్‌లో ఈసారి సర్వశక్తులు ఒడ్డేందుకు సిద్ధపడుతున్నారు. బెంగాల్ ఎన్నికలు సాధారణమైనవి కావని వారికి తెలుసు. తమిళనాడు, కేరళలో బలం పుంజుకోవడం, అస్సాం, పుదుచ్చేరిలో ఉన్న ప్రభుత్వాలను కాపాడుకోవడం కంటే పశ్చిమబెంగాల్‌లో అధికారాన్ని తృణమూల్ కాంగ్రెస్ నుంచి హస్తగతం చేసుకోవడమే చాలా చాలా ముఖ్యం.

గత 14 సంవత్సరాలుగా అధికారంలో ఉన్న మమతా బెనర్జీని గద్దెదించడమే ధ్యేయంగా బీజేపీ పావులు కదుపుతోంది. అక్కడ వామపక్షాలకు కానీ, కాంగ్రెస్‌కు కానీ కాషాయ పార్టీ ధాటిని సమర్థంగా ఎదుర్కొనే శక్తి లేదు. ఒక్క మమతా బెనర్జీని దెబ్బతీస్తే బెంగాల్‌లో తమకు తిరుగులేదని బీజేపీ నేతలు భావిస్తున్నారు. గత 14 ఏళ్లలో బెంగాల్‌లో స్త్రీలపై జరిగిన అత్యాచారాలు, అవినీతి, ఇతర అక్రమాల చిట్టా విప్పడం, ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకతను ఉపయోగించుకోవడం, పెద్ద ఎత్తున బంగ్లాదేశ్ చొరబాటుదారులను అనుమతించి ఓటర్ల జాబితాలో చేర్పించారని ఆరోపించడం... ఇత్యాది ఆయుధాలు బీజేపీ వద్ద ఎన్నో ఉన్నాయి. సరిపోతాయా? బెంగాల్‌లో మమతా బెనర్జీ అనే బెబ్బులిని బంధించేందుకు ఇవేవీ సరిపోవని మోదీ, షాకు తెలియనిది కాదు.

మోదీ వర్సెస్ దీదీగా సాగుతున్న ఈ ఎన్నికలు ప్రధానంగా బీజేపీ, దాని వ్యతిరేక శక్తుల మధ్య జరుగుతున్నాయి. మోదీ–షా ఆకర్షణ పూర్తిగా పనిచేయని రాష్ట్రాల్లో బెంగాల్ ప్రధానమైనది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మూడు దశాబ్దాలు కాంగ్రెస్‌ను, ఆ తర్వాత దాదాపు మూడున్నర దశాబ్దాలు వామపక్షాలను ఆదరించిన బెంగాల్ ప్రజలు, తృణమూల్ కాంగ్రెస్‌ను ఆదరించారే కాని బీజేపీని దరిచేర్చుకునేందుకు అంత ఉత్సుకత ప్రదర్శించలేదు. నిజానికి పశ్చిమబెంగాల్‌లో వామపక్షాల ధాటిని ఎదుర్కొని ఎర్రసేనతో ఉగ్రంగా తలపడి, అనేక హింసాత్మక దాడులను ఎదుర్కొన్న మమతా బెనర్జీని కాంగ్రెస్ దరిచేర్చుకోలేకపోయింది. ఆమె పార్టీని మిత్రపక్షంగా బీజేపీ కాపాడుకోలేకపోయింది. పీవీ నరసింహారావు ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న మమతా బెనర్జీ 1997లోనే స్వంత పార్టీని ఏర్పాటు చేశారు. వాజపేయి ప్రభుత్వంలో రైల్వే మంత్రిగా రైల్వే బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆ తర్వాత మన్మోహన్ ప్రభుత్వంలోనూ రైల్వే మంత్రిగా ఉన్నారు. తొలుత లోక్ సభ ఎన్నికల్లో, తర్వాత స్థానిక ఎన్నికల్లో వామపక్షాలను ఊడ్చివేసిన మమత 2011 అసెంబ్లీ ఎన్నికల్లో 34 ఏళ్లుగా ఉన్న లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని గద్దెదించి చరిత్ర సృష్టించారు. సాదాసీదా ముతక చీర, స్లిప్పర్లు ధరించి ప్రజల మధ్య సామాన్యురాలిగా సంచరించే మమతా బెనర్జీని గద్దెదించేందుకు బీజేపీ ఇవాళ సామ, దాన, భేద దండోపాయాలను ప్రయోగిస్తోంది.

2014లో కేంద్రంలో నరేంద్రమోదీ హిందూ హృదయ సమ్రాట్‌గా అడుగు పెట్టిన తర్వాతే పశ్చిమబెంగాల్‌లో ప్రవేశించేందుకు బీజేపీ సాహసంతో అడుగులు ముందుకు వేసింది. వామపక్షాల, కాంగ్రెస్ ఓటు బ్యాంకు క్రమంగా పడిపోవడం, తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల వ్యతిరేకత పెరుగుతుండడం ఇందుకు తోడ్పడుతోంది. బెంగాల్‌లో ముస్లింలు 30 శాతం పైగా ఉండడం, బీజేపీ కేంద్రీకృత ఎన్నికల యంత్రాంగం వ్యూహాత్మకంగా మమతా బెనర్జీని హిందూ వ్యతిరేకశక్తిగా చిత్రించడం, స్థానిక నాయకులను ప్రోత్సహించడం వల్ల ఆ పార్టీ కొంత బలం పుంజుకుంది. గత పదేళ్లలో ఇతర రాష్ట్రాల్లో పొందిన వ్యాప్తితో పోలిస్తే బెంగాల్‌లో బీజేపీ వ్యాప్తి తక్కువే. తనకు ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ పుంజుకుంటోందని తెలిసిన తృణమూల్ భారీ ఎత్తున సంక్షేమ పథకాలను, నగదు బదిలీని చేపట్టింది. బెంగాలీ ఉపజాతీయ వాదాన్ని రెచ్చగొట్టి బీజేపీని స్థానిక సంస్కృతిని వ్యతిరేకించే పార్టీగా చిత్రించింది. రవీంద్రుడు వంటి సాంస్కృతిక చిహ్నాలను ఉపయోగించుకుని హిందూ జాతీయవాదం స్థానిక అస్తిత్వానికి వ్యతిరేకమనే భావన కల్పించేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో బీజేపీ మతతత్వానికి తాను వ్యతిరేకమంటూ దాదాపు 30 శాతం ఉన్న ముస్లిం ఓట్లను సంఘటితం చేసుకోగలిగింది. గ్రామీణ ప్రాంతాల్లో బలమైన కేడర్‌ను నిర్మించుకుని బీజేపీ చొచ్చుకు రాకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోంది.

> పశ్చిమ బెంగాల్ జనాభాలో 70 శాతంగా ఉన్న హిందువుల్లో 60 శాతం మందికి పైగా తమ వైపు మొగ్గు చూపితేనే బీజేపీ అక్కడ జయపతాక ఎగురవేయగలదు. బీజేపీ హిందూత్వ సిద్ధాంతానికీ, హిందూ మతంలోని వైవిధ్యానికీ మధ్య సాగుతున్న సమరం ఇది. ప్రతి ఒక్కరూ కాళీమాతను పూజించే ఈ ప్రాంతంలో హిందూత్వ ఆధారంగానే పోరాడడం, మమతా బెనర్జీకి వ్యతిరేకంగా హిందువులను సమీకరించడం సాధ్యం కాకపోవచ్చు.

అయినప్పటికీ బెంగాల్‌లో బీజేపీ క్రమంగా విస్తరిస్తోంది. బెంగాల్‌లో ఆరెస్సెస్ శాఖలూ విస్తరిస్తున్నాయి. అక్కడి హిందూ సాంస్కృతిక వారసత్వాలను ఉపయోగించుకుని, రామకృష్ణ మిషన్ వంటి స్థానిక సంస్థలతో సంబంధాలు పెట్టుకుని బీజేపీ బలోపేతం అవుతోంది. నిజానికి బీజేపీ పూర్వరూపమైన భారతీయ జనసంఘ్ సంస్థాపకుడు, అంతకు ముందు హిందూ మహాసభ ప్రధాన నేతల్లో ఒకరైన శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బెంగాలీ నాయకుడు అయినప్పటికీ పశ్చిమబెంగాల్‌లో బీజేపీ నిలదొక్కుకోవడం అంత సులభం కావడం లేదు. వామపక్షాలు బలంగా ఉండడం వల్ల, రామజన్మభూమి ఉద్యమం తర్వాత కూడా బెంగాల్‌లో హిందూత్వ భావోద్వేగాలను రేకెత్తించలేకపోయిన బీజేపీకి వామపక్షాలు, కాంగ్రెస్ బలహీనమైన తర్వాతే మరింత బలపడేందుకు అవకాశాలు ఏర్పడ్డాయి. వివేకానందుడు, సుభాష్ చంద్ర బోస్, బంకించంద్ర చటర్జీ వంటి సాంస్కృతిక మూర్తుల పేర్లను ప్రస్తావించడం, వందేమాతరంను స్వంతం చేసుకునే ప్రయత్నం చేయడం, మమతను ముస్లింల అనుకూల, హిందూత్వ వ్యతిరేకశక్తిగా చిత్రించడం వంటి ప్రచారాన్ని బీజేపీ ఉధృతం చేస్తూ వస్తోంది. దీనివల్ల 2019, 2014 లోక్‌సభ ఎన్నికల్లోనూ, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో సగటున 40 శాతం ఓట్లను బీజేపీ సాధించుకోగలిగింది.

బెంగాల్‌లో బీజేపీ విజయం సాధించగలదా? ఆ రాష్ట్ర జనాభాలో 70 శాతంగా ఉన్న హిందువుల్లో 60 శాతం మందికి పైగా తమ వైపు మొగ్గు చూపితేనే బీజేపీ అక్కడ జయపతాక ఎగురవేయగలదు. బీజేపీ హిందూత్వ సిద్ధాంతానికీ, హిందూ మతంలోని వైవిధ్యానికీ మధ్య సాగుతున్న సమరం ఇది. ప్రతి ఒక్కరూ కాళీమాతను పూజించే ఈ ప్రాంతంలో హిందూత్వ ఆధారంగానే పోరాడడం, మమతా బెనర్జీకి వ్యతిరేకంగా హిందువులను సమీకరించడం సాధ్యం కాకపోవచ్చు. స్వయంగా కాళీ భక్తురాలైన మమతా బెనర్జీ గత ఎన్నికల్లో కాళీ మంత్రాలను ఉచ్చరిస్తూ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించింది. ఒవైసీ నేతృత్వంలోని ఎఐఎంఐఎంతో పాటు ఒకటి రెండు చిన్నా చితకా ముస్లిం పార్టీలు ఉన్నప్పటికీ, ముస్లిం ఓట్లు చెప్పుకోదగిన విధంగా చీలిపోయే అవకాశాలు తక్కువే.

ఈ నేపథ్యంలో అమిత్ షా బెంగాల్ వెళ్లి వచ్చిన వారం రోజుల్లోనే కోల్‌కతాలోని ఐ-పాక్ కార్యాలయంపై ఈడీ దాడులు జరపడానికి ప్రాధాన్యం ఉన్నది. గెలిచే స్థానాల్లో సర్వశక్తులు ఒడ్డి పోరాడడం, ఉధృతంగా ప్రచారం చేయడం, పోలింగ్ బూత్ స్థాయి వ్యూహరచన చేయడం ఒక ఎత్తు అయితే, ప్రత్యర్థి బలహీనతలపై దెబ్బకొట్టడం మరో ఎత్తు. ఇటువంటి వ్యవహారాల్లో అమిత్ షాది అందెవేసిన చేయి. ఐదేళ్ల క్రితం జరిగిన ఒక బొగ్గు కుంభకోణంలో వచ్చిన డబ్బులు మనీలాండరింగ్ ద్వారా ఐపాక్ సంస్థ డైరెక్టర్ ప్రతీక్ జైన్‌కు చేరాయన్న అనుమానంతో ఈడీ అధికారులు ఆయన కార్యాలయాలపై దాడులు చేశారు. ఈ దాడుల పేరుతో తమ ఎన్నికల వ్యూహానికి సంబంధించిన డాక్యుమెంట్లు బీజేపీ స్వాధీనపరుచుకుంటుందన్న అనుమానంతో మమతా బెనర్జీ మందీ మార్బలంతో, పోలీసు బలగాలతో ఐ-పాక్ కార్యాలయానికి వెళ్లారు. ఈడీ అధికారుల నుంచి ఫైళ్లను, ఎలక్ట్రానిక్ ఆధారాలను లాక్కున్నారు. అమిత్ షాను తీవ్రంగా దూషించారు. 'ఆరోగ్యంగా ఉన్న పులి కంటే గాయపడ్డ పులి ప్రమాదకరం. నాపై దాడి చేస్తున్న కొద్దీ కొత్త ప్రాణం నాలో మేలుకుంటుంది' అని ఆమె ప్రకటించారు. ప్రత్యర్థులను బలహీనం చేసేందుకు ఈడీ, సీబీఐ వంటి శక్తులను ప్రయోగించడం బీజేపీకి కొత్త కాదు కానీ, మమత లాంటి నేతలు వీధి పోరాటాలకు దిగడం ఆ పార్టీ ఊహించిందో లేదో చెప్పలేం. ఎన్నికలకు రెండు నెలల ముందే భీకర రణం ప్రారంభమైన బెంగాల్‌లో ఇలాంటి బీభత్స రస ప్రధాన దృశ్యాలు ఎన్ని ఎదురవుతాయో, అవి ఎవరికి ఉపయోగకరమో చెప్పలేం. రాజకీయాలు వీధి పోరాటాలైనప్పుడు ఏ న్యాయస్థానాలైనా ఏమి చేయగలవు?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



అమరావతిపై జగన్ వికృత వ్యాఖ్యలు

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి నిర్మాణం వేగం అందుకున్న శుభతరుణంలో వాస్తవాలను వక్రీకరిస్తూ, స్వార్థబుద్ధితో, సంకుచిత వాదనలతో ప్రమాదకర రాజకీయ క్రీడను ఆరంభించాడు జగన్ రెడ్డి. ఆయన పసలేని పనికిమాలిన రాజకీయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలి. మొదటి నుంచీ అమరావతికి పురిట్లోనే సంధి కొట్టాలని జగన్ రెడ్డి సృష్టించిన అడ్డంకులు అన్నీ ఇన్నీ కావు. అమరావతిని పడగొట్టడం, విడగొట్టడం, చెడగొట్టడమే లక్ష్యంగా గోముఖ వ్యాఘ్ర విన్యాసాన్ని జగన్ ప్రదర్శించాడు.

అమరావతిలో అద్భుత రాజధానిని నిర్మిస్తామన్న హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అమరావతికి మరణ శాసనం రాశాడు. మూడు రాజధానుల నాటకం ఆడి రాష్ట్రానికి రాజధానే లేకుండా చేశాడు. నాలుకను అడ్డదిడ్డంగా మడతేయడంలో జగన్ రెడ్డి ఊసరవెల్లికి సాటి రాగలడు. తాము అధికారంలోకి వచ్చాక హైదరాబాద్‌ను మించిన మహానగరాన్ని ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తామని 2014 ఎన్నికలకు ముందు ఆయన ఒట్టు వేశాడు. ఎన్నికల తర్వాత 2014 సెప్టెంబరు 4న తెలుగుదేశం ప్రభుత్వం అన్ని రాజకీయ పక్షాల మద్దతుతో ఏకగ్రీవంగా అమరావతిని రాజధానిగా అంగీకరిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసింది. రాజధాని రాష్ట్రానికి నడిబొడ్డున ఉండాలనీ, రాజధానికి కనీసం 30వేల ఎకరాలు కావాలనీ, 13 జిల్లాల చిన్న రాష్ట్రం కాబట్టి ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టడం ఇష్టంలేక అమరావతి రాజధానిని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నాననీ ఆనాడు జగన్ నమ్మబలికాడు. కానీ అధికారంలోకి రాగానే తాను చెప్పిన నీతులను తానే తుంగలో తొక్కి మూడు రాజధానులు అంటూ కొత్త పల్లవి అందుకున్నాడు. అనాగరిక విద్వేష రాజకీయాలతో ప్రాంతాల మధ్య వైషమ్యాలు ఎగదోసి కండ కావరంతో రాజధాని అమరావతిని నిర్వీర్యం చేశాడు. అందుకే జగన్‌రెడ్డిని 2024 ఎన్నికల్లో ప్రజలు చిత్తు చిత్తుగా ఓడించారు. ప్రతిపక్ష హోదా సైతం దక్కనంతగా తిరస్కరించారు. అయినా ఆయన బుద్ధి మార్చుకోవడం లేదు. అమరావతిపై వికృత వ్యాఖ్యలు చేస్తూ సైంధవుడిలా ఇంకా అడ్డుకోవాలని చూస్తున్నాడు.

రాజధాని అమరావతిని రివర్ బేసిన్‌లో కడుతున్నారనీ, అలా కట్టేందుకు వీల్లేదనీ, ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలనీ అమరావతిపై జగన్ రెడ్డి చేస్తున్న అసంబద్ధ ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయి. అంతే కాదు, రాజ్యాంగంలో రాజధాని అనే పదం లేదని ఆయన చెప్పడం రాజ్యాంగం పట్ల ఆయనకున్న అపరిపక్వ అవగాహనకు నిదర్శనం. దేశంలోని ఏదైనా రాష్ట్రాలకు సంబంధించిన రాజధానులను గెజిట్‌లో ప్రస్తావిస్తుంటారని జగన్ తెలుసుకోవాలి.

> **రాజధాని అమరావతిని రివర్ బేసిన్‌లో కడుతున్నారనీ, అలా కట్టేందుకు వీల్లేదనీ, ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలనీ అమరావతిపై జగన్ రెడ్డి చేస్తున్న అసంబద్ధ ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయి. అనేక జాతీయ రాజధానులు, ప్రధాన నగరాలు చరిత్రాత్మకంగా నదుల వెంబడి నెలకొన్నాయి.**



2014–19 మధ్య కాలంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ వేర్వేరు సందర్భాలలో అమరావతి రాజధానిని నిర్మించడానికి 33 వేల ఎకరాల భూమి అవసరమన్నాడు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, అమరావతితో సహా మూడు రాజధానులు అవసరం అన్నాడు. ఇప్పుడు మళ్ళీ రాజధాని అమరావతి నది స్థావరంలో ఉండకూడదంటున్నాడు. ఈ మూడు వేర్వేరు ప్రకటనలూ ఒక దానికొకటి భిన్నం! ఇలాంటి ప్రకటనలు చూస్తున్నప్పుడే జగన్ మానసిక స్థితిపై సందేహం కలుగుతుంది. అనేక జాతీయ రాజధానులు, ప్రధాన నగరాలు చరిత్రాత్మకంగా నదుల వెంబడి నెలకొన్నాయి. నాగరికత, నీటి సరఫరా, వాణిజ్యం, రవాణా వంటి ముఖ్యమైన కారణాలు దీనికి దోహదపడ్డాయి. బహుళ జాతీయ రాజధానుల గుండా ప్రవహించే నదికి అత్యంత ప్రసిద్ధ ఉదాహరణ డానుబే నది. ఇది నాలుగు రాజధాని నగరాల గుండా వెళుతుంది, అవి– వియన్నా (ఆస్ట్రియా), బ్రాటిస్లావా (స్లోవేకియా), బుడాపెస్ట్ (హంగరీ), బెల్‌గ్రేడ్ (సెర్బియా). ముఖ్యమైన నదులపై ఉన్న ఇతర ప్రధాన రాజధాని నగరాల్లో నైలు నదిపై కైరో, థేమ్స్ నదిపై లండన్, సీన్ నదిపై పారిస్, పోటోమాక్ నదిపై వాషింగ్టన్ డీసీ ఉన్నాయి. రాజధానిగా అమరావతి అభివృద్ధి కాకూడదన్నదే జగన్ రెడ్డి ఉద్దేశ్యంగా అర్థమవుతున్నది. ఆంధ్రప్రదేశ్‌కి ఎటువంటి పెట్టుబడులు, లేదా గ్రాంట్లు రాకూడదు అన్నట్లుగా ఉంది ఆయన వ్యవహారం.

నాటి తెలుగుదేశం ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా రైతులను మెప్పించి, ఒప్పించి ముప్పయ్ వేల ఎకరాల పైచిలుకు భూములను సమీకరించి రాజధాని నిర్మాణం ప్రారంభించింది. ఫ్లడ్ లైట్ల వెలుగులో వేలమంది కార్మికులతో రాజధాని నిర్మాణ పనులు జరిగాయి. అడ్డు పడకుండా అనుకున్నట్టుగా జరిగి ఉంటే ఈపాటికి అమరావతి నిర్మాణం పూర్తయి ఉండేది. నేటికి ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి ఒక ప్రధాన ఆర్థిక వనరుగా ఉండేది. కానీ 2019లో విధి వక్రించి రాష్ట్రంలో తుగ్లక్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అమరావతిని రాజధానిగా నిర్ణయిస్తూ శాసన సభలో తీర్మానం చేసినప్పుడు ఆమోదం తెలిపిన తుగ్లక్ ముఖ్యమంత్రి, ఆ తర్వాత మాట మార్చి, మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాటకు తెర తీశారు. ఆ వెంటనే ఆయన ముష్కర మూక కూడా అమరావతిపై విషపూరితమైన ప్రకటనలు చేయడం ఆరంభించింది. వాళ్ళు అమరావతిని ఎడారిగా, శ్మశానంగా అభివర్ణించారు. సొంత మీడియా సహకారంతో అమరావతిని భ్రమరావతిగా, కమ్మరావతిగా చిత్రించారు. రాజధాని భూముల వ్యవహారంలో భారీ కుంభకోణం జరిగిందని ప్రచారం చేసారు. ఆ తర్వాత హైకోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకు అన్ని స్థాయిల్లో ఈ కేసులను కొట్టివేశారు. అంతేగాక అమరావతిలో కుంభకోణం, లంబకోణం ఏదీ జరగలేదని విస్పష్ట తీర్పు వెలువడింది. అయినప్పటికీ జగన్ ముష్కర మూక విష ప్రచారాన్ని ఆపలేదు. చంద్రబాబు ప్రారంభించిన రాజధాని కావడంతో వ్యక్తిగత ద్వేషం, రాజకీయ అహంకారం, ప్రతీకార భావజాలం ఈ మూడింటి మేళవింపుతో అమరావతిపై విషం కక్కారు. ప్రపంచంలో ఎక్కడా లేని మూడు రాజధానులు అనే కాన్సెప్ట్ తెచ్చేసరికి పెట్టుబడులు పారిపోయాయి, ఉద్యోగాలు ఆగిపోయాయి, రైతులు రోడ్డెక్కారు. రైతులపై వ్యవస్థాగత దాడి మొదలైంది. రోడ్లు, భవనాలు, కార్యాలయాల ధ్వంసం, కేసులు, అరెస్టులు, అణచివేత, అమరావతిపై జగన్ కక్కిన విషం ఏపీ విశ్వసనీయతను కూడా తీవ్రంగా దెబ్బతీసింది.

అమరావతిని రివర్ బేసిన్‌లో కడుతున్నారని, అలా కట్టేందుకు వీల్లేదనీ, ఈ విషయంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలనీ జగన్మోహన్ రెడ్డి డిమాండ్ చేసిన 48 గంటల్లో అదే పార్టీ కీలక నేత మాజీ సకల శాఖా మంత్రి సజ్జల రామకృష్ణా రెడ్డి మీడియా ముందుకు వచ్చి రాజధాని అమరావతిని వైసీపీ మనస్ఫూర్తిగా స్వాగతిస్తుందనీ, తాము అమరావతిని వ్యతిరేకించలేదనీ సుద్దులు చెప్పడం సిగ్గుచేటు. ఏది ఏమైనా అమరావతి అంతమే జగన్ పంతమని అర్థమవుతున్నది. అందుకే జగన్ కుట్రల నుంచి అమరావతిని రక్షించుకోవాలి.

◆ యనమల రామకృష్ణుడు
టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు



సంక్రాంతి శోభ

మన్ను మిన్నుల కలయిక
శ్రమ సౌందర్యానికి రైతే ఏలిక
ప్రకృతి శోభకు పల్లెలే వేదిక
పాడి పంటలు పొంగే వేడుక!

భగ భగల భోగి మంటల్లో
చెడునంతటికి వేద్దాం పాతర
భోగ భాగ్యాలతో చేద్దాం జాతర
దివ్య భవ్యలతో శోభిల్లు భోగి!

ముంగిళ్ళందు రంగవల్లులు
గోమయపు గొబ్బెమ్మలతో
శోభాయమానమై కొలువుదీరే
నవ్య కాంతులతో వెలుగులూరే
శ్రీమహాలక్ష్మి సిరుల సంక్రాంతి!

శ్రీశైల శిఖరమెత్తు ధాన్యపు
రాశులను జూసి
పల్లె నిండా ఆనందాలు పొరలే
ఆరుగాలం శ్రమ ఫలమే రైతు
లోగిళ్ళకు సిరుల పంట తరలే!

పశు పక్ష్యాదులను పూజించి
ఫల పుష్పాలతో హారతులద్ది
పొలి చెలకల్లో పొంగల్లు జల్లి
సిరులిచ్చు భూతల్లికి ప్రణమిల్లి
కాచు మమ్మేలు కనుమ గౌరి!!

– బోనగిరి పాండురంగ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.



డూడూ బసవన్న విన్యాసం

పల్లెకు.. భోగి కళ

తీరంలో కత్తులు దూస్తున్న కోళ్లు



వేమూరు బరిలో తలపడుతున్న కోడి పుంజులు

- డెల్టాలో ప్రారంభమైన కోడి పందాలు
- వీఐపీ, మినీ బరుల ఏర్పాటు ... హైటెక్ పేకాట ..
- గుడారాల్లో సకల సదపాయాలు
- జోరుగా కోతముక్క
- ఆంధ్ర, తెలంగాణా నుంచి తరలివచ్చిన పందెం రాయుళ్లు
- అధికార ఒత్తిడితో మిన్నకున్న అధికారులు

చెరుకుపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పందెం కోళ్ళు పౌరుషంతో కత్తులు దూస్తే పేకముక్క జూదప్రియుల చేతుల్లో గుండాట ఆడింది.కోతముక్క లక్షల నోట్లకట్టల కట్లుతెంపింది. తమ జాతకాన్ని పరిక్షించుకునేందుకు ఎంతోమంది అదృష్టాన్ని నెంబర్లాట తారుమారు చేసింది. సంప్రదాయం మాటున నిషేధ ఆజ్ఞలను కూడా లెక్కచెయ్యకుండా పందెం రాయుళ్ళు విచ్చలవిడిగా పందాలు వేశారు. మంగళవారం మండలంలోని తూర్పుపాలెం గ్రామంలో 30ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన కోడిపందాల బరుల్లో ఇసుక వేస్తే రాలనంత మంది పందెం రాయుళ్ళు తరలివచ్చారు. పార్కింగ్ స్థలాల్లో కూడా వాహనాలను పెట్టుకునేందుకు ఖాళీలేని పరిస్థితి నెలకొంది. మొదటిరోజు భారీగా కార్లు, ద్విచక్రవాహనాల్లో వారు తరలివచ్చారు. రూ.50వేలు నుంచి రూ.5లక్షలవరకు కోడిపందాలు జోరుగా సాగాయి. కృష్ణా, గుంటూరు, ప్రకాశం, తెలంగాణా రాష్ట్రం నుంచి వేలాదిసంఖ్యలో బరులవద్దకు చేరుకుని కోడిపందాల్లో పాల్గొన్నారు..




తూర్పుపాలెం వీఐపీ బరిలో భారీ జన సందోహం మధ్య జరుగుతున్న కోడిపందాలు

తీర ప్రాంతంలో జోరుగా కోడిపందాలు

తీరంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సాంప్రదాయలను అడ్డంపెట్టుకుని అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కోడిపందాలు జోరుగా కొన సాగుతున్నాయి. పందెం రాయుళ్ళు నాలుగు జిల్లాలతో పాటు తెలంగాణా రాష్ట్రం నుంచి వేలాదిగా తరలి రావటంతో పందాలు జోరుగా సాగాయి. దృష్టి సారించాల్సిన అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తైనా చూసిన దాఖలాలులేవు. అధికారులపై రాజకీయ నాయకులు తీవ్ర ఒత్తిడి తేవటంతో చేసేదిలేక వారు చేతులెత్తేశారు. అధికార పార్టీ ప్రధాన నా యకుని ఆధ్వర్యంలో పది బరులు ఏర్పాటు చేసి వందలాది పందేలు నిర్వహించారు. బరుల సమీపంలోనే

(మిగతా 6వ పేజీలో)



తూర్పుపాలెం బరులవద్ద పార్కింగ్‌లో కార్లు

కమ్మేసిన మంచుతెరలను చీల్చుకుంటూ... వణికించిన చలిగాలిని సాగనంపుతూ....ఇంటింటా సిరుల వెలుగులు వెదజల్లుతూ... ఉదయ భానుడి కిరణాలు దరిచేరక ముందే ఉవ్వెత్తున ఎగసే భగభగ మంటలతో భోగి సంబరం వచ్చేసింది. ప్రతి పల్లెకు పండుగ శోభను తెచ్చేసింది. ధాన్యం ఇంటికి చేరి అన్నదాతల ఆనందం వేళ....పట్టణాల నుంచి పల్లెబాట పట్టిన ఊరువాడ....ఓ వైపు ముగ్గుల ముంగిళ్లు..మరో వైపు గొబ్బెమ్మల పాటలు, గంగిరెద్దుల విన్యాసాలు..హరిదాసుల కీర్తనలతో తెలుగు లోగిళ్లకు ఇప్పటికే సంక్రాంతి పండుగ కళకళలు రాగా.. భోగి పండుగను పెద్ద ఎత్తున జరుపుకోవడానికి పల్లె సిద్ధమైంది. బుధవారం వేకువజామునుంచే ప్రతి ఇంటా భోగి మంటలతో, పండుగ సంబరాలు అంబరాన్ని తాకాయి. మహిళలు అందమైన ముగ్గులతో భోగికి ఆహ్వానం పలుకుతుండగా, ఆలయాలన్నీ కూడా పండుగ వేళ ప్రత్యేక అలంకరణలతో తీర్చిదిద్దారు. మరో వైపు కోడి పందాల బరులు కిక్కిరిసిపోయాయి. ఆంక్షలు సైతం లెక్క చేయకుండా అధికార నేతల అండతో పేకాట శిబిరాలు కళకళలాడుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి కూడా పందెం రాయుళ్ళ రాకతో పార్కింగ్ స్థలాలు నిండిపోయాయి.



పందెంకు సిద్ధం

కొల్లూరు బరి వద్ద జనసందోహం

బాపట్ల : పిండి వంటల తయారీలో మహిళలు

పర్చూరు : అన్నంబొట్లవారిపాలెంలో జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

- పండుగ వెలుగులతో తెలుగు లోగిళ్లు
- ఊరూ వాడా భోగి మంటలు
- అంబరాన్ని తాకిన పండుగ సంబరాలు

(నరసరావుపేట, బాపట్ల ఆంధ్రజ్యోతి)

మకర సంక్రాంతి తెలుగువారి అతి పెద్ద పండుగ. మూడు రోజులు సం క్రాంతి పండుగ భోగితో ప్రారంభమ వుతుంది. తొలిరోజు భోగి మంటలతో బుధవారం మొదలయ్యే సంక్రాంతి వేడు కలను జరుపుకునేందుకు జిల్లా ప్రజా నీకం సిద్ధమైంది. ప్రతి ఇంటికి సంతోషాలను స్వాగతించే తొలి పండుగ దినం భోగికి ఎంతో ప్రాధాన్యముంది. దక్షిణాయణంలో సూర్యుడు భూమికి దూరమవడం వల్ల చలి విపరీతంగా పెరుగుతుంది. ఉత్తరాయణానికి ముందురోజు చలి తారస్థాయికి చేరుతుంది. దీంతో ఆ చలిని తట్టుకోవడానికి ప్రజలు మంటలు వేసుకుంటారు. కాల క్రమంలో అవే భోగి మంటలుగా ప్రజల సంప్రదా యంలో భాగమైపోయాయి. భోగి మంటల వద్ద చలికాచుకున్న చిన్నా పెద్దలు ఆ మంటల సెగతో కాచుకున్న వేడి నీటితో తలస్నానం చేసి కొత్త దుస్తులు ధరిస్తారు.

● మకరరాశిలోకి ప్రవేశించే సమయం

సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించే కాలమే భోగి పండుగగా జరుపుకుంటారు. ఇదే కాకుండా భోగి అంటేనే అనుభవించడమనే అర్థం స్ఫురిస్తోంది. సంస్కృతికి చిహ్నంగా కూడా శతాబ్దాలుగా వర్ధిల్లుతోంది. భోగి పండుగ రోజున ఇంద్రుడిని పూజించడం అనాదిగా వస్తోంది. రుతుక్రమం తప్పకుండా వర్షాలు కురిపిస్తున్నందుకు రైతులు కృతజ్ఞతలు చెప్పుకునే విశిష్టదినంగా కూడా భోగిని అభివర్ణిస్తారు. గోదాదేవి శ్రీరంగనాథుని అందుకున్నది కూడా భోగి పర్వదినం నాడే అని చెబుతుంటారు. ధాన్యపురాశులు ఇంటికి చేరే సమయంలో ఈ పండుగ వేడుకలను జరుపుకోవడం కూడా సంస్కృతిలో భాగంగా వస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామీణంలో దాదాపు 80 శాతం వ్యవసాయాధారిత

(మిగతా 6వ పేజీలో)

● ఊరు.. వాడా సిద్ధం

జిల్లా అంతటా భోగి పండుగను జరుపుకునేందుకు ప్రజలు సిద్ధమ య్యారు. తెల్లవారు జామునే భోగి మంటలు వేసేందుకు ఊరు వాడా పల్లెలు, పట్టణాలు సిద్ధమయ్యాయి. ఉద్యోగ, వ్యాపార రీత్యా ఎక్కడెక్కడో నివాసముంటున్న కుటుంబ సభ్యులు, బంధువల రాకతో పల్లెలు కళకళలాడుతున్నాయి. దాదాపు నెల రోజుల పాటు ధనుర్మాస పూజా కార్యక్రమాలు నిర్వహించి భోగి పండుగతో సంక్రాంతి వేడుకల్లోకి ప్రవేశిస్తారు. నెలరోజులూ ఇళ్ల ముంగిట్లో కళ్లాపు జల్లి రకరకాల రంగవల్లులతో తీర్చిదిద్ది గొబ్బెమ్మలు పెట్టి పూలతో అలంకరించి శుభసూచకంగా పసుపు, కుంకుమతో వాటిని పూజిస్తారు. భోగి మంటలు వేసుకుని చిన్నా, పెద్ద అందరూ ఆ మంటల చుట్టూ చేరి చలికాచుకుంటూ సరదాగా గడుపుతారు. ఇళ్లల్లో పాత సామగ్రిని మంటల్లో వేసేందుకు వాటిని సిద్ధం చేసుకున్నారు.





ఖాజీపేటలో మహిళ ఇచ్చిన అరెసె తింటూ..

దెబ్బతిన్న రోడ్లన్నీ తిరిగి నిర్మిస్తాం

మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి, జనవరి 13, (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం పట్టించుకోకుండా వదిలేసిన రోడ్లు, ఈ మధ్య కాలంలో వర్షానికి దెబ్బతిని నడిచేందుకు ఇబ్బందికరంగా మారిన రోడ్లు అన్నింటిని తిరిగి నిర్మిస్తామని, వచ్చే వేసవిలోగా నియోజకవర్గంలోని అన్ని రోడ్లకు మరమ్మతులు పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం తెనాలి మండల పరిధిలోని ఖాజీపేట, కొలకలూరు, నందివెలుగు గ్రామాల్లో రూ.8.88 కోట్లతో నిర్మించనున్న వివిధ సీసీ రోడ్ల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. రూ.10 లక్షల వ్యయంతో ఖాజీపేటలో ధాన్యం ఆరబోసుకునేందుకు నిర్మించిన ప్లాట్‌ఫాంను ప్రారంభించారు. ఇటీవల నిర్మించిన మరి కొన్ని సీసీ రోడ్లను మంత్రి గ్రామస్తులతో ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సహకారంతో నియోజకవర్గానికి నిధులు తీసుకు రాగలుగుతున్నామని పల్లె పండుగ మొదటి విడత కింద భారీగా నియోజకవర్గానికి నిధులు అందాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కొలకలూరులో ఉన్న పిహెచ్‌సికి అదనంగా మరో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇవి కాక వివిధ రోడ్ల కోసం రెండో విడత కింద పంచాయితీరాజ్ శాఖ నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూ.36 కోట్ల నిధులు మంజూరు చేశారని, ఆయనకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

త్రీడి టెక్నాలజీతో.. పేదల గృహాల నిర్మాణం

- పైలెట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలో బుర్రిపాలెం ఎంపిక
- అదనపు నిధులు అందించడానికి కేంద్ర మంత్రి పెమ్మసాని అంగీకారం
- జగనన్న కాలనీల్లో మెరకలు వేశాకే కాంట్రాక్టర్లకు బిల్లులు
- రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ అరుణ్‌బాబు

తెనాలి, జనవరి 13, (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఇకపై పేదల ఇళ్లను త్రీడీ టెక్నాలజీ ఉపయోగించి కేవలం కాంక్రీటుతోనే పటిష్టంగా నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు, దీని కోసం రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టు కింద బుర్రిపాలెం గ్రామాన్ని ఎంపిక చేసినట్లు రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ అరుణ్‌బాబు చెప్పారు. మంగళవారం తెనాలి మండలం బుర్రిపాలెంలో ఆయన పర్యటించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్) పథకం కింద బుర్రిపాలెం గ్రామానికి 90 ఇళ్లు మంజూరు అయ్యాయని, ఎస్‌టి కాలనీలో లబ్ధిదారులకు వీటిని నిర్మించి ఇచ్చేలా కేంద్ర కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవ చూపారని ఆయన చెప్పారు. కేంద్రం ఒక్కో ఇంటికి రూ.1.60 లక్షలు మంజూరు చేస్తుంటే త్రీడీ టెక్నాలజీలో నిర్మించే ఇంటికి అదనంగా మరో రూ.లక్ష వరకు ఖర్చు అవుతుందని, ఈ మొత్తాన్ని తానే అందించేందుకు మంత్రి పెమ్మసాని అంగీకరించారని అరుణ్‌బాబు చెప్పారు. గతంలో ఈ తరహా టెక్నాలజీతో గుజరాత్‌లో ఇళ్ల నిర్మాణం జరిగిందని, మన రాష్ట్రంలో తొలిసారిగా బుర్రిపాలెం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ఓ నమూనా కింద ఇళ్లు నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించి లబ్దిదారులకు అవగాహన కలిగించే ఉద్దేశ్యంతో బుర్రిపాలెంలో పర్యటించానన్నారు.



బుర్రిపాలెంలో స్థానికులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణ సంస్థ ఎండీ అరుణ్‌బాబు



జగనన్న కాలనీలో కాంట్రాక్టర్లను హెచ్చరిస్తున్న ఎండీ అరుణ్‌బాబు

మెరకలు వేస్తేనే బిల్లులు

జగనన్న కాలనీల్లో అప్పట్లో ఇళ్లు నిర్మించిన కాంట్రాక్టర్లు కేవలం బేస్‌మెంట్ వరకే నిర్మించి వాటి లోపల మట్టితో నింపకుండా ఒక్కో ఇంటికి రూ.70 వేల వరకు బిల్లులు తీసేసుకున్నారని, ప్రస్తుతం వాటిని పూర్తి చేయకుంటే ఇప్పటి వరకు నిర్మాణాలు చేసిన ఇళ్లకు సంబంధించిన బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించేది లేదని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఎండీ అరుణ్‌బాబు హెచ్చరించారు. మంగళవారం తెనాలిలో పర్యటించిన ఆయన జగ్గడిగుంటపాలెం దగ్గర నిర్మాణంలో ఉన్న పెదరావూరు-2 లేఅవుట్‌లోని జగనన్న ఇళ్ల పనులను పరిశీలించారు. వాటిలో చాలా వరకు బేస్‌మెంట్ వరకే పూర్తయి మిగిలిన పనులు చేయకుండా వదిలేసినవి ఎక్కువగా ఉండటంతో వాటిపై మండిపడ్డారు. ఇళ్లు నిర్మించిన కాంట్రాక్టర్లను పిలిపించి పాత పనులు పూర్తి చేస్తేనే ఇప్పటి వరకు మీకు రావాల్సిన బకాయిల మొత్తాలను విడుదల చేస్తామని, త్వరగా మెరకలు పూర్తి చేయాలని వారికి సూచించారు.



ప్రైవేట్.. దోపిడీ

- ఆర్టీసీ కంటే మూడింతల ధర
- పండగ రద్దీని ఆసరా చేసుకుని సామాన్యుడి జేబుకు చిల్లు
- హైదరాబాదు నుంచి గుంటూరుకు రూ 3 వేలు పైనే
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ యాజమాన్యాలు

గుంటూరు(తూర్పు), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ డిమాండ్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ ఆపరేటర్లు సొమ్ము చేసుకుంటున్నారు. స్వగ్రామాలకు వెళ్లాలనే ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని, ఆర్టీసీ చార్జీలకు రెండు నుంచి మూడు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారు. గుంటూరు నుంచి హైదరాబాద్. చెన్నై, బెంగుళూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాలకు వెళ్లే బస్సుల్లో సాధారణ చార్జీలు మచుకైనా కనిపించడంలేదు. 'టికెట్ కావాలంటే ఇదే రేటు'అన్నట్టుగా ట్రావెల్స్ యాజమాన్యాలు వ్యవహరిస్తు న్నాయి. మరో ప్రత్యామ్నాయం లేక ప్రయాణికులు వారినే ఆశ్రయిస్తున్నారు.

బహిరంగంగానే దోపిడీ

గుంటూరు-హైదరాబాదు మార్గంలో ఆర్టీసీ (మిగతా 6వ పేజీలో)

ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం నెరవేర్చింది

- దశాబ్దాల తర్వాత తూర్పులో సంక్రాంతి సంబరాలు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాం తి సంబరాలను తూర్పు నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించాలన్న ప్రజల అకాంక్ష కూటమి ప్రభుత్వ హయాంలో నెరవేరిందని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. మంగళవారం తూర్పు నియోజక వర్గంలోని వెల్ఫేర్ సెంటర్ చంద్రబాబు నాయుడు క్రీడా ప్రాంగణంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా ఉన్న వెల్ఫేర్ సెంటర్‌ను ఆహ్లాదకరమైన సంక్రాంతి సంబరాలకు వేదికగా సిద్ధం చేయడంలో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, కమిషనర్ పులి శ్రీనివాసులు కృషి అభినందనీయమన్నారు. రానున్న కాలంలో ఈ స్థలంలో వాకింగ్ ట్రాక్, ఇతర క్రీడా సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలో గత 40 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న వెల్ఫేర్ సెంటర్ స్థలాన్ని శుభ్రం చేసి, మన గుంటూరు-మన సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మేయర్, ఎమ్మెల్యేలు కర్రా-బిళ్లా, ఏడు పెంకులాట, గాలి పటాలు ఎగర వేసి ప్రజలను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, ఏపీ ఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్, డిప్యూటీ మేయర్ సజిలా, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



కర్రా- బిళ్లా ఆడుతున్న మేయర్ రవీంద్ర, పెంకు ఆట ఆడుతున్న ఎమ్మెల్యే నసీర్

జీఎస్‌డీపీలో గుంటూరు సహకారమెంత?

- వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 6వ స్థానం
- పారిశ్రామికంగా 7, సేవలపరంగా 18వ ర్యాంకు

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీఎస్‌డీపీ), ముఖ్య ప్రగతి సూచికల విషయంలో గుంటూరు సహకారం అంతంత మాత్రంగానే ఉంది. వ్యవసాయం, అనుబంధ రంగాలు, పారిశ్రామిక, సర్వీసు సెక్టార్‌లలో జిల్లా ఏ మేరకు రాష్ట్ర జీఎస్‌డీపీకి సహకారం అందిస్తోందనే గణాంకాలను ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. అమరావతి రాజధాని నగరాన్ని కలిగి ఉన్నప్పటికీ గుంటూరు జిల్లా ఆశించినంతగా పురోగతి చూపించలేక పోతున్నట్లు అంకెలు విశ్లేషిస్తున్నాయి.

వ్యవసాయం, (మిగతా 7వ పేజీలో)

పైథానీ ప్రత్యేకం

మల్బరీ పట్టుతో తయారయ్యే పైథానీ చీరలు అద్భుతమైన మెరుపుతో పండగ శోభను ప్రతిబింబిస్తూ ఉంటాయి. కాబట్టి సంక్రాంతి శోభతో వెలిగిపోవాలంటే పైథానీ పట్టు చీరలనే ఎంచుకోవాలి

ఇతర పట్టు వస్త్రాలతో పోలిస్తే పైథానీ చీరలు మరింత జారుడుగా ఉంటాయి. చీరకు రెండువైపులా కనిపించే సంక్లిష్టమైన నేత పనితనం కళ్లను కట్టిపడేస్తూ ఉంటుంది. చిలుకలు, నెమళ్లు, పూల డిజైన్లతో రూపొందే ఈ చీరల తయారీకి కొన్ని నెలల సమయం పడుతుంది. నూరు శాతం చేతి పనితనంతోనే ఈ చీరలు తయారవుతాయి. కాబట్టే పైథానీ పట్టు చీరలు లక్షల ధర పలుకుతూ ఉంటాయి.



చీరల తయారీ ఇలా...

- పొడవు, మెరుపు, దృఢత్వం ఆధారంగా పట్టును విభజించి, బ్లీచ్ చేసి, రంగులు వేసి, ఆరబెడతారు
- ఆ తర్వాత నేత పని మొదలవుతుంది. ఇందుకోసం చేనేత కళాకారులు చేతి మగ్గాలను ఉపయోగిస్తారు. చీరలను నేసే క్రమంలో, పవిటకూ, అంచులకూ జరీని జోడిస్తూ ఉంటారు

ఈ ప్రాంతాలే ప్రసిద్ధి

మహారాష్ట్ర, ఔరంగాబాద్ జిల్లాలోని పైథానీలో ఈ చీరలు తయారవుతాయి. నాశిక్‌లోని యియోలాలో కూడా ఈ చీరలు ఎక్కువగా రూపొందుతున్నాయి. ఈ ప్రాంతం సంప్రదాయ, ఆధునిక డిజైన్ల పైథానీ చీరలకు పేరు పొందింది. కళ్లు చెదిరే రంగులు, బంగారు, వెండి జరీలు, పవిట, అంచుల మీద విశేషమైన నెమలి, తామర మోటిఫ్స్ ఈ చీరల ప్రత్యేకతలు

అసలైన పైథానీ కోసం...

పైథానీ చీరల నకళ్లు కూడా రూపొందుతూ ఉంటాయి. కాబట్టి అసలైన పైథానీని కచ్చితంగా గుర్తు పట్టడం కోసం కొన్ని లక్షణాలను గమనించాలి. పవిట, అంచులను తిరగేసి చూస్తే, చేనేతలోని సూక్ష్మ లోపాలు కనిపించాలి. అలాగే స్వచ్ఛమైన పట్టు మృదుత్వం తెలియాలి. చీర బరువుగా ఉండాలి. కలనేత రంగులు కనిపించాలి. నెమళ్లు, తామరల సంప్రదాయ మోటిఫ్స్ పదునైన ఔట్‌లైన్స్ కనిపించాలి. నకిలీ పైథానీ చీరల దారాలు వదులుగా ఉంటాయి. అలాగే వాటి జరీ ప్లాస్టిక్‌ను పోలిన మెరుపును కలిగి ఉంటుంది.

ఫ్యాషన్



సర్వహితం సంక్రాంతి సంబరం

తెలుగువారి సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పడుతూ... ఆధునిక హంగులను సైతం సదాచారం వైపు నడిపించే పండుగ సంక్రాంతి. 'క్రాంతి' అంటే వెలుగు. 'సంక్రాంతి' అంటే కొత్తదైన వెలుగు. మన జీవితాల్లో కొత్త వెలుగు నిండాలని కోరుకుంటూ చేసుకొనే సమష్టి ఆరాధన సంక్రాంతి. అందుకే పండుగల్లో ఇది అగ్ర తాంబూలాన్ని అందుకుంది.

పర్వదినం



సంక్రాంతి అంటే భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పేరుతో నాలుగు రోజుల ఆటవిడుపు కాదు. జీవన సంస్కృతికి ప్రతిబింబమైన సామాజిక పర్వదినం. రంగవల్లులు, గొబ్బెమ్మలు, బంతిపూలు, రేగు పండ్లు, బసవన్నలు, హరిదాసులు, పిండివంటలు, కొత్త బియ్యం, కోడి పందేలు, పతంగులు, చెరుకు గడలు, భోగి మంటలు, తర్పణాలు, దాన ధర్మాలు, ఆత్మీయమైన పలకరింపులు, అనుబంధాల సరదాలు, ఆచార వ్యవహారాలు... వీటన్నిటి సమాహారం సంక్రాంతి.

భోగి భాగ్యాలు

సంక్రాంతి సందడి భోగి రోజునే ప్రారంభమవుతుంది. పాత కలపను, వృధా వస్తువులను భోగి మంటల్లో వేసి, అగ్ని ఆరాధన చేయడం అంటే... పాత వాసనలు, వృధా ఆలోచనలు వదులుకొని కొత్త ఆశలతో జీవించాలనే సందేశం. కాలం కదిలిపోతుంది. భవిష్యత్తు వర్తమానం అవుతుంది. వర్తమానం కూడా గతం అనే మహార్ణవంలో కలిసిపోతుంది. గతాన్ని మరచి, భవిష్యత్తుకోసం దిగులు పడకుండా వర్తమానంలో జీవించాలని భోగి మంటలు చెబుతాయి. భోగి అనగానే గుర్తుకువచ్చేది భోగి పండ్లు. అపురూపమైన పసితనానికి దిష్టి తగలకుండా, అన్ని ఆనందాలూ పిల్లలకు లభించాలని ఆశీర్వదించేవే భోగి పండ్లు. ఆరోగ్యం, ఆనందం అనే భాగ్యాలను తెచ్చే భోగి పండుగ అద్వితీయమైన రోజు. బలి చక్రవర్తిని వామనుడు మూడు అడుగుల నేలను అడిగి, విశ్వమంతా వ్యాపించినది భోగి రోజునే అని, వ్యవసాయానికి ఆధారమైన వర్షానికి కారకుడు ఇంద్రుడు. ఆయన కృపవల్ల పంటలు సమృద్ధిగా చేతికి వచ్చాయని కృతజ్ఞతలు చెప్పుకొనే అవకాశాన్ని భోగి ఇచ్చిందని పురాణాలు చెబుతున్నాయి.

శుభ సంక్రాంతి

సూర్యుడు మకర రాశిలోకి సంక్రమణం చేసే శుభపర్వం మకర సంక్రాంతి. అన్ని పండుగలు చాంద్రమానం ప్రకారం చేసుకుంటే... సౌరమానం ప్రకారం జరుపుకొనే పండుగ సంక్రాంతి. ఆ రోజు నుంచే దక్షిణాయనం ముగిసి, ఉత్తరాయణం మొదలవుతుంది. శుభకార్యాలకు నెలవైన కాలం ఉత్తరాయణం. మకర సంక్రమణం తరువాత ఇళ్ళలో శుభకార్యాలను తలపెట్టడం ఆనవాయితీ. మనిషి తనలోని ప్రతికూల లక్షణాలన్నిటినీ వదులుకొని, సత్ప్రవర్తన అలవరచుకోవాలనే సందేశానికి ప్రతీక ఈ పండుగ. భగీరథ ప్రయత్నం ఫలించి, గంగానది భువిపై పరుగులు పెట్టిన రోజుగా దీన్ని పేర్కొంటారు. మనిషికి జీవితాన్ని, అస్తిత్వాన్ని ఇచ్చిన పూర్వీకులను సంస్మరించుకుంటూ తర్పణాలు ఇవ్వడం, దానాలు చేయడం సంక్రాంతి విధి. మనిషిని బ్రతికించేది అన్నం. సంక్రాంతి నాడు కొత్త ధాన్యంతో పరమాన్నం చేసి, భగవంతుడికి నివేదించి, అందరికీ అన్నం సమృద్ధిగా లభించాలని ఆకాంక్షించడం... సార్వజనీన సౌభాగ్యాన్ని సహృదయంతో కోరుకోవడమే అవుతుంది.

కృతజ్ఞతలే కనుమ

ప్రపంచానికి అన్నం పెట్టే రైతులతో కలిసి ఆరుగాలం శ్రమించే బసవన్నలను అలంకరించి, పూజలు నిర్వహించి, కృతజ్ఞతలు చెల్లించుకొనే మహత్తర పర్వం... కనుమ. పశుపక్ష్యాదులను కూడా గౌరవించుకొనే సందర్భం. పశుపోషణ, రక్షణ మానవుల కర్తవ్యం. వాడుకలో 'కనుమ'గా ఉపయోగించే పదానికి అసలు రూపం... కనుముపులు. 'కనుము' అంటే పశువు, 'పులు' అంటే మాలిన్యం. పశువుల మాలిన్యాన్ని శుభ్రపరచడం వెనుక... మనిషిలోని పశుత్వాన్నీ, మాలిన్యాన్నీ కడిగేసుకోమనే అర్థం దాగుంది. ప్రపంచంలో మనతోపాటు కలిసి ఉండే జీవజాతికి మంచి మనసుతో, నిష్కల్మషంగా కృతజ్ఞతలు తెలుపుకోవడమే అసలైన కనుమ పండుగ.

సంఘీభావమే ముక్కనుమ

సంక్రాంతి పండుగ వాతావరణానికి ముగింపు శోభను సంతరించే ముక్కనుమ... అందరినీ కలుపుకొనే విశేషమైన పర్వం. అందరినీ మనవారనుకొని ఊరంతా ఒక్కటయ్యే సూత్రం... రథం ముగ్గు రూపంలో ప్రతి ఇంటినీ ఒక్కటిగా చేస్తుంది. మనిషి సంఘజీవి. సంఘీభావంతోనే మనిషి మనుగడ సాధ్యపడుతుంది. 'నేను, నాది' అనే స్వార్థానికి తావివ్వని సమైక్య భావన మనలో ధ్వనించాలనేదే ముక్కనుమ సారాంశం.

• డాక్టర్ ఇట్టేడు అర్కనందనాదేవి

తీరంలో కత్తులు దూస్తున్న కోళ్ళు

(5వ పేజీ తరువాయి)

హైటెక్ క్లబ్‌ల తరహాగా పేకాట కోసం ప్రత్యేక గుడారాలు వేసి పేకాట, కోతముక్క ఆటలు జోరుగా కొనసాగించారు. లక్షలాది రూపాయలతో వేలాది మంది పందెం రాయుళ్ళు పాల్గొని పందాలను వేశారు. తూర్పుపాలెంలో రూ.10వేలు, రూ.20వేలు, రూ.50వేలు, రూ.లక్ష వరకు ప్రత్యేక బరులను ఏర్పాటు చేసి నిర్వాహకులు పందాలు నిర్వహించారు. వీఐపీ బరుల్లో లక్ష నుంచి రూ.3లక్షల వరకు కోడిపందాలు నిర్వహించారు. గుండాట, నెంబర్లాట విచ్చలవిడిగా కొనసాగించారు. లక్షల్లో పందాలు కాసి వీక్షించారు. వేలాది మంది కోళ్ళు పట్టుకుని పందాలు వేసేందుకు తరలి వచ్చారు. మహిళలు సైతం పందాలను చూసేందుకు భారీగా తరలివచ్చారు. బరులవద్దే ఆహారపానియాలు, స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. జోరుగా పందాలు కొనసాగాయి.

వేమూరు నియోజకవర్గంలో...

తెనాలి, కొల్లూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వేమూరు నియోజకవర్గంలో మంగళవారం కోడి పందాలు జోరుగా సాగాయి. వేమూరులో కేవలం రెండు మూడు చోట్ల కోడి పందాలు జరగగా మండల పరిధిలోని కోడిపర్రు వద్ద దాదాపు 11 నుంచి 12 ప్రాంతాల్లో కోడి పందాలు జరిగినట్లు సమాచారం. కొల్లూరు మండలంలోని కొల్లూరు, అనంతవరం బరుల వద్ద కూడా భారీగా కోడి పందాలు జరిగాయి. కోడి పందాలతో పాటు పేకాట, గుండాట, మద్యం, తదితరాలను పందెం రాయుళ్లు, జూదరుల కోసం అందుబాటులో ఉంచారు. కొల్లూరు బరిలో తొలిరోజు బుల్లెట్ బహుమతిగా కోడి పందెం నిర్వహించారు. చుండూరులో కోడి పందాలు గురించి సమాచారం అందుకున్న పోలీసులు బరి వద్దకు చేరుకొని పందాలకు అనుమతి లేదని అడ్డగించారు. దాంతో నిర్వాహకులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. అనంతరం రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు వెనుదిరగడంతో మళ్లీ యథావిధిగా కోడి పందాలు కొనసాగాయి. కోడి పందాలు ఎక్కువ మేర గెలుచుకున్న పందెం రాయుళ్లకు కార్లు, ద్విచక్ర వాహనాలను బహుమతులుగా అందజేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కొల్లూరు, అనంతవరం పందెం బరుల వద్ద బుల్లెట్ వాహనాలను పందేపు రాయుళ్లను ఆకర్షించే విధంగా ప్రదర్శనలో ఉంచారు.



కొల్లూరులో బరి వద్ద ప్రత్యేక బహుమతిగా బుల్లెట్



ట్రాక్టర్‌తో తొలగిస్తున్న కోడి పందేల బరి

పల్లెకు.. భోగి కళ

(5వ పేజీ తరువాయి)

కుటుంబాలు కావడం, ఏదో ఒక పంట ఇంటికి చేరి ఉండడంతో భోగి రోజు నుంచే సంబరాలు మరింత ఊపందు కోనున్నాయి

● బొమ్మల కొలువు ఏర్పాటు

భోగి పండుగ రోజున చిన్నారులపై భోగి (రేగు) పండ్లను పోసి పెద్దలు ఆశీర్వదిస్తారు. వాటిని తలపై పోస్తే పిల్లలకు స్వామి వారి అనుగ్రహం లభిస్తుందని భావిస్తారు. పిల్లలకు ఉన్న దిష్టి తొలగిపోయి వారి ఎదు గుదలకు తోడ్పడుతుందని పెద్దల విశ్వాసం. ఈ పవిత్రమైన రోజున ఇంద్ర దేవుడు, వరు ణ దేవుడిని పూజిస్తారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటారు. భోగి రోజు బొమ్మలకొలువును కూడా జరుపుతారు. హరిదాసులు కీర్తనలు, గంగిరెద్దులు ఆటలు అలరిస్తున్నాయి. గాలి పటాలు ఎగురవేసేందుకు చిన్నారులు సమాయత్త మవుతున్నారు. పలు గ్రామల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. మహిళలు చిన్నారులు కోలాటాలు వేయనున్నారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. నెల రోజుల పాటు ధనుర్మాస పూజలు నిర్వహిస్తున్నారు. ఈ పూజలు ముగింపుగా శ్రీ వెంటేశ్వరస్వామి దేవాలయాల్లో గోదాకల్యాణ ఉత్సవాలు నిర్వ హించేదుకు ఏర్పాటు చేస్తున్నారు. అయప్ప దేవాలయాల్లో మకర జ్యోతి దర్శనం నిర్వహి స్తున్నారు. అయప్ప స్వామికి తిరువా భరణా లను అలంకరించి పూజలు చేస్తారు అనంత రం అయప్ప స్వామి దేవాలయల్లో పడిపూజ లు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

● ప్రతి ఇంటా భోగి సంబరం

బుధవారం వేకువజామునుంచే ప్రతి ఇంటా భోగి మంటలు వేయనున్నారు. వీధివీధినా భోగి సంబరాలు అంబరాన్ని అంటనున్నాయి. ఏడాదంతా కూడా ఇంట సుఖశాంతులు వెల్లి విరియడంతో పాటు పంటలు కలిసి రావాలని కోరుకుంటూ భోగి వేడుక జరుపుకోనున్నారు. మహిళలు అందమైన ముగ్గులతో భోగికి ఆహ్వా నం పలుకుతుండగా, ఆలయాలన్నీ కూడా పం డుగ వేళ ప్రత్యేక అలంకరణలతో తీర్చిదిద్దారు. సంక్రాంతి పండుగ కోసం ఇప్పటికే విదేశాలలో స్థిరపడి ఉన్నవారుతో పాటు, నగర వాసులు కూడా పెద్ద ఎత్తున పల్లెబాట పట్టారు. వీరంతా కూడా భోగి మంటల కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని సంక్రాంతి పండుగ వేడుకలకు ఆహ్వానం పలకనున్నారు

కోడి పందాల బరి ధ్వంసం

రొంపిచర్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొనకంచివారిపాలెం గ్రామంలో కోడి పందాల బరిని రొంపిచర్ల పోలీసులు ధ్వంసం చేశారు. కోడి పందాల బరిని ఏర్పాటు చేస్తున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ లోకేశ్వరరావు సిబ్బందితో వెళ్లి కొనకంచివారి పాలెం సమీపంలోని బరిని తొలగించారు.

డ్రోన్‌తో గుర్తించి కొండవీడు అటవీ ప్రాంతంలో...

యడ్లపాడు: మండల పరిధిలోని కొండవీడు అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన శిబిరాలను గుర్తించి ధ్వంసం చేశారు. డ్రోన్ కెమెరాతో కొండవీడు కొండల సమీప ప్రాంతాలలో గస్తీ నిర్వహిస్తుండగా అటవీ ప్రాంతంలో కోడి పందాల కోసం ఏర్పాటు చేస్తున్న బరులను గుర్తించి ఆ ప్రాంతానికి చేరుకొని పందాల కోసం ఏర్పాటు చేసిన టెంట్లు, బరులు, సామగ్రిని పూర్తిగా తొలగించి ధ్వంసం చేశారు.

కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన



సన్నద్ధంగా ఉండాలి

- రద్దీకి అనుగుణంగా సామగ్రి ఏర్పాటు చేసుకోవాలి
- సరస్ మేళా స్టాల్స్ నిర్వాహకులతో డీఆర్‌డీఏ భేటీ

గుంటూరు సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో సరస్ మేళాకు ప్రజల తాకిడి అధికమయ్యే అవకాశాలున్నాయని, దానికి అనుగుణంగా స్టాల్స్‌లో సామగ్రి ఏర్పాట్లు చేసుకోవాలని నిర్వాహకులకు జిల్లా గ్రామీణాభివృద్ధి ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం నల్లపాడు రోడ్డులో రెడ్డి కళాశాల సమీపంలోని సరస్ మేళా అఖిలభారత డ్వాక్రా బజార్ ప్రాంగణంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి స్టాల్స్ నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ, డ్వాక్రా బజార్‌ను ప్రజలు అధిక సంఖ్యలో సందర్శిస్తున్నారని, రానున్న పండగ రోజుల్లో ఈ సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంద న్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు వారి ఉత్పత్తు లను సరసమైన ధరలకు అందిస్తే మరింత ఎక్కువమంది కొనుగోలు చేస్తారన్నారు. కొనుగోలు శాతం పెరిగితే మరింత గా ఆదాయం పొందుతారని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా పంచాయతీ అధికారి సాయికుమార్, ఏపీడి కిరణ్ కుమార్, డీపీఎంలు, ఎపీఎంలు, డ్వాక్రా బజార్‌లో స్టాల్స్ నిర్వ హిస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



కళాకారుల డప్పు విన్యాసాలు

● ఆహార పదార్థాల తయారీ పరిశ్రమలపై శిక్షణ

సరస్ మేళా అఖిలభారత డ్వాక్రా బజార్ ప్రాంగణంలోని శిక్షణా కేంద్రంలో ఆహార పదార్థాల తయారీ పరిశ్రమల ఏర్పాటుపై సెర్ప్ నుంచి వచ్చిన ప్రతినిధులు స్వయం సహాయక సంఘాల సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతం డిమాండ్ ఉన్న చిరుధాన్యాలతో తయారుచేసే ఆహార పదార్థాలు, బిస్కెట్లు ఇతర వస్తువుల తయారీ పరిశ్రమలు ఏర్పాటుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా అందిస్తున్న ప్రోత్సాహాలు, కావలసిన అనుమతులపై అవగాహన కల్పించారు. షేడ్ నెట్ వ్యవసాయం గురించి వ్యవసాయశాఖ అధికారులు, వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై వైద్యారోగ్య శాఖ అధికారులు అవగాహన కల్పించారు. సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను అలరించాయి.

ప్రైవేట్ దోపిడీ

(5వ పేజీ తరువాయి)

సూపర్ లగ్జరీ బస్సు చార్జీ రూ.600-700 మధ్య ఉంది. గరుడ ప్లస్ బస్సుల్లో రూ.1,000 లోపే ఉంది. అదే మార్గంలో ప్రైవేటు ట్రావె ల్స్ బస్సులు రూ. 2 వేల నుంచి రూ.3 వేల వరకు టిక్కెట్ ధరలు నిర్ణయించారు. స్లీపర్ బస్సుల పరిస్థితి అయితే రూ 4 వేలపైనే వ సూలు చేస్తున్నారు. గుంటూరు-చెన్నై మార్గంలో ఆర్టీసీ ఏసీ చార్జీ సుమారు రూ.1,300గా ఉంది. ప్రైవేటు బస్సుల్లో ఈ టికెట్ రూ.2,800 నుంచి రూ.3వేలు వరకు పలుకుతోంది. గుంటూరు- బెంగళూరు మార్గంలో ఆర్టీసీ ఏసీ స్లీపర్ చార్జీ రూ.1,700-1,800గా ఉంటే, ప్రైవేటు ట్రావెల్స్‌లో అదే టికెట్ రూ.8 వేలు దాటుతోంది. జిల్లా పరిధిలో సుమారుగా 200పైగా ప్రైవేట్ బస్సుల కార్యాలయాల్లో ఇదే ధరలను నిర్ణయించి వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. దీనికి తోడు ఆర్టీసీ యాజమాన్యం హైదరాబాదు, చెన్నై, వైజాగ్, బెంగళూరు తోపాటు ఇతర ప్రాంతాలకు ఎన్ని బస్సులు తిప్పాలనే నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్రైవేటు ట్రావెల్స్ వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

● హెల్ప్‌లైన్ నెంబరు ఏర్పాటు

ప్రయాణికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచు కుని రాష్ట్రవ్యాప్తంగా 92816 07001 అనే హెల్ప్‌లైన్ నెంబరు ఏర్పాటు చేశారు. బస్సు ఛార్జీలు లేదా ఇతర సమస్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే అధికారులు స్పందించి తక్ష ణ పరిష్కారం అందిస్తారు. ఈ హెల్ప్‌లైన్ నెంబర్‌ను ప్రతి ప్రైవేట్ బస్సులో తప్పనిస రిగా స్పష్టంగా ప్రదర్శించాలని బస్సు యజమానులకు ఆదేశాలు జారీ చేసినట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

54 బస్సులపై కేసులు

గత ఐదు రోజులుగా జరుగుతున్న ఈ తనిఖీలలో అధిక ఛార్జీలు వసూలు చేసిన 54 బస్సులపై కేసులు నమోదు చేసి రూ2,18,100/-జరిమానా విధించాం. అలాగే పన్ను, పర్మిట్ వంటి ఇతర నిబంధనలు ఉల్లంఘించిన 7 బస్సులపై కేసులు నమోదు చేసి రూ 70 వేలు జరిమానా విధించాం. నిర్ధేశించిన ఛార్జీలపై గరిష్టంగా 50 శాతం మాత్రమే అదనంగా వసూలు చేయాలి. దానికంటే ఎక్కువ ధరకు టికెట్లు విక్రయిస్తే సంబంధిత బస్సు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

-గుంటూరు ఇన్‌చార్జ్ జిల్లా డీటీసీ శ్రీహరి

ఘనంగా నాటిక పోటీలు ప్రారంభం

పెదకాకాని, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో డాక్టర్ కాసరనేని సదాశివరావు కళా పరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజు లు పాటు జరిగే 15వ జాతీ యస్థాయి నాటికల పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. నాటికల పోటీలను ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎర్ర నాగేశ్వరరావు, డాక్టర్ పాతూరి ఉషాబాల జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నాటిక పోటీలు అలరించాయి. తొలిరోజు ప్రదర్శించిన 'ద్వారబంధాల చంద్రయ్య నాయుడు' నాటిక దేశభక్తిని ప్రబోధించింది. పిల్లనిచ్చేవారు లేక బ్రహ్మచారి జీవితం గడుపుతున్న యువకుడికి ఓ రాత్రి పరిచయమైన మహిళ కారణంగా తన జీవితం ఎలా మరుపు తిరిగిందో వన్ ప్లస్ వన్ నాటిక తెలి యజే సింది. అవయవ దానం ఆవశ్యకతను సూక్తం నాటిక చాటి చెప్పింది. ఈ కార్యక్రమంలో లలిత కళానికేతన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



తక్కెళ్లపాడులో జరుగుతున్న నాటికలోని ఓ సన్నివేశం

క్షేత్రస్థాయికి వెళ్లి తప్పుడు ప్రచారాలా..!

● వైసీపీ నేతలపై మంత్రి మనోహర్ మండిపాటు




విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

తెనాలి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉన్న చివరి సంవత్సరంలో తెనాలి నియోజకవర్గంలో కేవలం 29 మంది రైతుల దగ్గర రూ.63 లక్షల విలువైన ధాన్యం మాత్రమే కొనుగోలు చేసిందని, ఈ ఏడాది కూటమి ప్రభుత్వం 3,884 మంది రైతుల దగ్గర రూ.51.76 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసిందని రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి రైతులను కలిసి వారికి కూడా వైసీపీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. మంగళవారం తెనాలి మండలంలో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో వైసీపీ నాయకులు తప్పుడు లెక్కలు చెప్పి జనాన్ని తప్పుదారి పట్టిస్తున్నారన్నారు. గుంటూరు జిల్లాలో కూటమి ప్రభుత్వం 11,773 మంది రైతుల నుంచి 76,015 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న చివరి సంవత్సరంలో కేవలం 550 మంది రైతుల దగ్గర నుంచి 5,913 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందన్నారు. ధాన్యం కొనుగోళ్ల తర్వాత సమయంలో రైతులకు తూకం ఇతర జిల్లాల నుంచి కొనుగోలు చేశామని, సీడ్ ఆఫ్ డెలివరి గవర్నెన్స్ నిదర్శనంగా రాష్ట్ర వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు జరిగిందన్నారు. సమావేశంలో కనకదుర్గ ఆలయ కమిటీ సభ్యుడు తోటకూర రమణరావు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఇస్మాయిల్, మధుబాబు, రవికాంత్, దుర్గా, పసుపులేటి మురళి, న్యాయవాది హరిదాసు గౌరీశంకర్, కౌన్సిలర్ మానసారెడ్డి పాల్గొన్నారు.

మిర్చియార్డు సమాచారం

(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	44,140
అమ్మకాలు	50,136
నిల్వ	7,187

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13000	19000
నెం.5	13500	18800
273	----	----
341	14000	20400
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11500	15500
షార్క్-1	----	----
బ్యాడిగి	13000	18000
దేవనూరు డీలక్స్	13500	20500
ఆర్మూరు	12000	14000
ఏసీ కామన్ వెరైటీ		
334	12000	18400
నెం.5	13000	18000
273	----	----
341	13000	19000
4884	----	----
సూపర్ 10	13500	18800
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	11000	15000
బ్యాడిగి 355	12000	17500
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	5500	8700

ఈకేవైసీలో గుంటూరు వెనుకబాటు

● రాష్ట్రంలో 18వ స్థానం ● 23వ స్థానంలో బాపట్ల ● 8వ స్థానంలో పల్నాడు

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రీసర్వే జరిగిన గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తోన్న నూతన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీకి సంబంధించి ఈకేవైసీ పూర్తి చేయడంలో గుంటూరు, బాపట్ల వెనుకబడ్డాయి. గుంటూరు జిల్లా 18వ స్థానంలో కొనసాగుతుండగా, బాపట్ల జిల్లా 23వ స్థానంలో ఉంది. ఈ విషయంలో పల్నాడు జిల్లా పరిస్థితి చాలా మెరుగుపడింది. ఆ జిల్లా రాష్ట్రంలో ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో పండగ సెలవుల తర్వాత వీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రభుత్వం ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. దీంతో కలెక్టరేట్ నుంచి మండల తహసీల్దార్ కార్యాలయాలకు పట్టాదారు పాసు పుస్తకాల ఈకేవైసీని త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

గత వైసీపీ హయాంలో జరిగిన తప్పులను సవరించి ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం నూతన పట్టాదారు పాసుపుస్తకాలను రాజముద్రతో రూపొందించింది. వాటన్నింటిని జిల్లా యంత్రాంగాలకు పంపించి పంపిణీకి శ్రీకారం చుట్టింది. అయితే ముందుగా ప్రతి ఒక్క భూయజమాని ఈ కైవేసీ చేయాలని నిర్ణయించింది. గుంటూరు జిల్లాకు సంబంధించి ఈ కేవైసీ కోసం 35,380 ఖాతాలను ఇచ్చింది. వాటిల్లో 28,475 ఈ కైవేసీ పూర్తయింది. ఇంకా 6,635 పెండింగ్‌లో ఉన్నాయి.

రాష్ట్రంలోని కొన్ని జిల్లాలో 90 నుంచి 95 శాతం ఈ కైవేసీ పూర్తయింది. ఈ కారణంగా జిల్లాకు 18వ స్థానాన్ని ప్రభుత్వం కేటాయించింది. చేబ్రోలులో 92.71, తెనాలిలో 88.87, పెదకాకానిలో 89.51, ప్రత్తిపాడులో 81.80, మేడికొండూరులో 81.90, వట్టిచెరుకూరులో 84.80 శాతం పూర్తికాగా దుగ్గిరాలలో 69.92 శాతం మాత్రమే పూర్తయింది. కాగా నగరం జాగర్లమూడి, కంచం కొండూరు, చింతలపూడి, చినపలేం, తుమ్మపూడి, మోరంపూడి, పొట్లపాడు, వరగాని, వెలవర్తిపాడు, నిరిపూడిపై రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

● ఆశాజనకంగా పల్నాడు

పల్నాడు జిల్లాలో ఈకైవేసీ ప్రక్రియ ఆశాజనకంగా కొనసాగుతోంది. ఆ జిల్లాలో ఖాతాల సంఖ్య కూడా ఎక్కువగా ఉంది. మొత్తం 99,689 ఖాతాలను ఈకైవేసీ కోసం ప్రభుత్వం పంపించగా 91.44 శాతం పూర్తి చేశారు. 91,160 మంది ఈకైవేసీ పూర్తి కావడంతో రాష్ట్రంలో ఎనిమిదో ర్యాంకు దక్కింది. బాపట్ల జిల్లాలో 49,575 ఖాతాలుండగా ఇప్పటివరకు ఈకైవేసీ 64.43 శాతం 31,941 మందివి మాత్రమే పూర్తి చేశారు. దీంతో ఈ జిల్లా ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

3 గ్రామాలలో 25 శాతం భూసమీకరణ పూర్తి

మంత్రి నారాయణ



రహదారి పనులు ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : పెదకూర పాడు నియోజకవర్గ పరిధిలోని పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాలలో ఇప్పటికే 25 శాతం భూమిని ఇస్తూ రైతులు అంగీకార పత్రాలు అందించారని మంత్రి నారాయణ తెలిపారు. 80 శాతం భూ మికి అంగీకార పత్రాలు రాగానే, రైతులకు రిటర్నబుల్ ప్లా ట్లు, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆయన వివరించారు. మంగళవారం కర్లపూడి-అనంత వరం గ్రామాల మధ్య రహదారి పునర్నిర్మాణ పనులకు మంత్రి శంకు స్థాపన చేశారు. కర్లపూడి రైతులు సోమవారం రోడ్డు గురించి మంత్రిని అడగగా, 24 గంటలలో మంత్రి నారాయణ అనుమతి మంజూరు చేసి పనులను ప్రారంభించారు. రైతులను ఒప్పించే విషయంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చూపిస్తున్న చొరవ అభినందనీయమన్నారు. వారం రోజులలో రహదారి పూర్తిచేయడం జరుగుతుందని మంత్రి తెలియజేశారు. ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించడంలో మంత్రి నారాయణ చూపిస్తున్న శ్రద్ధ అభినంద నీయమన్నారు. నెల రోజులలో 80శాతం భూసమీకరణ జరిగేలా కృషిచేస్తానని మంత్రికి హామీ ఇచ్చారు.

రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

● సీసీఐ కేంద్రాలను తనిఖీ చేసిన మార్కెటింగ్ జేడీ

గుంటూరు సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో మార్కెటింగ్ సిబ్బంది అక్రమంగా నగదు వసూలు చేస్తు న్నారన్న ఆరోపణలపై అధికారులు స్పందించారు. ఈ అంశంపై సమగ్ర విచారణ చేపట్టేందుకు మార్కెటింగ్ సంయుక్త సంచాలకులు (జేడీ) కాకుమాను శ్రీనివాసరావు సోమవారం గుంటూరు జిల్లాలోని పలు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. 'ఆంధ్రజ్యోతి'లో 'తగ్గేదే లే' శీర్షికతో ప్రచురితమైన కథనం నేపథ్యంలో కొనుగోలు ప్రక్రియను పరిశీలించిన ఆయన రైతులతో నేరుగా మాట్లాడారు. వేలిముద్రలు, యాప్‌లలో నమోదు ప్రక్రియ, తూకం, చెల్లింపుల అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలంటూ కేంద్రాల్లో పనిచేస్తున్న అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు.

● అవకతవకలు జరిగితే సహించం

సీఎం, కపాస్ కిసాన్ యాప్‌ల ద్వారా జరిగే కొనుగోలు ప్రక్రియలో ఎక్కడైనా అవకతవకలు చోటు చేసుకుంటే సహించబోమని జేడీ స్పష్టం చేశారు. వేలిముద్రల విషయంలోనూ, రైతుల వివరాల నమోదు సమయంలోనూ ఎలాంటి అదనపు వసూళ్లకు ఆస్కారం ఉండకూడదని తేల్చిచెప్పారు. ఎవరైనా డబ్బులు అడిగినట్లు రైతులు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని అన్నారు. పత్తి కొనుగోళ్ల ప్రక్రియ పూర్తిగా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే జరగాలని, రైతుల నుంచి ఒక్క రూపాయి కూడా అక్రమంగా వసూలు చేయొద్దని స్పష్టం చేశారు. అన్ని సీసీఐ కేంద్రాల్లో క్రమశిక్షణ పాటించడంతో పాటు రైతులకు నమ్మకం కలిగేలా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. గుంటూరు నగరంలోని 11 మిల్లుల్లో పర్యటించినట్లు జేడీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ తనిఖీలలో ఏడీ సత్యనారాయణ చౌదరి, యార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మార్కెటింగ్ జేడీ కాకుమాను శ్రీనివాసరావు, ఏడీ సత్యనారాయణ చౌదరి

ఎల్ఎల్ఎం పరీక్ష ఫలితాల విడుదల

ఏఎన్‌యూ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గతేడాది అక్టోబరులో నిర్వహించిన ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను మంగళవారం పరీక్ష నిర్వహణాధికారి ఆలపాటి ప్రసాద్ విడుదల చేశారు. ఈ పరీక్షలకు 165 మంది అభ్యర్థులు హాజరు కాగా 146 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 88.48 ఉత్తీర్ణత శాతం ఉందని అన్నారు. ఒక్కో సబ్జెక్టుకు రీవాల్యుయేషన్ ఫీజు రూ.1860, పర్సనల్ వెరిఫికేషన్ జిరాక్స్ కాపీ ఆన్సర్ బుక్లెట్ ఫీజు రూ.2190 చెల్లించాలన్నారు. పరీక్ష ఫలితాల కోసం ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని ఆలపాటి ప్రసాద్ తెలిపారు.

16న పెన్షన్ అదాలత్

గుంటూరు (విద్య), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 16న పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు గుంటూ రులోని కృష్ణనగర్‌లో ఉన్న పీఎఫ్ కార్యాలయంలో అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుంటూరు, కృష్ణ, ప్రకాశం జిల్లాల పరిధిలోని భవిష్యనిధి పెన్షన్‌దారులు నేరుగా తమ సమస్యలను విన్నవించుకో వచ్చని తెలిపారు. నేరుగా హాజరు కాలేని వారు 9494657469 వాట్సాప్ నెంబర్ లేదా ఆర్వో గుంటూరు ఎట్ ది రేట్ ఈపీఎఫ్ ఇండియా డాట్ జీవోవీ.ఇన్ మెయిల్‌కు లేదా 26433556243 ఎబెక్స్ ఐడీకీ సమస్యలు పంపాలని సూచించారు.

ముగిసిన బ్యాక్ టు రూట్స్ సమావేశాలు



కోర్‌కమిటీ సభ్యులు కొసరాజు దేవకుమార్‌ను సత్కరిస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

అమృతలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పుట్టిన ఊరు, గ్రామ మూలాలు మర్చిపోకూడదన్న ఉద్దేశంతో మండల పరిధిలోని తురుమెళ్లలో ఏర్పాటు చేసిన బ్యాక్ టు రూట్స్ ఆత్మీయ సమావేశాలు మంగళవారం ముగిశాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముగ్గులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల ప్రదర్శన, హరిదాసుల కీర్తనలు, ఎద్దుల బలప్రదర్శనలు, నమూనా కోళ్ళ పందాలు జరిపారు. చి న్నారులు, మహిళలు సంక్రాం తి పండుగ ఉట్టిపడేలా ముగ్గులు వేశారు. ఈ ఆత్మీయ సమావేశానికి సుమారు 200 కుటుంబాల వారు హాజరయ్యారు. ఈ కార్యక్రమ నిర్వహించిన కొసరాజు విజయ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కోర్ కమిటీ సభ్యులు కొసరాజు దేవకు మార్, పర్వతనేని భానుప్ర సాద్, బేతాళ కిరణ్, ఆళ్ళ అంకమ్మరావు, గ్యారా నరేష్, చంద్రబాబును పూలమాల లు, శాలువాలతో విజయ్ కుమార్ సత్కరించారు.

జీఎస్‌డీపీలో గుంటూరు సహకారమెంత?

(5వ పేజీ తరువాయి)

అనుబంధ రంగాల్లో జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం 37 సూచికలను నిర్దేశించింది. వాటికి సంబంధించి స్కోరు 88 రావడంతో ఏ గ్రేడ్‌తో 6వ ర్యాంకును కేటాయించింది. పారిశ్రామిక రంగంలో గుంటూరుకు ఆరు సూచికలు ఇచ్చింది. ఇందులో 87 స్కోరుతో 7వ ర్యాంకుతో ఏ గ్రేడ్ వచ్చింది. సర్వీసు సెక్టార్‌లో జిల్లాకు ఏడు సూచికలు కేటాయించగా 81 స్కోరుతో 18వ స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో జిల్లా ప్రణాళిక విభాగం మూడు అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ప్రభుత్వం ఆదేశించింది. కీలక ప్రగతి సూచీల ద్వారా ఆర్థిక కార్యకలాపాలను సేకరించాలని సూచించింది. వ్యవసాయం, ఉద్యాన, పశుసంవర్ధకం, పరిశ్రమలు, గనులు, వాణిజ్య పన్నుల శాఖల ద్వారా ప్రగతి సూచీల కోసం రియల్‌టైం డేటాను తెప్పించుకోవాలని స్పష్టం చేసింది. సర్వీసు సెక్టార్‌లో ఆర్థిక సేవలు, రియల్‌ఎస్టేట్, ఐటీ, పారిశ్రామిక కార్యకలాపాలు పెంచాలని సూచించింది. కార్గో హ్యాండ్లింగ్ కెపాసిటీని పెంచుకోవాలని, దేశీయ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా పర్యాటక ప్రదేశాలను తీర్చిదిద్ది ఈవెంట్స్‌ను నిర్వహించాలని ప్రీమియర్ పర్యాటక ప్రాంతంగా ప్రమోట్ చేయాలని సూచించింది.

రేవుల లీజు వేలం పాటలు రద్దు

● జిల్లా పరిషత్ సీఈవో వీర్ల జ్యోతి బసు

గుంటూరు సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ యాజమాన్యంలోని కృష్ణానది పరీవాహక ప్రాంతంలోని రేవులపై 2025-26 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించిన బహిరంగ వేలం పాటలను జిల్లా పరిషత్ రద్దు చేసింది. ఈ మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ సీఈవో వీర్ల జ్యోతి బసు మంగళవారం వివరాలు వెల్లడించారు. లీజు కేటాయింపునకు సంబంధించి మూడు పర్యాయాలు బహిరంగ వేలం నిర్వహించినప్పటికీ, హెచ్చు పాటదారులు పడవలు, బల్లకట్టుకు సంబంధించి దిన తప్పనిసరి ధ్రువపత్రాలను జిల్లా పరిషత్ కార్యాలయానికి సమర్పించలేదని తెలిపారు. నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలు అందజేయకపోవడంతో, కార్యాలయ ఉత్తర్వుల ప్రకారం బహిరంగ వేలంలో హెచ్చుపాటదారులు దాఖలు చేసిన పాటలను రద్దు చేసినట్లు తెలిపారు. జిల్లా పరిషత్ పరిధిలోని రేవుల నిర్వహణ పూర్తిగా నిబంధనల మేరకే జరగాలని, అర్హతలు లేని వారికి లీజులు కేటాయించే ప్రశ్నే లేదని సీఈవో స్పష్టం చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాంట్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	173, 182, 193
చికెన్ విత్ స్కిన్(కిలో)	336.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	346.00

జిల్లాలో జన గణనకు సిద్ధం : కలెక్టర్



జన గణనపై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రావత్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కి హాజరైన కలెక్టర్, జేసీ, కమిషనర్, డీఆర్‌వో

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జనగణన కార్యక్రమాన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. అమరావతి నుంచి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ జనగణన కార్యక్రమాల అమలుపై మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరు నెలల నుంచి ఏడాది పాటు జరిగే ఈ ప్రక్రియకు కాగిత రహితంగా డిజిటల్ యాప్ ద్వారా జనగణన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఫేజ్-1లో హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్, ఫేజ్-2లో జనాభా గణన జరుగుతుందన్నారు. సెన్సస్ డైరెక్టర్ జే నివాస్ మాట్లాడుతూ అధికారుల పాత్ర, నియమ, నిబంధనలు గురించి పవర్ పాయింట్ ద్వారా వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన జనాభా లెక్కల అధికారిగా కలెక్టర్ వ్యవహరించడం జరుగుతుందని, అదనపు ప్రధాన జనాభా లెక్కల అధికారిగా జేసీని నియమించడం జరిగిందన్నారు. అదనపు జిల్లా జనాభా లెక్కల అధికారులుగా జిల్లా ప్లానింగ్ ఆఫీసర్, జిల్లా విద్యాశాఖాధికారి, జడ్పీ సీఈవో, సర్వే శాఖ ఏడీ, పంచాయతీరాజ్ అధికారి, జిల్లా ఫారెస్టు ఆఫీసరుని నియమించడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజావలి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వీ జ్యోతి బసు, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, జిల్లా విద్యా శాఖ అధికారి డాక్టర్ షేక్ సలీం భాషా, ముఖ్య ప్రణాళిక అధికారి శేషశ్రీ పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాల పోస్టర్ల ఆవిష్కరణ

గుంటూరు సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉచిత పశు వైద్య శిబిరాలను ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. పశు వైద్య శిబిరాల పోస్టర్లను కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ అన్ని మండలాల్లో పశువైద్యాధికారుల సారథ్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేసి శిబిరాలను నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఉచిత పశు వైద్య శిబిరాలలో గొర్రెలు, మేకలకు, పెద్ద పశువులకు, లేగ దూడలకు ఉచితంగా నట్టల నిర్మూలన మందులు వేయడం జరుగుతుందని చెప్పారు. గొర్రెలకు బొబ్బ వ్యాధి నిరోధక టీకాలు, కోళ్లలో కొక్కెర తెగులు నివారణ టీకాలు, అనారోగ్య పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇస్తామని తెలిపారు. రైతులు ఉచిత పశువైద్య శిబిరాలలో అందించే పశు వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నగరంలో సంక్రాంతి సందడి

- పూజా సామగ్రి కొనుగోళ్లు
- పూల ధరలకు రెక్కలు



పూల కొనుగోళ్లతో కోలాహలం

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో సంక్రాంతి సందడి నెలకొన్నది. మంగళవారం ఉదయం నుంచే కొనుగోళ్లతో కోలాహల వాతావరణం కనిపించింది. ఇక సాయంత్రం ప్రజల సందర్శనతో మరింత రెట్టింపైంది. నగరంలో లాలాపేట, మార్కెట్ సెంటర్, జిన్నాటవర్ సెంటర్, కూరగాయల మార్కెట్ సెంటర్, బ్రాడీపేట, చుట్టుగుంట, గుజ్జనగుండ్ల, కొరిటపాడు, బృందావన్ గార్డెన్స్ సెంటర్‌లలో ప్రజల కొనుగోళ్లతో సందడి వాతవరణం కనిపించింది. ముఖ్యంగా చెరకు గడలతో పాటు పూలు, పండ్లు, కొబ్బరికాయలు వంటి పూజా సామగ్రి కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపారు. ఇదే సమయంలో పూల ధరలకు మరింత గిరాకీ పెరిగింది. బంతి పూలు మూర రూ.15 నుంచి రూ.20 వరకు విక్రయించారు. ఇక మిగతా గుండుమల్లి వంటి పూలు మూర రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఇక భోగి, సంక్రాంతి పండుగకు ఇంటి ముందు రంగవల్లుల కోసం రంగులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు.

70 ఏళ్లు దాటితే ఆయుష్మాన్ భారత్‌లో చేరొచ్చు

- డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి వెల్లడి

గుంటూరు మెడికల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 70 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (పీబీ పీఎంజేఏవై) పథకంలో చేరి ఉచితంగా వైద్య సేవలు పొందొచ్చని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో చేరేందుకు సీనియర్ సిటిజన్లకు ఆదాయ పరిమితి లేదని, 70 ఏళ్లు దాటిన వారెవరైనా చేరేందుకు అర్హులేనని ఆమె తెలిపారు. వయా వందన పథకంలో నమోదు చేసుకోదలచిన వారు తమ దగ్గరలోని సచివాలయంలో సంప్రదించాలని డీఎంహెచ్‌వో సూచించారు.

కల్తీని కనుగొనేందుకు అధునాతన విధానాలను అవలంబించాలి

- ఐపీఎం డైరెక్టర్ నీలకంఠరెడ్డి

గుంటూరు(తూర్పు), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త విధానాలు అవలంబించి ప్రయోగశాలలో నీటి నాణ్యతలు, ఆహర కల్తీ నిరోధకాలను గుర్తించాలని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసన్(ఐపీఎం) డైరెక్టర్ కే.నీలకంఠరెడ్డి అన్నారు. గుంటూరు మెడికల్ కళాశాల ఆవరణలోని రీజినల్ లేబొరేటరీని మంగళవారం ఆయన సందర్శించారు. నీలకంఠరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో పాత విధానాలతో కల్తీని పూర్తిస్థాయిలో గుర్తించలేమని అన్నారు. అందుబాటులోకి వచ్చిన పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని ఉద్యోగులకు సూచించారు. నూతన పరికరాలపై సిబ్బందికి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తామన్నారు. కొత్త విధానాలు, ఆధునిక పరికరాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు గుంటూరు లాబొరేటరీకి ఎన్ఏబీఎల్ అక్రిడేషన్‌కు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సర్జన్ బ్యాక్టీరియాలజిస్ట్ డాక్టర్ జి.శోభారాణి, నీటి నాణ్యత నిపుణులు వినుకొండ రాజారావు, విజయకుమారి, జూనియర్ ఎనలిస్టులు కే.జయప్రకాష్, జయలక్ష్మి, యోగేశ్వరరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్లు ధనలక్ష్మి, నాగేశ్వర్ రెడ్డి, వెంకట్రావు, రీజనల్ ల్యాబ్ శాంపిల్ టేకర్ వి.శివకుమార్, డాక్టర్ సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



రీజినల్ లేబోరేటరీలోని పరికరాలను పరిశీలిస్తున్న ఐపీఎం డైరెక్టర్ కే నీలకంఠారెడ్డి

హిందూ ఫార్మసీ కళాశాలలో ఘనంగా యువజనోత్సవాలు

గుంటూరు (విద్య), జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో మంగళవారం యువజనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తి యువతకు ఆదర్శనీయమన్నారు. హిందూ డిగ్రీ కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎస్‌వీఎస్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ స్వామి వివేకానంద ఆదర్శనీయమని అన్నారు. యువత గమ్యం చేరే వరకు నిరంతరంగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కళాశాలలో నిర్వహించిన సాంస్కృతిక, ఆటల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ జి.ఇందిరా ప్రియదర్శిని, ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జూపూడి రంగరాజు తదితరులు

విద్యుత్ శాఖలో సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు

- గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ రమేష్

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో అధికారులు, ఉద్యోగులు సమష్టి కృషితో పని చేస్తేనే ఉత్తమ ఫలితాలు వస్తాయని గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ తెలిపారు. ఏపీ ఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర 2026 డైరీని సంగడిగుంట విద్యుత్ భవన్‌లో మంగళవారం ఎస్ఈ రమేష్, గుంటూరు టౌన్-1 ఆపరేషన్ ఈఈ పీహెచ్ ఖాన్‌ల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎస్ఈ మాట్లాడుతూ ఉద్యోగులు సంస్థ అభ్యున్నతికి మరింత కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా రీజనల్ సెక్రటరీ మామిడి చంద్రశేఖర్, ప్రెసిడెంట్ కే.సారధి, అసోసియేషన్ సీపీడీసీఎల్ ఉపాధ్యక్షుడు బి.రాజమోహన్, నగర అధ్యక్షుడు రామ్ ప్రభాకర్, కార్యదర్శి దేవదాస్, రామకోటేశ్వరరావు, అసోసియేషన్ నాయకులున్నారు.

సంక్షేమ బోర్డు నిధులు దారి మళ్లించడం దుర్మార్గం

గుంటూరు(తూర్పు), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను ప్రభుత్వ ప్రచారానికి ఖర్చు చేయాలనే కార్మిక శాఖ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం(సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. నిధుల దుర్వినియోగం నిరసిస్తూ మంగళవారం అరండల్‌పేట, జిల్లా కార్మిక శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వస్తే భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని, పెండింగ్ క్లైమ్‌లు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా నేరవేర్చలేదన్నారు. పైగా ఈ నిధులను ప్రభుత్వం ఇతర అవసరాలకు దారి మళ్ళించడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేఖంగా బుధవారం జరిగే భోగి మంటలలో దహనం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బి.ముత్యాలరావు, శ్రీనివాసరావు, పి.దీవెనరావు, షేక్ ఖాసిం వలీ, దొడ్డ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అంజుమన్ ఇ ఇస్లామియా సంస్థకు ఎన్నికలు నిర్వహించాలి

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో ముస్లింల ధార్మిక సంస్థ అంజుమన్ ఇ ఇస్లామియా సంస్థకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్ కోరారు. పాతగుంటూరులోని కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అంజుమన్ సంస్థకు ప్రస్తుతమున్న కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలానే అంజుమన్ భూముల ప్రైవేటీకరణను ఉప సంహరించుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో వహబ్, షేక్ మీరా తదితరులున్నారు.

వైసీపీ ప్రచార కమిటీ కార్యదర్శిగా శ్రీనివాసరావు

గుంటూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శిగా పాతగుంటూరుకు చెందిన చింకా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు వైసీపీ తూర్పు ఇన్‌ఛార్జ్ షేక్ నూరిఫాతిమాను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

వేడుకగా సంక్రాంతి సంబరాలు



ముగ్గులను పరిశీలిస్తున్న ఎల్వీఆర్ క్లబ్ సభ్యులు

గుంటూరు(తూర్పు), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరిటెపాడు, ఎల్వీఆర్ అండ్ సన్స్ రీడింగ్ రూం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజున రంగోలి, వంటల పోటీలను నిర్వహించారు. పోటీలలో పాల్గొన్న వారికి బహుమతులు అందజేశారు. క్లబ్ సాంస్కృతిక విభాగం నిర్వాహకుడు డాక్టర్ చిట్టినేని శివకోటేశ్వరరావు కార్యక్రమాల్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నూకవరపు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పతంగి జనార్ధనరావు, తిరువీధి వెంకటరమణయ్య, కొలిపాకుల చంద్రశేఖర్, వజ్రాల సాంబిరెడ్డి, కొమ్మినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సరస్ మేళాను సందర్శించిన చిల్డ్రన్ హోమ్ పిల్లలు

గుంటూరు సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా సూచనలు మేరకు జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న చిల్డ్రన్స్ హోంలోని చిన్నారులను సరస్ మేళాకు ఐసీడీఎస్ పీడీ ప్రసూన మంగళవారం సాయంత్రం తీసుకువచ్చారు. వారికి స్టాల్స్‌ను చూపించి ఆట బొమ్మలను, అవసరమైన వస్తువులను కొనిపించారు. ఎమ్యూజ్మెంట్ పార్క్ లో వివిధ ఆట పరికరాలతో సరదాగా ఆడుకున్నారు. ఫుడ్ కోర్టులో వివిధ రకాల ఆహార పదార్థాలను భుజించారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన కలెక్టర్ చిల్డ్రన్స్ హోం పిల్లలతో మాట్లాడారు.

సరస్ ప్రాంగణం తనిఖీ చేసిన కలెక్టర్..

మంగళవారం రాత్రి కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా సరస్ మేళా ప్రాంగణంలో తనిఖీ చేశారు. స్టాల్స్ వద్ద, కంట్రోల్ రూమ్ లోను, ఫుడ్ కోర్ట్ వద్ద, ఎమ్యూజ్మెంట్ పార్కు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. బుధవారం నుంచి పండుగ సెలవుల కారణంగా ప్రజల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున అధికారుల అప్రమత్తంగా ఉంటూ అవసరమైన అన్ని చర్యలు పకడ్బందీగా తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



చిల్డ్రన్ హోమ్ పిల్లలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

గుంటూరు(తూర్పు), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సరస్ మేళా ప్రాంగణంలోని కళా వేదికపై మంగళవారం సాయంత్రం ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో నాదస్వరం శ్రావణానందంగా సాగింది. కర్నూలు జిల్లా డప్పు కళాకారుల విన్యాసాలు, విశాఖపట్నం రేడియో జాకీ సత్యా, అనూష భక్తి, సినీ, జానపద గీతాలను ఆలపించి ప్రేక్షకులను ఆలరించారు. అస్సాం కళాకారుల బిహు జానపద నృత్యాలు వారి సాంస్కృతిక వైభవాన్ని గొప్పగా ప్రదర్శించారు. సరస్ మేళాలోని కళావేదికపై బుధవారం సాయంత్రం ఒడిస్సా కళాకారుల ధింసా జానపద నృత్యాలు, శ్రీకాకుళం జిల్లా కళాకారులు తప్పెట గుళ్ళు, కూచిపూడి, జానపద నృత్యాలు, స్కిట్లు ప్రదర్శిస్తారు.

అభివృద్ధి పనులు వేగవంతం కావాలి : కలెక్టర్

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అమరావతి రాజ ధాని ప్రాంత అభివృద్ధి పనులు వేగవంతం కావాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికా రులను ఆదేశించారు. సంబం ధిత శాఖల అధికారులతో కలె క్టర్ కార్యాలయంలో మంగళ వారం రాజధాని ప్రాంత అభివృ ద్ధి పనులపై ఆమె సమీక్షిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాజధాని ప్రాంత అభివృద్ధి పనులకు అవసరమయ్యే గ్రావెల్, కంకర, రహదారి మెటీరియల్ తదితర అంశాలలో ఎటువంటి జా ప్యం లేకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతుల మంజూరును నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పనులు జాప్యం జరగొద్దని చెప్పారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ఎస్‌కే ఖాజా వలి, కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ ఎండీ నజీనా బేగం, గనుల శాఖ ఉప సంచాలకుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వరుస చైన్‌స్నాచింగ్స్‌కు పాల్పడుతున్న యువకుడి అరెస్టు

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : వరుస చైన్‌స్నాచింగ్ నేరాలకు పాల్పడుతున్న చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామానికి చెందిన బొజ్జ గోపీ అనే నిందితుడిని కొత్తపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు మంగళవారం కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నిందితుడు గోపీని సీఐ వీరయ్య చౌదరి మీడియా ఎదుట హాజరుపరచి వివరాలు వెల్లడించారు. ఈ నెల 7న రాత్రి సుమారు 7 గంటల సమయంలో కొత్తపేట మెడికల్ కాంప్లెక్స్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి ఒక మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కొనిపారిపోయాడు. అలాగే 9న సాయంత్రం 8 గంటలకు కొత్తపేట శీలంవారి వీధి నందు ఒక వృద్ధురాలి మెడలోని చైను లాక్కొని పారిపోగా కొత్తపేట పోలీసు వారు కేసు నమోదు చేసారు. సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాల సహాయం తో నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి గోపి వద్ద నుండి 40 గ్రాముల బంగారు చైను, 2 గ్రాముల మంగళ సూత్రములు రికవరీ చేశారు.

ఆటో ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆటో ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి (55) చెందాడు. సోమవారం రాత్రి ఏటీ అగ్రహారం 13వ లైను వద్ద రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొంది. తలకు గాయమై జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీలో పెట్టారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8688831445, 8688831448 నంబర్లలో తెలియజేయాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు.

కోడి పందేలు జరగకుండా చర్యలు : ఎస్పీ

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ నేపథ్యంలో కోడి పందేలు, ఇతర మూగజీవాలతో క్రీడలు నిర్వహించి జీవహింసకు పాల్పడకుండా నిరోధించేందుకు ఏపీ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను కఠినంగా అమలు చేయాలని ఎస్పీ వకుల్ జిందాల్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో గతంలో కోడి పందేలు నిర్వహించిన, ఆయా కార్యకలాపాల్లో పాల్గొన్న వ్యక్తులను పోలీస్ స్టేషన్లకు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. సంబంధిత వ్యక్తులను బైండోవర్ చేశారు. అవసరమైన ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా ముమ్మర గస్తీ చేపడుతున్నామని పోలీస్ అధికారులు తెలిపారు. ప్రతి గ్రామంలో కొంతమంది గూఢచారులను నియమించి, వారి ద్వారా సమాచారాన్ని సేకరిస్తూ తక్షణమే చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కోడి పందేలు, పేకాట, జూదం వంటి చట్ట విరుద్ధ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా 100,112కు డయల్ చేసి తెలియజేయాలని పోలీసు అధికారులు విన్నవించారు.

అనధికార సంస్థల్లో పెట్టుబడి పెట్టొద్దు

- సీఐడీ డీఎస్పీలు శామ్యూల్, లక్ష్మయ్య

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అనధికార సంస్థలకు డిపాజిట్‌లు కట్టి మోసపోవద్దని సీఐడీ డీఎస్పీలు శామ్యూల్, గోలి లక్ష్మయ్య సూచించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంస్థల డిపాజిటర్ల పరిరక్షణ చట్టం 1999పై మంగళవారం నగరంలోని సీఐడీ రీజనల్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గుంటూరు సీఐడీ రీజినల్ ఆఫీసు ఇన్‌చార్జి అధికారి డీఎస్పీ బి.సునీల్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనధికారిక సంస్థలు చూపే అధిక వడ్డీకి మోసపోవద్దని, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల యాజమాన్యంలో ఉన్న సంస్థల్లో నగదుడిపాజిట్ చేస్తే డబ్బులు భద్రంగా ఉంటాయన్నారు. గుంటూరు సీఐడీ స్పెషల్ కోర్టు సీనియర్ ఏపీపీ ఎస్ఎస్ సుకుమార్ డిపాజిటర్ల పరిరక్షణ చట్టాలు, శిక్షలు, బాధితులు తీసుకోవాల్సిన న్యాయపరమైన చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐడీలు సంజీవ్‌కుమార్, గుంజి తిరుమల రావు, ఎస్సై అహ్మద్‌బాషా, పలువురు మహిళలు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ సునీల్

ఆటోలో నగల బ్యాగ్ మరచిన ప్రయాణికురాలు

- గుర్తించి బాధితురాలికి అప్పగించిన కొత్తపేట పోలీసులు

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆటోలో రూ. 5 లక్షల ఖరీదైన నగలు ఉన్న బ్యాగ్‌ను ఓ ప్రయాణికురాలు మరచిపోయారు. ఆమె ఫిర్యాదు మేరకు తీవ్రంగా శ్రమించి మూడు గంటల వ్యవధిలో కొత్తపేట పోలీసులు సంబంధిత ఆటోను గుర్తించి బ్యాగ్‌ను స్వాధీనం చేసుకొని బాధితురాలికి అప్పగించారు. ఈనెల 12న మధ్యాహ్నం ఒక మహిళ తన చిన్న పిల్లలతో కలిసి చిలకలూరిపేటకు వెళ్లేందుకు హనుమయ్య కంపెనీ వద్ద ఆటో ఎక్కి గాంధీ పార్క్ వద్ద దిగారు. ఈ క్రమంలో తన వద్ద ఉన్న సుమారు రూ.5 లక్షల విలువైన బంగారు నగలతో కూడిన బ్యాగ్‌ని ఆటోలోనే మర్చిపోయారు. కొద్ది సేపటి తర్వాత గుర్తించిన ఆమె, ఆటో కోసం చుట్టుపక్కల వెతికినా కనపడకపోవడంతో వెంటనే కొత్తపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ ఆదేశాల మేరకు క్రైమ్ కానిస్టేబుళ్లు జానీ బాషా, శ్రీనివాసరావు, డేగల కోటేశ్వరరావు, అనిల్ కుమార్ గాంధీ పార్క్ పరిసర ప్రాంతాల్లోని సీసీ టీవీ కెమెరాలను పరిశీలించి మహిళ ప్రయాణించిన ఆటోను గుర్తించారు. ఆటో డ్రైవర్ నుంచి బంగారు నగల బ్యాగ్‌ని స్వాధీనం చేసుకుని కొత్తపేట సీఐ వీరయ్యచౌదరి చేతుల మీదుగా మహిళకు అందజేశారు.

గంజాయి నిర్మూలనకు కార్డెన్ సెర్చ్

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మకం సరఫరాకు సంబంధించిన సమాచారం మేరకు మంగళవారం పలు పోలీసుస్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో పోలీసులు కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్‌నేతృత్వంలో కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్ కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించి అనుమానితుల ఇళ్లను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 41 ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. అలాగే డీఎస్పీ జనార్ధన్ ఆధ్వర్యంలో చేబ్రోలు పరిధిలోని ఓ స్పిన్నింగ్ మిల్లులో కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. కార్మికుల రూములో తనిఖీ చేశారు. అదేవిధంగా తుళ్లూరు పోలీస్ సబ్ డివిజన్‌లో తాడికొండ సీఐ వాసు ఆధ్వర్యంలో తాతిరెడ్డిపాలెం గ్రామంలో కార్డెన్‌సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి సరైన ధ్రువపత్రాలు లేని 37 ద్విచక్ర వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. గంజాయి అమ్మకం, సరఫరాకు సంబంధించిన సమాచారం మేరకు ఈ ఆపరేషన్లు చేపట్టామని, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ అధికారులు హెచ్చరించారు.



పీకలవాగు కట్టపై నివాసించే ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

ప్రజల భద్రత, సౌకర్యాలే ముఖ్యం

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి
- పీకలవాగు కట్టపై పర్యటన

గుంటూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : ప్రజల భద్రత, సౌకర్యాలే ముఖ్యమని, అందుకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి సూచించారు. గుంటూరు నగరంలోని పీకలవాగు కట్టపై నివసిస్తున్న ప్రజలు, నడవడానికి దారి కావాలంటూ చేస్తున్న ఆందోళన గురించి తెలుసుకుని మంగళవారం ఆమె ఆ ప్రాంతంలో పర్యటించారు. పీకల వాగు కట్టపై నివసించే తమకు నిత్యావసరాలకు, పాఠశాలలు, ఆసుపత్రులకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు ఎమ్మెల్యే గళ్లా మాధవి దృష్టికి తీసుకువచ్చారు. ఆమె సంబంధిత మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు, స్థానిక నాయకులతో సమన్వయం చేసుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ సమస్యకు త్వరితగతిన పరిష్కారం చూపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగు సినీ చరిత్రలో చెరగని సంతకం చిరంజీవి

తెలుగు సినిమా చరిత్రలో తనకంటూ చెరగని ముద్ర వేసుకున్న మెగాస్టార్ చిరంజీవి మూడు తరాల ప్రేక్షకులను తన నృత్యం, ఫైట్లు, అభినయంతో మంత్రముగ్ధులను చేసిన గొప్ప నటుడని ఎమ్మెల్యే గళ్లా మాధవి కొనియాడారు. జనసేన గుంటూరు జిల్లా అధికార ప్రతినిధి ఆళ్ళ హరి ఆధ్వర్యంలో నిర్వహించిన 'మన శంకర వరప్రసాద్‌గారు' సినిమా విజయోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించి, శుభాకాంక్షలు తెలిపారు.

గుంటూరు పశ్చిమలో మహిళా గ్రీవెన్స్

పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆధ్వర్యంలో 'మహిళా గ్రీవెన్స్' కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు తమ వ్యక్తిగత, కుటుంబ, ఆర్థిక, సామాజిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ మహిళలు నేరుగా వచ్చి తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. వచ్చిన ప్రతి సమస్యపై సానుకూల దృక్పథంతో స్పందిస్తూ, సాధ్యమైన పరిష్కారాలు, అవసరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా, వాటిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామన్నారు.

మాజీ మేయర్ ఏసురత్నం కన్నుమూత



చుక్కా ఏసురత్నం (ఫైల్)

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ మాజీ మేయర్ డాక్టర్ చుక్కా ఏసురత్నం అనారోగ్యంతో మంగళవారం కన్నుమూశారు. పొట్టి శ్రీరాములునగర్‌లోని ఆయన నివాసంలో తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులున్నారు. చుక్కా ఏసురత్నం జువాలజీ అధ్యాపకుడిగా ఎంతో మందిని తీర్చిదిద్దారు. ఎంసెట్ కోచింగ్‌లో విద్యార్థులకు ఎంతగానో సహకరించేవారు. ఏసురత్నం వద్ద చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదిగారు. ప్రస్తుత సీనియర్ ఐఏఎస్ అధికారి కాంతిలాల్ దండే కూడా చుక్కా ఏసురత్నం శిష్యుడే. ఏసురత్నం అనూహ్యంగా 2000 సంవత్సరంలో రాజకీయాల్లోకి ప్రవేశించారు. అప్పట్లో గుంటూరు నగరపాలక సంస్థకు ప్రత్యక్ష విధానంలో ఎన్నికలు జరిగేవి. గుంటూరు మేయర్ అప్పట్లో బీసీకి రిజర్వు కావడంతో మంచి విద్యావంతుడిని పోటీలో నిలబెట్టాలని ఉమ్మడి రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచన చేసి ఏసురత్నంను మేయర్ అభ్యర్థిగా ఖరారు చేశారు. ఆ ఎన్నికల్లో చుక్కా ఏసురత్నం టీడీపీ తరుపున పోటీ చేసి మంచి మెజార్టీతో గెలుపొందారు. ఆయన ఎంతో హుందాతనంతో కౌన్సిల్ సమావేశాలను నిర్వహించేవారు. మేయర్ గ్రాంటుని అన్ని డివిజన్లకు సమానంగా కేటాయించి నగరాభివృద్ధికి బాటలు వేశారు. బృందావన్‌గార్డెన్స్‌లో అపార్టుమెంట్ స్టిల్టుఫ్లోర్‌ను నగరపాలకసంస్థ అధికారులు కూల్చివేతకు దిగినప్పుడు ఆయన ప్రజల పక్షాన నిలిచి అడ్డుపడటంతో అప్పటి నగర కమిషనర్ ప్రవీణ్ ప్రకాష్ అరెస్టు చేయించారు. అయితే ఏసురత్నంకు అందరూ అండగా నిలిచారు. దాదాపుగా 80 ఏళ్ల వయస్సులో ఆయన కన్నుమూశారు. ఈ విషయం అటు టీడీపీ, ఇటు కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్లను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పలువురు నివాళులర్పించారు.

నేడు మకరజ్యోతి దర్శన మహోత్సవం

- సంపత్‌నగర్ అయ్యప్పస్వామి దేవస్థానంలో ఏర్పాట్లు



అయ్యప్పస్వామి ఆలయం (అంతరచిత్రంలో) గ్రంధి కాంతారావు

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంపత్‌నగర్‌లో క్రేన్ రిలీజియస్ ట్రస్ట్ వారి శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో బుధవారం మకరజ్యోతి ప్రజ్వలన నిర్వహించనున్నారు. మకర సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మకరజ్యోతి దర్శనాన్ని ఈ సంవత్సరం కూడా ఎంతో వైభవంగా క్రేన్ అనుబంధ సంస్థ క్రేన్ రిలీజియస్ ట్రస్ట్, క్రేన్ సంస్థల చైర్మన్ గ్రంధి వెంకటసత్యలక్ష్మీ కాంతారావు, లక్ష్మీ హైమావతి దంపతులు తెలిపారు. గత 50 సంవత్సరాలుగా అయ్యప్ప దీక్ష తీసుకున్న వారికి 41 రోజులపాటు అన్నప్రసాదం (సద్ది) కార్యక్రమాన్ని క్రేన్ సంస్థల చైర్మన్ గ్రంధి కాంతారావు దంపతులు నిర్వహిస్తున్నారు. స్వామి వారి తిరువాభరణాలను సంపత్‌నగర్‌లోని క్రేన్ వక్కపొడి ఫ్యాక్టరి నుంచి కాంతారావు దంపతులు, వారి పెద్ద అల్లుడు మానేపల్లి దివాకర్, పెద్ద కుమార్తె హిమజ, కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, భక్తులతో కలిసి దేవాలయానికి ఆభరణాలను చేరుస్తారు. ఆభరణాలను స్వామి వారికి అలకరించి, గ్రంధి కాంతారావు దంపతులు మకరజ్యోతి ప్రజ్వలన చేస్తారు. కళాకారులతో భక్తిగీతాల సంగీత విభావరి ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి అయ్యప్పస్వామి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కాంతారావు కోరారు.


నేడు అరండల్‌పేట శివాలయంలో....

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్‌పేటలోని శివాలయంలో బుధవారం సాయంత్రం మకర జ్యోతిని వెలిగిస్తామని శ్రీ ధర్మ శాస్త అయ్యప్ప స్వామి కమిటీ అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శబరిమలలో మకర జ్యోతి దర్శనం పూర్తికాగానే అరండల్‌పేట శివాలయంలో మకరజ్యోతి దర్శనం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు అశేష సంఖ్యలో హాజరై మకర జ్యోతిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం : ధారూ నాయక్

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన బిడ్డల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.ధారూ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదాయం, రాజకీయ ప్రయోజనాలు వంటివి ఆశించకుండా గిరిజన బిడ్డలకు మేలు చేయాలని లక్ష్యంతో పని చేస్తున్నారన్నారు. వైసీపీ నేత జగన్ తన హయాంలో గిరిజనుల విదేశీ విద్యా పథకాన్ని రద్దు చేస్తే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విదేశాలలో ఉన్నత విద్య చదివే గిరిజన యువత కోసం విదేశీ విద్యా పథకాన్ని తిరిగి కొనసాగిస్తూ రూ. పది లక్షల నుంచి 15 లక్షలకు పరిమితిని పెంచిందన్నారు. మారుమూల ప్రాంతాల్లో సరైన రోడ్లు, సదుపాయాలు లేక ఇబ్బంది పడుతున్న గిరిజనులకు ఆసరాగా 1,962 మారుమూల గిరిజన ప్రాంతాలకు రూ.1200 కోట్లతో రోడ్లు వేస్తున్నారన్నారు. అలాగే పర్యాటక అభివృద్ధి కాఫీ తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. గిరిజన ఏజెన్సీలలో డోలీ మోతకు స్వస్తి పలికి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించారన్నారు.

భృంగి వాహనంపై మల్లికార్జునుడు



» శ్రీశైలంలో వైభవంగా సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీశైల క్షేత్రంలో రెండో రోజు మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి భృంగి వాహనంపై విహరించారు. మంగళవారం ఉదయం స్వామి వారి యాగశాలలో చండీశ్వరునికి విశేష పూజలు, లోక కల్యాణార్థం జపాలు, పారాయణాలు, పంచావరణార్చనలు, మండపారాధనలు, రుద్రహోమం, అమ్మవారికి చండీహోమం, ప్రదోషకాల పూజలు, జపానుష్టానాలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం అక్కమహాదేవి అలంకార మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన పుష్పవేదికపై స్వామి, అమ్మవార్లను భృంగి వాహనంపై ఆశీనులుజేసి షోడశోపచార పూజలు జరిపించారు. అనంతరం అధికారులు, సిబ్బంది, అర్చకులు గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

పాత పెన్షన్ సాధించేందుకు ఉద్యమ కార్యాచరణ

» ప్రభుత్వానికి ఇచ్చిన గడువు ముగిసింది: ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం

విజయవాడ(గాంధీనగర్), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ఇచ్చిన గడువు ముగిసిందని, పాత పెన్షన్ సాధించేంత వరకు ఉద్యమ కార్యాచరణ ఉంటుందని ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం ప్రకటించింది. సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాజీ పఠాన్, కరిమి రాజేశ్వరరావు ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తక్షణమే సీపీఎస్ రద్దు చేయాలని, గత ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తి వేయాలని, డీఏ బకాయిలు చెల్లించాలని రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేశామన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా తమను మోసం చేస్తుందా? అని ప్రతీ సీపీఎస్ ఉద్యోగి ఆవేదన చెందుతున్నారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించే వరకు 'వర్క్ టు రూల్'

» ఏపీ రెవెన్యూ అధికారుల సంఘం

సమస్యలు పరిష్కరించే వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే వీఆర్వోలు పనులు చేస్తారని ఏపీ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.హెచ్.రవీంద్రరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెలవు, పండుగ రోజుల్లో విధులు నిర్వర్తించలేమని, రెవెన్యూ విధులు మాత్రమే నిర్వర్తిస్తామని, తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాలకు వెళ్లేది లేదని, గ్రామ సచివాలయంలో మాత్రమే విధులు నిర్వర్తిస్తామని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు వర్క్ టూ రూల్ పాటించాలని నిర్ణయించామన్నారు.

షాపులు, బార్లలో ఒకేలా మద్యం ధరలు

» బార్ పాలసీలో కీలక మార్పు.. ఏఆర్ఈటీ రద్దు: ఎంకే మీనా

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): బార్ పాలసీలో కీలక మార్పు తీసుకొచ్చినట్లు ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్‌కుమార్ మీనా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బార్లపై విధిస్తున్న అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. ఇది బార్ల లైసెన్సీలకు పెద్ద ఊరటగా పేర్కొన్నారు. ఇకపై బార్లకు, మద్యం షాపులకు సరఫరా చేసే మద్యం ధరలు ఒకేలా ఉంటాయని తెలిపారు. కాగా, దీనిపై ఎక్సైజ్ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఉత్తర్వులు జారీచేసిన రోజు నుంచే నిర్ణయం అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది.

మద్యం సీసాలపై 'లిన్'

మద్యం సీసాలపై కొత్తగా లిక్కర్ ఐడెంటిఫికేషన్ నంబర్(లిన్)ను తీసుకొచ్చేందుకు రూల్స్‌కు సవరణ చేస్తూ ఎక్సైజ్ శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. లిక్కర్, బీరు, వైన్ రూల్స్‌కు సవరణలు చేసింది. ఇకనుంచి ప్రతిసీసాపై ఏపీ, బ్రాండ్, బ్యాచ్, లైన్, తేదీ, మిల్లీ సెకన్లతో సహా సమయాన్ని కోడ్ రూపంలో ముద్రిస్తారు. దీనివల్ల నకిలీ మద్యం సీసాలను వెంటనే గుర్తుపట్టొచ్చని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి.

ప్రవేశ పరీక్షలకు కన్వీనర్ల నియామకం

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరంలో కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్షల(సెట్లు)కు ఉన్నత విద్యా మండలి మంగళవారం కన్వీనర్లను నియమించింది. ఈసెట్‌కు జేఎన్‌టీయూ-అనంతపురం మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ బి.దుర్గా ప్రసాద్, ఐసెట్‌కు ఆంధ్రా యూనివర్సిటీ సీఎస్ఈ ప్రొఫెసర్ ఎం.శశి, పీజీఈసెట్‌కు ఆంధ్రా యూనివర్సిటీ ఈఈఈ ప్రొఫెసర్ పి.మల్లికార్జునరావు, లాసెట్‌కు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లా ప్రొఫెసర్ టి.సీతా కుమారి, ఎడ్‌సెట్‌కు ద్రవిడియన్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాస్ కుమార్, పీజీసెట్‌కు ఎస్వీ యూనివర్సిటీ కెమిస్ట్రీ ప్రొఫెసర్ వి.పద్మావతి, ఈఏపీసెట్‌కు జేఎన్‌టీయూ- కాకినాడ మెకానికల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ ఎన్.మోహన్‌రావు, పీఈసెట్‌కు నాగార్జున యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పీపీఎస్ పాల్ కుమార్‌లను నియమించింది. బీపీఈడీ, యూజీ డీపీఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పీఈసెట్ ప్రవేశ పరీక్ష మే లేదా జూన్ నెలల్లో ఉండొచ్చని తెలిపింది. మిగిలిన ప్రవేశ పరీక్షల తేదీలను గతంలోనే ప్రకటించింది.

ఫిబ్రవరి 17 నుంచి టెన్త్ ప్రీఫైనల్ పరీక్షలు

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 17 నుంచి 24 వరకు ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. అనంతరం గ్రాండ్ టెస్ట్, పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు

దక్షిణ భారత సైన్స్ ఫేర్‌కు 35 ఏపీ ప్రాజెక్టులు

దక్షిణ భారత సైన్స్ ఫేర్‌కు రాష్ట్రం నుంచి 35 ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఈనెల 19 నుంచి 23 వరకు హైదరాబాద్‌లో ఈ ఫేర్ జరగనుంది. వ్యక్తిగత, బృందం, ఉపాధ్యాయులు మూడు కేటగిరీల్లో ఈ ఎంపిక జరిగింది. ప్రాజెక్టులు రూపొందించిన టీచర్లను ఈనెల 18కు ముందు రిలీవ్ చేయాలని ఆదేశిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

కూటమికి మహిళా సాధికారతపై చిత్తశుద్ధి ఏదీ?

» రెండేళ్లయినా అతీగతీ లేని 'మహాశక్తి': షర్మిల

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లవుతున్నా మహాశక్తి పథకానికి అతీగతిలేదని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఈమేరకు ఆమె ఓ ప్రకటన చేశారు. 'పండుగల పేరుతో కాలయాపన తప్ప మహిళా సాధికారతపై సీఎం చంద్రబాబుకు కమిట్మెంట్ లేదు. పథకం అమలుపై ఒక్కొక్కరూ ఒక్కో మాట చెపుతూ ఆడబిడ్డల మనోభావాలతో ఆడుకుంటున్నారు. ఆడబిడ్డ నిధి పేరుతో కోటిన్నర మంది రాష్ట్ర మహిళలకు సీఎం చంద్రబాబు చేసింది ఘరానా మోసమే. నెలకిచ్చే రూ.15,000కు గాను రూ.50,000 ఆదాయం వచ్చే మార్గం చూపుతామన్నారు. మహిళాభివృద్ధికి పెద్దపీట వేస్తామంటూ పచ్చి బూటకపు మాటలు చెప్పారు. సూపర్ సిక్స్ హామీల్లో ఆడబిడ్డ నిధి ప్రధాన హామీ. 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళ వరకూ ఆర్థిక భరోసా నిచ్చే హామీ. ప్రతి ఏడాది రూ.18 వేలు లబ్ధి చేకూరే పథకాన్ని రెండేళ్లుగా అమలు చేయకుండా సూపర్ సిక్స్, సూపర్‌హిట్ అని చెప్పుకోవడానికి కూటమికి సిగ్గుండాలి. ఇష్టమొచ్చినప్పుడు అమలు చేసేవి ఎన్నికల హామీలు కావు. మహాశక్తి పథకాన్ని తక్షణమే అమలు చేయాలి' అని షర్మిల డిమాండ్ చేశారు.

ఆరోగ్యశాఖకు 567.40 కోట్లు

» నిధులు విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం
» రూ.2,600 కోట్ల గ్రాంటు కేటాయించిన కేంద్రం
» మొత్తం నిధులు రాబట్టిన మూడో రాష్ట్రంగా ఏపీ
» మరిన్ని రాబడతాం: ఆరోగ్య మంత్రి సత్యకుమార్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ఆరోగ్యశాఖ మరో ఘనత సాధించింది. 15వ ఆర్థిక సంఘం ఈ శాఖకు కేటాయించిన నిధుల్లో పూర్తి వాటాను రాబట్టిన మూడో రాష్ట్రంగా ఏపీ రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకూ తమిళనాడు, త్రిపుర మాత్రమే కేంద్రం నుంచి ఈ నిధులు మొత్తం పొందాయి. ఆరోగ్య రంగానికి ఆర్థిక సంఘం సిఫారసు చేసిన రూ.2,600 కోట్ల గ్రాంట్ మొత్తం విడుదల అయింది. సోమవారం చివరి విడతగా రూ.567.40 కోట్లను కేంద్రం రాష్ట్రానికి జమ చేసింది. రాష్ట్రాల జనాభా, అభివృద్ధి సూచికల ఆధారంగా ఆర్థిక సంఘం నిధులను కేటాయిస్తారు. ఈ మొత్తం నిధుల్లో ఏపీ వాటా 3.39 శాతం వరకూ ఉందని అంచనా వేస్తున్నారు. సోమవారం జరిగిన కార్యదర్శుల సమావేశంలో ఈ నిధులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీ ముగిసిన రెండు గంటల్లోనే ఆరోగ్య శాఖకు కేంద్రం నిధులు విడుదల చేసింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వైద్యసేవల బలోపేతానికి 15వ ఆర్థిక సంఘం కింద కేంద్రం నిధులు మంజూరు చేస్తోంది. వీటిని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు భవనాల నిర్మాణం, వ్యాధి నిర్ధారణ పరీక్షల మౌలిక సదుపాయాల కల్పన, బ్లాక్ లెవల్ పబ్లిక్ హెల్త్ యూనిట్ల కోసం ఖర్చు చేయాలి.

కూటమిలోనే ఖర్చెక్కువ

గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో ఆర్థిక సంఘం కేటాయించిన నిధుల్లో 57శాతం మాత్రమే సాధించగలిగింది. కూటమి ప్రభుత్వం కేవలం 19 నెలల్లోనే 43 శాతం నిధులు రాబట్టగలిగింది. మొత్తంగా విడుదలైన నిధుల్లో రూ.1,108 కోట్లు కూటమి ప్రభుత్వంలోనే వచ్చాయి. ఇప్పటి వరకూ అందిన నిధుల్లో ఆరోగ్యశాఖ రూ.1,896 కోట్ల వరకూ వ్యయం చేసింది. నిర్మాణాలను వేగవంతం చేయడం, సమయానికి యూసీలు పంపడంతో నిధుల విడుదలకు కేంద్రం కూడా ముందుకొచ్చింది. కూటమి హయాంలో రూ.902 కోట్ల వ్యయంతో నిర్మాణాలు చేపట్టారు. ఆర్థిక సంఘం నిధులతో 1,467 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, 100 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 6 సామాజిక ఆరోగ్య కేంద్రాలు, బీహెచ్‌పీఎల్ నిర్మాణాలు చేపట్టింది.తాజాగా విడుదలైన నిధుల్లో రూ.233.45 కోట్లను ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల నిర్మాణానికి కేటాయించారు. రూ.218.11 కోట్లను వ్యాధి నిర్ధారణకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించనున్నారు. మరో రూ.55.89 కోట్లను గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుకు కేటాయిస్తారు. పట్టణ ప్రాంతాల్లో యూపీహెచ్‌సీల నిర్వహణకు రూ.52.71 కోట్లు ఖర్చుచేసే విధంగా ఆరోగ్యశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. కాగా, నిధుల విడుదలపై ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక సంఘం నిధులతో పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలు పూర్తి అవుతాయని, కేంద్రం నుంచి మరిన్ని నిధులు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

రైతుల ఖాతాల్లో 10 వేల కోట్లు



» అన్నదాతకు నిజమైన సంక్రాంతి
» జగన్ వారిని రోడ్డున పడేస్తే.. మేము వారిలో ఆనందం నింపాం
» వైసీపీ హయాంలో కొన్నది 10 శాతమే
» మేం 41.27 లక్షల టన్నుల ధాన్యం కొన్నాం
» రికార్డు సృష్టించటం కూటమికే సాధ్యం
» 24 కాదు... 4 గంటల్లోనే నగదు జమ
» అమరావతిపై విష ప్రచారం మానాలి: మంత్రి మనోహర్

తెనాలి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): "రైతులను జగన్ అప్పులపాలు చేసి రోడ్డున పడేస్తే.. మేం రైతన్న ఇంట సంక్రాంతి శోభను తెచ్చాం. వైసీపీ హయాంలో రైతుల కష్టాన్ని దళారులు, ఆ పార్టీ నాయకులు దోచుకుంటే మేం ఆ వ్యవస్థకు స్వస్తి చెప్పి, గిట్టుబాటు ధరను నేరుగా రైతుల ఖాతాల్లోనే జమ చేస్తున్నాం." అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఇప్పటి వరకు రూ.10 వేల కోట్ల మేరకు రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు. అవగాన లేని వ్యక్తి సీఎం అయితే రాష్ట్రం ఏమవుతుందనేది జగన్ చేతకాని పాలన స్పష్టం చేసిందని విమర్శించారు. అనుభవం, దక్షత ఉన్న చంద్రబాబు వంటి వ్యక్తి సీఎం అయితే ప్రతి ఇంట సిరులపంట పండుతుందనేది నిరూపించారని అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 6,76,848 మంది రైతుల నుంచి 41.27 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, దీని విలువ రూ. 9,789 కోట్లు ఉంటుందని చెప్పారు. మంగళవారం సాయంత్రానికి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి చెల్లింపులు కేవలం 4 గంటల్లోనే పూర్తి చేశామన్నారు. ఈ రోజే రూ.10 వేల కోట్ల రికార్డు స్థాయి చెల్లింపుల లక్ష్యాన్ని అధిగమించామని తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఈ స్థాయిలో కొనుగోళ్లు జరగలేదన్నారు. కేవలం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతోనే ఈ ప్రగతి సాధించామని చెప్పారు. జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్న చివరి సంవత్సరంలో గుంటూరు జిల్లాలో 552 మంది రైతుల నుంచి 5,913 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తే, తాము 11,773 మంది రైతుల నుంచి 76,015 టన్నుల ధాన్యం కొన్నామని వివరించారు. పైగా కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బు కూడా నెలల తరబడి రైతులు ఖాతాల్లోకి వేయలేదన్నారు. ప్రస్తుతం తాము చెప్పినట్టు 24 గంటలు కాకుండా, కేవలం 4 గంటల వ్యవధిలోనే 78 శాతం మంది రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బు జమ చేశామన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో 98 శాతం మేర రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తే, కాకినాడ జిల్లాలో 97 శాతం మేరకు ధాన్యం కొన్నామన్నారు.

అసత్య ఆరోపణలు ఆపు!

నాలుగు గోడల మధ్య కూర్చుని అసత్య ఆరోపణలు చేసే ముందు జగన్ సహా ఆయన అనుచర మూర్ఖులు క్షేత్రస్థాయికి వెళ్లి కూటమి ప్రభుతం చేస్తున్న అభివృద్ధిని, జనం అభిప్రాయాలను తెలుసుకోవాలని మనోహర్ హితవు పలికారు. పరిపాలన చేతకాక, వనరులను వినియోగించుకోవటం తెలియక జగన్ పాలనలో వ్యవస్థలను నాశనం చేశారని విమర్శించారు. అమరావతిపై ఇప్పటికీ విషం చిమ్ముతున్నారని అన్నారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలను మానుకోవాలని చెప్పారు. జగన్ పాలనలో రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కు వెళ్లినా ఆయనకు మాత్రం తన రాజకీయం, పదవులే ముఖ్యమన్నట్టు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు.

గూగుల్ డేటా సెంటర్‌కు భూసేకరణ వేగవంతం

» రైతులతో ఎమ్మెల్యే గంటా సమావేశం

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం జిల్లా ఆనందపురం మండలం తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్‌కు భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తన కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో రైతులు భూములు ఇవ్వడానికి సంసిద్ధత వ్యక్తంచేశారు. మార్చి నెలలో డేటా సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయాలని భావిస్తున్న తరుణంలో గంటా రైతులను పిలిచి మాట్లాడారు. రైతుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రేటు కంటే ఎక్కువ పరిహారం ఇవ్వడానికి అంగీకరించింది. దాంతో పాటు ఎకరానికి 20 సెంట్ల భూమి, ఔట్‌సోర్సింగ్‌లో ఒక ఉద్యోగం, షాపింగ్ కాంప్లెక్స్‌లో ఒక షాపు, మూడు సెంట్ల ఇంటి స్థలాన్ని ఇస్తామని హామీ ఇచ్చింది. తాజాగా నిర్వహించిన సమావేశంలో రైతులు పలువురు మాట్లాడుతూ గ్రామానికి ప్రధాన రహదారితో పాటు కల్యాణ మండపం మంజూరు చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ భూముల్లో చెట్లు పెంచుకున్న 520 మంది రైతులకు ఇంటి నిర్మాణం కోసం మూడు సెంట్లు ఇస్తామని చెప్పారని, దానిని ఐదు సెంట్లకు పెంచాలని కోరారు. ఆ గ్రామంలో వైసీపీ నాయకులు కూడా ముందే భూములు ఇవ్వడానికి ముందుకు రావడంతో..మిగిలినవారు కూడా ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ఇస్తామని స్పష్టంచేశారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో సమ్మతిని తెలియజేస్తూ లేఖలు ఇచ్చారు.

ట్రంప్‌ను ప్రపంచ బహిష్కరణ చేయాలి

» వెనుజువెలాపై అమెరికా దాడి దుర్మార్గం
» సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ

తిరుపతి(విద్య), జనవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని తీవ్ర ఇబ్బందుల్లో పడేసేలా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ప్రపంచ బహిష్కరణ చేయాలని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ నారాయణ డిమాండ్ చేశారు. ట్రంప్ దుందుడుకు చర్యలకు వ్యతిరేకంగా మంగళవారం తిరుపతి నగరం బైరాగిపట్టెడలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పార్టీ నేతలతో కలిసి ఆయన ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇతర దేశాలపై వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే ప్రపంచం ఎక్కడ ఇబ్బందుల్లో పడుతుందోనని ఆందోళనగా ఉందన్నారు. ఒక దేశ అధ్యక్షుడు, ఆయన భార్యను రాత్రికి రాత్రే కిడ్నాప్ చేసినట్లు వ్యవహరించడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ప్రపంచంలో అత్యధికంగా చమురు ఉత్పత్తి చేసే వెనుజువెలాపై అమెరికా ఇలాంటి దురాగతానికి పాల్పడటం వెనుక కార్పొరేట్ కంపెనీల స్వార్థం దాగి ఉందని ఆయన ఆరోపించారు. అమెరికాలో అధికారం కట్టబెట్టిన ప్రజలే ఇప్పుడు ట్రంప్‌పై తిరగపడే పరిస్థితి రావడం ఆయన పాలనా వైఫల్యం, నియంతృత్వధోరణికి నిదర్శనమన్నారు. మన ప్రధాని ఇలాంటి యుద్ధోన్మాద చర్యలను ఇప్పటికైనా ఖండించాలని నారాయణ డిమాండ్ చేశారు.



ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నేత నారాయణ

20న విద్యుత్తు చార్జీలపై బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు చార్జీల టారిఫ్‌పై ఏపీ విద్యుత్తు నియంత్రణ మండలి నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణ షెడ్యూల్‌ను సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. 2026-27వ ఆర్థిక సంవత్సరానికి గాను ఏపీఈఆర్సీ చైర్మన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరిగే ప్రజాభిప్రాయసేకరణ కార్యక్రమాన్ని తిరుపతి, విజయవాడ, కర్నూలులో నిర్వహించనున్నట్లు తెలిపారు. 20న తిరుపతిలో, 22, 23న విజయవాడలో, 27న కర్నూలులో ఉదయం 10.30 నుంచి ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని వివరించారు.

ఇంధన సామర్థ్య కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలి

» ప్రభుత్వ విభాగాలకు సీఎస్ సూచన

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఇంధన సామర్థ్య కార్యక్రమాలను, ఇంధన సంరక్షణ చర్యలను అన్ని ప్రభుత్వ సంస్థలు, విభాగాలు అత్యంత ప్రాధాన్యాంశంగా పరిగణించి అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ చైర్మన్ విజయానంద్ సూచించారు. మంగళవారం సచివాలయం నుంచి వర్చువల్‌గా నిర్వహించిన ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ మిషన్ 15వ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశానికి సీఎస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ... 'ఇంధన సామర్థ్య చర్యల వల్ల విద్యుత్తు డిమాండ్ తగ్గడంతోపాటు ప్రభుత్వ వ్యయాలూ తగ్గుతాయి ఇంధన సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. పాఠశాలలు, విద్యాసంస్థల్లో ఎనర్జీ క్లబ్‌ల విస్తరణకు ఏపీఎస్ఈసీఎం చర్యలు తీసుకోవాలి. పరిశ్రమల్లో ఇంధన మార్పిడి, హీట్ ఎలక్ట్రిఫికేషన్ కార్యక్రమాలను స్వాగతించాలి. ఇవి పరిశ్రమల్లో పోటీ సామర్థ్యాన్ని పెంచడంతోపాటు కార్బన్ ఉద్గారాల తగ్గింపునకు దోహదపడుతాయి' అని వివరించారు. కార్యక్రమంలో ఏపీ జెన్కో మేనేజింగ్ డైరెక్టర్, ఏపీఎస్ఈసీఎం సీఈవో నాగలక్ష్మి, ట్రాన్స్‌కో జేఎండీ సూర్యసాయి ప్రవీణ్ చంద్, తదితరులు పాల్గొన్నారు.

'భోగి'.. రైతు కుటుంబాల్లో ఆనందం నింపాలి: అచ్చెన్న

అమరావతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భోగి పండుగ వ్యవసాయ సంస్కృతికి ప్రతీకగా, రైతు జీవితంతో విడదీయరానిదిగా నిలుస్తుందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పాత కష్టాలు వీడి, కొత్త ఆశలు, ఆకాంక్షలతో సాగాలని భోగి పండుగ సందేశం ఇస్తుందన్నారు. రైతాంగానికి, రాష్ట్ర ప్రజలకు ఆయన భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ భోగి పండుగ మంచి ఫలితాలిచ్చి, రైతు కుటుంబాల్లో ఆనందం నింపాలని ఆకాంక్షించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందని అచ్చెన్నాయుడు తెలిపారు.

మూడు రోజుల్లో ఈశాన్య రుతుపవనాల నిష్క్రమణ

విశాఖపట్నం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఈశాన్య రుతుపవనాలు రానున్న మూడు రోజుల్లో తమిళనాడు, కోస్తాంధ్ర, రాయలసీమ, కేరళ, కర్ణాటక నుంచి నిష్క్రమించనున్నాయి. ప్రస్తుతం దక్షిణ భారతదేశంపైకి వీచే గాలుల దిశ మారడంతో రుతుపవనాలు వైదొలిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల మంగళవారం మంచు కొనసాగింది. శివారు ప్రాంతాలు, ఏజెన్సీలో చలి తీవ్రత పెరిగింది. రానున్న రెండు, మూడు రోజుల్లో చలి తీవ్రత పెరుగుతుందని, అనేక ప్రాంతాల్లో మంచు కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రయాణాలు సాగించేవారు ఉదయం, రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

భారత్‌తో సిరీస్ తర్వాత క్రికెట్‌కు హీలీ గుడ్‌బై



సిడ్నీ: ఆస్ట్రేలియా మహిళల క్రికెట్ స్టార్, కెప్టెన్ అలిస్సా హీలీ త్వరలోనే కెరీర్‌కు గుడ్‌బై చెప్పనుంది. కొద్దిరోజుల్లో సొంతగడ్డపై భారత్‌తో జరిగే సిరీసే తనకు ఆఖరిదని 35 ఏళ్ల హీలీ మంగళవారం ప్రకటించింది. ఆ సిరీస్‌లో భాగంగా ఫిబ్రవరి 15 నుంచి ఆతిథ్య ఆసీస్‌తో భారత్ 3 టీ20లు, 3 వన్డేలు, ఓ టెస్టు ఆడనుంది. వికెట్ కీపర్, బ్యాటర్ అయిన అలిస్సా. దశాబ్దకాలంగా ఆస్ట్రేలియా జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషించింది. జట్టు సభ్యురాలిగా ఆమె ఖాతాలో 6 టీ20, 2 వన్డే ప్రపంచకప్‌లు ఉండడం విశేషం. మూడేళ్ల క్రితం మెగ్ లానింగ్ స్థానంలో జట్టు పగ్గాలు స్వీకరించిన అలిస్సా తన సారథ్యంలో జట్టును టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్‌లో సెమీస్ చేర్చింది. 10 టెస్టులు, 123 వన్డేలు, 162 టీ20లకు ప్రాతినిథ్యం వహించిన అలిస్సా. ఆసీస్ దిగ్గజ పేసర్ మిచెల్ స్టార్క్‌కు సతీమణి.

సిరీస్ పట్టేస్తారా!

నేడు న్యూజిలాండ్‌తో భారత్ రెండో వన్డే

ప్రాక్టీస్‌లో జడేజా, కోహ్లీ



మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..

రాజ్‌కోట్: వరుసగా తొమ్మిది వన్డేలు గెలిచి దూకుడు మీదున్న న్యూజిలాండ్‌కు తొలి మ్యాచ్‌లోనే భారత్ ఝులకిచ్చింది. ఇక మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా బుధవారం కీలక రెండో మ్యాచ్ జరగనుంది. 1-0 ఆధిక్యంలో ఉన్న టీమిండియా ఎలాంటి అలక్ష్యానికి తావీయకుండా ఈ పోరులోనూ నెగ్గి సిరీస్‌ను ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. అయితే తొలి వన్డేలో భారత్ జోరుకు ఆఖర్లో కళ్లెం వేసిన కివీస్ బౌలర్లు చివరి వరకు మ్యాచ్‌ను తీసుకెళ్లిన విషయం తెలిసిందే. భారత బౌలర్లు కూడా ధారాళంగా పరుగులిచ్చుకోవడం ఆందోళనపరిచే విషయం. అందుకే రాజ్‌కోట్‌లో రెండు విభాగాల్లోనూ గిల్‌సేన పూర్తి ఆధిపత్యం చూపాలనుకుంటోంది. సిరీస్‌లో నిలవాలంటే మ్యాచ్ గెలవాలి కాబట్టి కివీస్ కూడా గట్టిగా పోరాడాలనుకుంటోంది.

నితీశ్‌కు చాన్స్!: సిరీస్‌ను భారత్ విజయంతో ఆరంభించినా.. సరిదిద్దుకోవాల్సిన లోపాలున్నాయి. తొలి మ్యాచ్‌లో ముఖ్యంగా కివీస్ బ్యాటర్లు మన బౌలర్లను సులువుగా ఎదుర్కోగలిగారు. మన స్పిన్నర్లు ప్రభావం చూపలేదు. అలాగే విరాట్ నిష్క్రమణ తర్వాత భారత్ టపటపా వికెట్లు కోల్పోయి మ్యాచ్‌ను కోల్పోయే ప్రమాదం తెచ్చుకుంది. టాపార్డర్‌లో రోహిత్, గిల్, కోహ్లీలతో పాటు శ్రేయాస్ ఫామ్ మరోసారి కీలకం కానుంది. రోహిత్ ఇక్కడ ఆడిన 3 వన్డేల్లో 2 అర్ధసెంచరీలు సాధించాడు. ఇక స్పిన్ ఆల్‌రౌండర్ సుందర్ దూరమవడంతో అతడి స్థానంలో పేస్ ఆల్‌రౌండర్ నితీశ్ ఆడే చాన్సుంది. అలాగే పేసర్ ప్రసిద్ధ్ స్థానంలో అర్ష్‌దీప్‌నకు చాన్స్ ఇస్తారా? అనేది చూడాలి.

గెలుపే ధ్యేయంగా..: తొలి మ్యాచ్‌లో ఓడినా కివీస్ అందరినీ ఆకట్టుకోగలిగింది. ఓపెనర్లు నికోల్స్, కాన్వే తొలి వికెట్‌కు శతక భాగస్వామ్యంతో భారత్‌ను ఇబ్బందిపెట్టారు. మిడిలార్డర్‌లో డారిల్ మిచెల్ తుఫాన్ ఇన్నింగ్స్‌కు జతగా చివర్లో క్లార్క్, హేయ్ కూడా భారీస్కోరుకు కారణమయ్యారు. అయితే మధ్య ఓవర్లలో మరిన్ని పరుగులు సాధించి ఉంటే కివీస్‌కు గెలుపు దక్కేది. అటు కివీస్ బౌలర్లు కూడా భారత్‌ను చివరి వరకు ఒత్తిడిలో ఉంచగలిగారు. అయితే కీలక సమయాల్లో క్యాచ్‌లు వదిలేయడం ఆ జట్టును ఇబ్బందిపెట్టింది. ఈ మ్యాచ్‌లో హిట్టర్ గ్లెన్ ఫిలిప్స్ కూడా రాణిస్తే భారత బౌలర్లకు కష్టాలు తప్పవు. పేసర్ జేమిసన్ పదునైన బంతులతో భారత బ్యాటర్లను వణికించాడు. అతడికి ఇతర పేసర్ల నుంచి సహకారం అందాల్సి ఉంది.



పిచ్‌ను పరిశీలిస్తున్న కివీస్ కెప్టెన్ బ్రేస్‌వెల్

పిచ్

రాజ్‌కోట్ పిచ్ బ్యాటర్లకు అనుకూలిస్తుంటుంది. ఇక్కడ మొదట బ్యాటింగ్ చేసిన జట్టు సగటు స్కోరు 322. ఈ మ్యాచ్‌లోనూ భారీ స్కోర్లను ఆశించవచ్చు. అలాగే ఇక్కడ జరిగిన నాలుగు వన్డేల్లోనూ ఛేదన జట్టుకు పరాజయాలే ఎదురయ్యాయి.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్, గిల్ (కెప్టెన్), విరాట్, శ్రేయాస్, రాహుల్, జడేజా, నితీశ్ కుమార్, హర్షిత్, కుల్దీప్, సిరాజ్, ప్రసిద్ధ్/అర్ష్‌దీప్.

కివీస్: కాన్వే, నికోల్స్, యంగ్, మిచెల్, హేయ్, ఫిలిప్స్, బ్రేస్‌వెల్ (కెప్టెన్), క్లార్క్, జేమిసన్, ఫౌక్స్, అశోక్.

హర్మన్ అదరహో..

- ఆఖరి ఓవర్‌లో ముంబై విజయం
- గుజరాత్‌కు తొలి ఓటమి

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ఢిల్లీ X యూపీ (రా. 7.30)



హర్మన్‌ప్రీత్ (71 నాటౌట్)

నవీ ముంబై: హ్యాట్రిక్ విజయంపై కన్నేసిన గుజరాత్ టైటాన్స్‌కు ముంబై ఇండియన్స్ ఝలక్ ఇచ్చింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో మంగళవారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ముంబై 7 వికెట్లతో గుజరాత్‌ను ఓడించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (43 బంతుల్లో 7 ఫోర్లు, 2 సిక్సర్లతో 71 నాటౌట్) తుదికంటా నిలిచి ముంబైని గెలిపించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 192 పరుగులు చేసింది. జార్జియా వేర్‌హమ్ (33 బంతుల్లో 4 ఫోర్లు, ఓ సిక్సర్‌తో 43 నాటౌట్), భారతి (15 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 36 నాటౌట్), కనికా అహూజా (18 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 35), బెత్ మూనీ (33) రాణించారు. ఛేదనలో ముంబై 19.2 ఓవర్లలో 193/3 స్కోరు చేసి గెలిచింది. అమన్‌జోత్ కౌర్ (26 బంతుల్లో 7 ఫోర్లతో 40), నికోల కేరీ (23 బంతుల్లో 6 ఫోర్లతో 38 నాటౌట్) అదరగొట్టారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా హర్మన్‌ప్రీత్ నిలిచింది.

కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో..: భారీ ఛేదనలో ముంబై ఇన్నింగ్స్ ఆరంభం ఆశించిన రీతిలో సాగలేదు. అయితే హర్మన్, కేరీ చివర్లో బ్యాట్లు ఝుళిపించి జట్టుకు అద్భుత విజయాన్నందించారు. ఓపెనర్లు హేలీ మాథ్యూస్ (22), కమలిని (13) పవర్‌ప్లేలోనే వెనుదిరిగారు. అయితే అమన్‌జోత్, హర్మన్ ఎదురుదాడికి దిగి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. మూడో వికెట్‌కు 72 రన్స్ జోడించాక 13వ ఓవర్‌లో అమన్‌జోత్ అవుటైంది. చివరి 30 బంతుల్లో 59 రన్స్ కావాల్సిన వేళ ముంబై గెలుపు కష్టమే అనిపించినా.. 16వ ఓవర్‌లో నికోల 4 ఫోర్లతో 20 రన్స్ రాబట్టింది. ఆ తర్వాత లయ తప్పిన గుజరాత్ బౌలర్లు ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. చివరి ఓవర్‌లో 5 రన్స్ అవసరమవగా, హర్మన్ ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించింది.

సమష్టిగా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు కలిసికట్టుగా రాణించారు. క్రీజులో ఉన్నంతసేపు ఎదురుదాడికి దిగారు. ఓపెనర్ సోఫీ డివైన్ (8) మాత్రం ఈసారి మూడో ఓవర్‌లోనే వెనుదిరిగింది. అయితే వన్‌డౌన్‌లో వచ్చిన కనిక కళ్లుచెదిరే షాట్లతో రెండో వికెట్‌కు మూనీతో కలిసి 42 రన్స్ జోడించింది. పవర్‌ప్లేలో 62/1 స్కోరు చేసిన గుజరాత్ మధ్య ఓవర్లలో కాస్త నెమ్మదించింది. అయితే ఆయుషి సోని (11) రిటైర్డ్ అవుట్‌తో బరిలోకి దిగిన భారతి చివర్లో బ్యాట్ ఝుళిపించింది. ఆఖరి ఓవర్‌లో ఆమె 4,6,2,6.. వేర్‌హమ్ 4తో 23 రన్స్ సమకూరాయి. వీరి ధాటికి ఆరో వికెట్‌కు 24 బంతుల్లోనే అజేయంగా 56 పరుగుల భాగస్వామ్యం నెలకొంది.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 192/5 (వేర్‌హమ్ 43 నాటౌట్, భారతి 36 నాటౌట్, కనిక 35, మూనీ 33; షబ్నిం 1/25).

ముంబై: 19.2 ఓవర్లలో 193/3. (హర్మన్ 71 నాటౌట్, కేరీ 38 నాటౌట్, అమన్‌జోత్ 40; డివైన్ 1/29).

గాయత్రి జోడీ శుభారంభం

- లక్ష్యసేన్ ముందంజ
- ఇండియా ఓపెన్



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ మహిళల డబుల్స్‌లో భారత స్టార్ జోడీ గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ శుభారంభం చేసింది. మంగళవారం ఇక్కడ జరిగిన తొలి రౌండ్‌లో గాయత్రి జంట 21-15, 21-11తో ఓర్నిచా-సువాచై (థాయ్‌లాండ్) ద్వయంపై నెగ్గింది. సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-12, 21-15తో సహచర ఆటగాడు ఆయుష్ షెట్టిపై గెలిచాడు. పురుషుల డబుల్స్‌లో భారత జంట హరిహరన్-అర్జున్ ద్వయం ముందంజ వేసింది.

ఇవేం ఏర్పాట్లు?



కెనడా షట్లర్ బ్లిచ్‌ఫెల్డ్ అసహనం

ఇండియా ఓపెన్ ఏర్పాట్లపై సోమవారం అసంతృప్తి వ్యక్తం చేసిన డెన్మార్క్ షట్లర్ మియా బ్లిచ్‌ఫెల్డ్ మరోసారి విమర్శలు చేసింది. కేడీ జాదవ్ స్టేడియం నుంచి ఇందిరాగాంధీ స్టేడియానికి వేదికను మార్చినా పరిస్థితులు మెరుగవలేదని ఆరోపించింది. ప్రధాన పోటీలు జరుగుతున్న కోర్టులు బాగానే ఉన్నా, ప్రాక్టీసు కోర్టుల దగ్గర పక్షులు తిరుగుతున్నాయని, అక్కడ వాటి విసర్జనాలు దర్శనమిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి పరిస్థితుల్లో సాధన చేస్తే షట్లర్లు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఆమె విమర్శలను జాతీయ బ్యాడ్మింటన్ సమాఖ్య కార్యదర్శి సంజయ్ మిశ్రా కొట్టిపారేశారు.

అంజలికి ఆంధ్ర వన్డే పగ్గాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆంధ్ర మహిళల వన్డే జట్టు కెప్టెన్‌గా అంజలి శర్వాణిని నియమిస్తున్నట్టు ఆంధ్ర క్రికెట్ సంఘం కార్యదర్శి సానా సతీష్ బాబు తెలిపారు. అంజలితో పాటు 15 మందితో కూడిన జట్టును ప్రకటించారు. **జట్టు:** అంజలి, హెనిత్రా (వైస్ కెప్టెన్), షబ్నం, తమన్నా, పద్మజ, బి.అనూష, వాసవి, ధాత్రి, శిరీషా, శ్రీచరణి, ఎన్.అనూష, రంగలక్ష్మి, హేమ (వికెట్ కీపర్), ఆయాషా సింగ్. స్టాండ్ బై: విన్ని, తరుణి, సాయిలక్ష్మి, హంస, హారిక, సేతు సాయి.

ఆమెకు ఇద్దరితో ఎఫైర్ ఉంది





- నా దగ్గర సాక్ష్యాలు ఉన్నాయి
- మేరీపై మాజీ భర్త సంచలన ఆరోపణలు

న్యూఢిల్లీ: అప్పులపాలయ్యేలా చేసి, తన ఆస్తి కాజేయడంతోనే విడాకులు తీసుకున్నామంటూ దిగ్గజ బాక్సర్ మేరీకోమ్ ఇటీవల చేసిన ఆరోపణలను ఆమె మాజీ భర్త కరుంగ్ ఓన్‌కోలర్ ఖండించాడు. అనవసర ఆరోపణలు చేస్తే తాను ఊరుకోనన్న కరుంగ్.. మేరీకి వివాహేతర సంబంధాలు ఉన్నాయంటూ సంచలన కామెంట్లు చేశాడు. '2013లో ఓ జూనియర్ బాక్సర్‌తో మేరీకి ఎఫైర్ ఉండేది. ఇది తెలిసి మా కుటుంబాల మధ్య గొడవ జరిగింది. పెద్దలు సర్దిచెప్పడంతో రాజీకి వచ్చాం. 2017 నుంచి మేరీ అకాడమీలో పనిచేస్తున్న ఓ వ్యక్తితో ఆమె సంబంధం కొనసాగిస్తోంది. ఇందుకు సాక్ష్యంగా వారిద్దరి వాట్సాప్ మెసేజ్‌లు నా దగ్గర ఉన్నాయి. అయినా సరే, ఇన్నాళ్లూ నిశ్శబ్దంగా ఉన్నా. ఇప్పటికీ నేను అద్దె ఇంట్లో ఉంటున్నా. ఆమె నుంచి నయా పైసా తీసుకోలేదు. ఆమె అకాడమీకి బీజం వేసింది నేను. కానీ, ఇప్పుడు ఆ అకాడమీకి చైర్మన్‌గా వేరేవాళ్లున్నారు. నన్ను వాడుకొని వదిలేసింది. తన ప్రవర్తనతో నన్ను చాలా బాధపెట్టింది' అని ఓ చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో కరుంగ్ వాపోయాడు. మేరీ, కరుంగ్ పెళ్లి 2005లో జరిగింది. వీళ్లకు ముగ్గురు మగ పిల్లలు కాగా, ఓ పాపను దత్తత తీసుకున్నారు. 2023లో తమ సంప్రదాయం ప్రకారం విడాకులు తీసుకున్నామని గతేడాది మే నెలలో మేరీ ప్రకటించిన సంగతి తెలిసిందే.

భారత్‌లో ఆడే ప్రసక్తే లేదు

తమ నిర్ణయంలో మార్పు లేదన్న బంగ్లాదేశ్

ఢాకా: టీ20 వరల్డ్‌కప్‌లో ఆడేందుకు తమ జట్టు భారత్‌లో అడుగుపెట్టదని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) మరోసారి స్పష్టం చేసింది. ఆ జట్టు ఆటగాళ్ల భద్రతకు ప్రమాదం లేదని, అలాగే టోర్నీ షెడ్యూల్ ఇప్పటికే ఖరారైనందున తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని బీసీబీని ఐసీసీ మంగళవారం కోరింది. అయితే తమ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, వేదికలను భారత్ వెలుపలకు మార్చాలని బీసీబీ మరోసారి కోరింది. ఈ విషయంలో పరస్పరం ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవడానికి చర్చలు కొనసాగించాలని ఇరు వర్గాలు అంగీకరించాయి.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,42,530 ▲	1,30,650 ▲	2,92,000 ▲
విజయవాడ	1,44,700 ▼	1,34,000 ▼	2,70,000 ▲
విశాఖపట్నం	1,44,777 ▲	1,30,300 ▲	2,92,000 ▲
రాజమండ్రి	1,42,530 ▲	1,30,650 ▲	2,63,000 ▲
ప్రొద్దుటూరు	1,42,200 ▼	1,30,820 ▼	2,63,000 ▲
ముంబై	1,40,284 ▼	1,28,500 ▼	2,63,032 ▲

మరింత పెరిగిన వెండి ధర

న్యూఢిల్లీ: దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు మరో పతాక స్థాయికి చేరాయి. ఢిల్లీలో మంగళవారం కిలో వెండి ధర మరో రూ.6 వేలు పెరిగి జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.2.71 లక్షలు పలికింది. సోమవారం వెండి ధర ఏకంగా రూ.15 వేలు పెరిగింది. వరుసగా మూడు రోజుల్లో వెండి ధర కిలో 21,000 (8.4%) పెరిగింది. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.32,000 పెరిగింది. డిసెంబరు 31వ తేదీన కిలో వెండి ధర రూ.2.39 లక్షలుంది. ఇక 99.9% నాణ్యత గల బంగారం 10 గ్రాములు రూ.400 పెరిగి జీవిత కాల గరిష్ఠం రూ.1,45,000 తాకింది. సోమవారం సెషన్‌లో బంగారం ధర రూ.2,900 పెరిగింది.

'ఏఐ'తో అంత భయపడొద్దు

కృత్రిమ మేధతో పోయే ఉద్యోగాలు తక్కువే

ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్

వాషింగ్టన్: ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకటే భయం. కృత్రిమ మేధ (ఏఐ) దెబ్బతో ఉద్యోగాలు పోతున్నాయి. మనుషులు చేసే పనులన్నీ ఇక ఏఐ ఆధారిత రోబోలే చేస్తాయని..అయితే ఏఐ గురించి మరీ అంతగా భయపడాల్సిందేమీ లేదని 'ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్' తెలిపింది. గత ఏడాది అమెరికాలో ముఖ్యంగా టెక్ కంపెనీల్లో దాదాపు 1.25 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు. వీరిలో ఐదింట నాలుగు వంతుల ఉద్యోగాలు పోవడానికి ఆర్థిక, మార్కెట్ పరిస్థితులే కారణం తప్ప, ఏఐ కారణం కాదని ఈ నివేదిక తెలిపింది. కేవలం 4.5 శాతం ఉద్యోగాల తీసివేతలకు మాత్రమే ఏఐ కారణమని స్పష్టం చేసింది.

ఫ్రెషర్స్‌దీ అదే పరిస్థితి

డిగ్రీలు పూర్తి చేసి కొత్తగా జాబ్ మార్కెట్లోకి వస్తున్న వారిలో నిరుద్యోగం పెరిగిపోవడానికి ఏఐ ప్రధాన కారణం కాదని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ పేర్కొంది. ఉన్న ఉద్యోగాల కంటే ఎక్కువ మంది గ్రాడ్యుయేట్లు ఉద్యోగ మార్కెట్లోకి రావడం, పరిశ్రమకు అవసరమైన డిజిటల్ నైపుణ్యాలు లేకపోవడం ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. స్పష్టంగా చెప్పాలంటే ఏఐ ఇంకా ఉద్యోగాలను గల్లంతు చేసేంత స్థాయికి ఎదగలేదని పేర్కొంది.



'ఐటీ'పై ప్రభావం నిజమే: నాస్కామ్

అయితే ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగంపై ముఖ్యంగా టెక్ కంపెనీలపై మాత్రం ఏఐ ప్రభావం స్పష్టంగానే కనిపిస్తోంది. మన ఐటీ, టెక్ కంపెనీల్లో 20 నుంచి 40 శాతం పనులు ఇప్పుడు ఏఐ ఆధారిత టూల్స్ ద్వారానే జరుగుతున్నాయి. ఐటీ, టెక్ కంపెనీలకు ప్రాతినిధ్యం వహించే నాస్కామ్ ఒక నివేదికలో ఈ విషయం పేర్కొంది. నాస్కామ్-ఇన్‌డీడ్ అనే పేరుతో ఈ మేరకు ఒక నివేదిక విడుదల చేసింది. ప్రస్తుతం 40 శాతానికి పైగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ పనులు ఏఐ టూల్స్ ద్వారానే జరుగుతున్న విషయాన్ని గుర్తు చేసింది. ఇంటెలిజెంట్ ఆటోమేషన్, బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం) సేవల పనుల్లోనూ 37 నుంచి 39 శాతం వరకు ఏఐ ప్రధాన శక్తిగా మారింది.



ఈ ఏడాది కార్ల విక్రయాల్లో

10 శాతం వృద్ధి

టాటా మోటార్స్ పీవీ ఎండీ శైలేష్ చంద్ర

న్యూఢిల్లీ: భారత ప్రయాణికుల వాహన (పీవీ) రంగం ఈ ఏడాది గణనీయంగా పుంజుకోనుంది. జీఎస్‌టీ రేట్ల తగ్గింపు, పెరుగుతున్న ఎస్‌యూవీల డిమాండ్ కారణంగా, 2026లో ప్రయాణికుల వాహనాల విక్రయాలు దాదాపు 10 శాతం మేర వృద్ధి చెందే అవకాశముందని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) ఎండీ, సీఈఓ శైలేష్ చంద్ర తెలిపారు. 2025లో తొలి ఎనిమిది నెలలు పీవీ సెగ్మెంట్‌లో మందగమనం కొనసాగినప్పటికీ, జీఎస్‌టీ రేట్ల తగ్గింపు అనంతరం ఈ విభాగం 20 శాతం మేర వృద్ధి చెందిందని పేర్కొన్నారు. ఈ నెలలోనే పంచ్, సఫారీ, సియెర్రా, హారియర్ మోడళ్లలో పెట్రోల్ వేరియంట్లను మార్కెట్లోకి ప్రవేశపెట్టనున్నట్లు చెప్పారు.

'పంచ్' అప్‌డేటెడ్ వెర్షన్ విడుదల

అత్యంత ప్రజాదరణ పొందిన కాంపాక్ట్ ఎస్‌యూవీ 'పంచ్' అప్‌డేటెడ్ వెర్షన్‌ను కంపెనీ విడుదల చేసింది. దీని ప్రారంభ ధర రూ.5.59 లక్షలు. తమ సబ్-కాంపాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్ ప్రస్తుతం నెలకు 40,000 విక్రయాలను నమోదు చేస్తోందని, భవిష్యత్‌లో ఈ సంఖ్య 50,000 చేరుకుని అవకాశముందని శైలేష్ చంద్ర తెలిపారు.

మార్కెట్ మళ్లీ వెనకడుగు

- సెన్సెక్స్ 250 పాయింట్లు డౌన్

ముంబై: ఈక్విటీ మార్కెట్ మళ్లీ నష్టాల బాట పట్టింది. రికవరీ ఒక రోజు ముచ్చటగానే నిలిచిపోయింది. టారిఫ్ సంబంధిత ఆందోళనల నేపథ్యంలో రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎల్ అండ్ టీ, భారతి ఎయిర్‌టెల్ కౌంటర్లలో అమ్మకాలు జోరుగా సాగాయి. మూడో త్రైమాసికం ఆర్థిక ఫలితాల సీజన్ నిరాశాజనకంగా ప్రారంభం కావడం, విదేశీ నిధుల తరలింపు సైతం ఇన్వెస్టర్లను అమ్మకాల వైపు పురిగొల్పాయి. తీవ్ర ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 615.38 పాయింట్ల వరకు దిగజారి కనిష్ఠ స్థాయి 83,262.79ని తాకింది. కాని చివరి గంటలో సాగిన కొనుగోళ్ల మద్దతుతో నష్టాన్ని 250.48 పాయింట్లకు కుదించుకుని 83,627.69 వద్ద ముగిసింది. నిఫ్టీ 57.95 పాయింట్ల నష్టంతో 25,732.30 వద్ద క్లోజయింది.

బీసీసీ ఇష్యూకి భలే ఆదరణ: కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ తొలి పబ్లిక్ ఇష్యూకు ఇన్వెస్టర్లు బ్రహ్మరథం పట్టారు. బిడ్డింగ్ చివరి రోజు ముగిసే సమయానికి ఆ ఇష్యూ 76.81 రెట్లు ఓవర్ సబ్‌స్ర్కయిబ్ అయింది.

'సిప్'లకు ఇన్వెస్టర్లు బ్రహ్మరథం

గత ఏడాది ఇన్వెస్టర్లు క్రమానుగత పెట్టుబడి ప్లాన్లకు (సిప్) బ్రహ్మరథం పట్టారు. 2025 సంవత్సరంలో సిప్‌లలోకి రూ.3.34 లక్షల కోట్లు వచ్చాయి. సిప్ పెట్టుబడులు 2024లో రూ.2.68 లక్షల కోట్లు కాగా, 2023లో రూ.1.84 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇన్వెస్టర్లు మార్కెట్లో ఏర్పడిన కరెక్షన్లను మరింత పెట్టుబడి అవకాశాలుగా మలుచుకున్నారనేందుకు ఇది సంకేతమని భారత మ్యూచువల్ ఫండ్ కంపెనీల సంఘం (ఏఎంఎఫ్ఐ) పేర్కొంది. మార్కెట్లో ఎగుడు దిగుడులతో సంబంధం లేకుండా రూపాయి విలువ సగటు విధానంలో సిప్‌లు నిలకడగా రాబడులు అందించడం ఇందుకు కారణమని విశ్లేషకులంటున్నారు.

హైదరాబాద్ విమానాశ్రయంలో ఎయిర్‌సైడ్ రీఫర్ ట్రక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): శీతలీకరించిన కార్గో రవాణాకు మద్దతు ఇచ్చే లక్ష్యంతో హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం మంగళవారం ఎయిర్‌సైడ్ రీఫర్ ట్రక్‌ను ప్రవేశపెట్టింది. దేశంలో ఇలాంటి ట్రక్ సర్వీసు ప్రారంభించడం ఇదే ప్రథమం. ఉష్ణోగ్రతల ప్రభావానికి తీవ్రంగా గురయ్యే వస్తువులను కార్గో టెర్మినల్ నుంచి విమానంలోకి తరలించే క్రమంలో చల్లదనం నష్టపోకుండా చూసేందుకు ఈ ట్రక్ ఉపయోగపడుతుందని జీఎంఆర్ ఒక ప్రకటనలో తెలిపింది. విమానంలోకి వస్తువులను తరలించే క్రమంలో +2 డిగ్రీల నుంచి +25 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రతలు ఉండేలా అది జాగ్రత్తలు తీసుకుంటుందని పేర్కొంది. ఫలితంగా ఫార్మాస్యూటికల్స్, తాజా పళ్లు, కూరగాయలు, పూలు, సముద్రపు ఉత్పత్తులు, డెయిరీ ఉత్పత్తులు, మాంసం, త్వరగా చెడిపోయే స్వభావం గల ఇతర వస్తువుల నాణ్యత దెబ్బ తినకుండా ఇది కాపాడుతుందని సీఈఓ ప్రదీప్ పణిక్కర్ అన్నారు.

పోవెల్‌కు సెంట్రల్ బ్యాంకర్ల సంఘీభావం

ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ) : అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పోవెల్‌కు పలు దేశాల కేంద్ర బ్యాంకుల గవర్నర్లు సంఘీభావం ప్రకటించారు. గత ఏడాది జూన్‌లో ఫెడరల్ రిజర్వ్ భవన మరమ్మతుల కోసం పోవెల్ పెద్ద మొత్తంలో ఖర్చు చేశారు. ఇందులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ దర్యాప్తునకు ఆదేశించడమేగాక, పోవెల్‌పై అభియోగాలు నమోదు చేస్తామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇది ఫెడ్ రిజర్వ్ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసి తనకు కావలసిన రీతిలో వడ్డీ రేట్లు మార్చుకునేందుకు ట్రంప్ వేసిన ఎత్తుగడ అని ఈసీబీ, బ్రిటన్, స్వీడన్, డెన్మార్క్, జర్మనీ, జపాన్, కెనడా, స్విట్జర్లాండ్ వంటి ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకుల గవర్నర్లు దుయ్యబట్టారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	575
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	583	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.	75

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	156	విజయవాడ	152
వరంగల్	156	గుంటూరు	159
కరీంనగర్	156	ఒంగోలు	159
మహబూబ్‌నగర్	156	చిత్తూరు	162
కర్నూలు	156	నెల్లూరు	167
విశాఖపట్నం	143	అనంతపురం	167
గోదావరి	152		

ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు రూ.4 లక్షల కోట్లు

కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ: భారత్ నుంచి పెద్ద ఎత్తున ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, పరికరాలు ఎగుమతవుతున్నాయి. గత ఏడాది ఈ ఎగుమతులు రూ.4 లక్షల కోట్లు మించిపోయినట్టు కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇందులో ఐఫోన్ల ఎగుమతుల విలువే రూ.2.03 లక్షల కోట్ల వరకు ఉందన్నారు. 2024తో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు. 2024లో మన దేశంలో రూ.11.3 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు ఉత్పత్తి అయితే అందులో రూ.3.3 లక్షల కోట్ల విలువైన వస్తువులు ఎగుమతయ్యాయి. ప్రస్తుతం ఈ రంగంలో పని చేసే ఉద్యోగుల సంఖ్య 25 లక్షలు మించిపోయింది.

రూ.6.76 లక్షల కోట్లకు: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దేశంలో మొబైల్ ఫోన్ల ఉత్పత్తి, ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఉత్పత్తి విలువ ఎంత లేదన్నా 7,500 కోట్ల డాలర్లకు (రూ.6.76 లక్షల కోట్లు), ఎగుమతులు 3,000 కోట్ల డాలర్లకు (సుమారు రూ.2.7 లక్షల కోట్లు) చేరుతాయని ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) అంచనా. ఈ సంవత్సరం మన దేశంలో నాలుగు సెమీకండక్టర్ యూనిట్లు ఉత్పత్తి ప్రారంభించనున్నాయి.దీంతో మన దేశం నుంచి ఎలక్ట్రానిక్స్ మొబైల్ ఫోన్ల ఎగుమతులు మరింత పుంజుకుంటాయని భావిస్తున్నారు.

రూపాయి మారకానికి హద్దులు లేవు: ఆర్‌బీఐ గవర్నర్

ముంబై: డాలర్‌తో రూపాయి మారకం రేటు ఏ స్థాయిలో ఉండాలనే దానిపై తమకు లక్ష్యాలు ఏమీ లేవని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ సంజయ్ మల్హోత్రా స్పష్టం చేశారు. మారకం రేటు రూ.90 వద్ద ఉండాలా, లేక రూ.91 వద్ద ఉండాలా? అనే విషయాన్ని మార్కెట్టే నిర్ణయిస్తుందన్నారు. తమ పని తీవ్ర ఆటుపోట్లున్నప్పుడు రూపాయి మారకం రేటును స్థిరీకరించడం మాత్రమేనన్నారు. 'ఎన్‌డీటీవీ ప్రాఫిట్' బిజినెస్ న్యూస్ చానల్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం స్పష్టం చేశారు. గత కొన్నేళ్లుగా ఇదే విధానాన్ని అనుసరిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు.

సవాళ్లలోనూ మత్స్య రంగ వృద్ధి!



2024-25లో జాతీయ సముద్ర ఆహార ఎగుమతుల్లో రాష్ట్ర వాటా 34 శాతం

గత నవంబరు నాటికి వృద్ధిరేటు 18.47%

ఆక్వా రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

ట్రంప్ సుంకాలతో ఆక్వా మార్కెట్‌లో అస్థిరత

అమెరికా మార్కెటింగ్‌కు ప్రత్యామ్నాయాల అన్వేషణ

సాగుదారులకు రూపాయిన్నరకే యూనిట్ విద్యుత్

వేట నిషేధ సమయంలో రూ.20 వేల జీవనభృతి

(ఆంధ్రజ్యోతి-అమరావతి)

అనేక ఆటు పోట్లు, సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ.. రాష్ట్రంలో 16.5 లక్షల మందికి జీవనోపాధి కల్పిస్తున్న మత్స్య రంగం గణనీయమైన వృద్ధి సాధిస్తోంది. ఇందులో ప్రభుత్వం అందిస్తున్న మద్దతు కీలకంగా ఉంది. దేశ చేపల ఉత్పత్తిలో 30 శాతం వాటాతో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. రాష్ట్ర స్థూల విలువ జోడింపు (జీవీఏ)లో 9 శాతం, వ్యవసాయ రంగంలో 25 శాతం సహకారం అందిస్తోంది. 2024-25లో రూ.21,246 కోట్ల విలువైన జాతీయ సముద్ర ఆహార ఎగుమతుల్లో రాష్ట్ర వాటా 34 శాతం నమోదైంది. దేశంలో రొయ్యల ఉత్పత్తి 75 శాతం రాష్ట్రం నుంచే అవుతోంది. రాష్ట్రంలో 5.85 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. 2024-25లో 55.39 లక్షల టన్నుల చేపలు ఉత్పత్తి కాగా, 2025-26లో 66.62 లక్షల టన్నుల లక్ష్యంలో ఇప్పటికే 46 లక్షల టన్నుల ఉత్పత్తి అయ్యాయి. ఉత్పత్తి లక్ష్యం జీవీఏ రూ.1,53,955 కోట్లు కాగా, గత నవంబరు నాటికి మత్స్య రంగం వృద్ధిరేటు 18.47 శాతంగా నమోదైందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఆక్వా సాగు విస్తీర్ణం, ఉత్పత్తి ఆధారంగా రైతులకు మార్కెటింగ్ కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం క్లస్టర్ విధానాన్ని తెచ్చింది. ఆక్వా చెరువులను మత్స్య శాఖ జియో ట్యాగ్ చేస్తోంది. 2025-26లో అదనంగా లక్ష ఎకరాల్లో ఆక్వా సాగు విస్తరించాలని మత్స్యశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ఆక్వా సాగులో ఉత్పాదకతను పెంచి, నిర్వహణను మెరుగుపర్చి, ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేందుకు ఐవోటీ పరికరాలు, నాణ్యమైన దాణా వాడుతున్నారు. రసాయనాల వాడకానికి డ్రోన్లు ఉపయోగిస్తున్నారు. బయోఫ్లోక్ టెక్నాలజీ, ఆర్‌ఏఎస్, చెరువుల లైనింగ్, ఆధునిక నర్సరీల వంటివి ప్రోత్సహిస్తున్నారు.

సాగుదారులకు పలు సవాళ్లు

తూర్పు తీరంలోని భారత ప్రాదేశిక జలాల్లో సముద్ర చేపల నిల్వలు తగ్గుముఖం పట్టాయని మత్స్యశాఖ గుర్తించింది. ఇది మత్స్యకారుల ఆదాయంపై ప్రభావం చూపిస్తోంది. మరోవైపు రొయ్యలు, చేపల చెరువుల నిర్వహణ వ్యయం పెరిగిపోతోంది. మరోవైపు వైరస్‌లతో చేపలు, రొయ్యల రైతులు నష్టాలు చవిచూస్తున్నారు. చాలీచాలని కోల్డ్ చైన్, ల్యాండింగ్ సెంటర్లు, ప్రాసెసింగ్, స్టోరేజీ సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేక ఆక్వా రంగం కొంత ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న తరుణంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల బాదుడుతో ఆక్వా మార్కెట్‌లో అస్థిరత ఏర్పడింది. దీంతో సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని, ఆక్వా ధరలు తగ్గకుండా.. అమెరికా మార్కెటింగ్‌కు ప్రత్యామ్నాయాలు అన్వేషిస్తున్నారు. ఆక్వా అథారిటీ ఆధ్వర్యంలో కమిటీ వేసి, సాగుదారుల్ని ఆదుకునేందుకు కృషి చేస్తున్నారు.

గత ప్రభుత్వ జీవో 217 రద్దు

మంచినీటి జలాశయాల్లో చేపల పెంపకం ద్వారా మత్స్యకార సంఘాలు ఆదాయం పొందటానికి విఘాతం కలిగించేలా గత ప్రభుత్వం తెచ్చిన జీవో 217ను కూటమి ప్రభుత్వం ఇప్పటికే రద్దు చేసింది. 29 జలాశయాల్లో 997.49 లక్షల చేప పిల్లల్ని నిల్వ చేస్తున్నారు. 2025-26లో 3,458 జలవనరుల్లో 4 కోట్ల చేప పిల్లల్ని వదిలి.. 1,442 మత్స్యకార సహకార సంఘాల్లోని 2.17 లక్షల మంది సభ్యులతో పాటు 19,510 మంది లైసెన్స్‌డ్ మత్స్యకారులకు లబ్ది చేకూర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇప్పటికే పీఎంఎంఎస్‌వై కింద 102 మత్స్యకార సహకార సంఘాలను మత్స్యరైతు ఉత్పత్తి సంస్థలుగా మార్చింది.

ఆక్వా రైతులకు ప్రభుత్వం భరోసా

ఆక్వా జోన్లలో అర్హత కలిగిన సాగుదారులకు ప్రభుత్వం యూనిట్ విద్యుత్ రూపాయిన్నరకే ఇస్తోంది. 2024-25లో 50 వేలపైగా విద్యుత్ కనెక్షన్లకు రూ.903 కోట్ల వ్యయంతో 3,417 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేశారు. హామీ మేరకు 2025-26లో జోన్, నాన్ జోన్లలోని 68 వేల కనెక్షన్లకు రాయితీ ధరపై 5 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్ సరఫరాకు రూ.1,100 కోట్లు ప్రభుత్వం భరిస్తోంది. 75 పీతల పెంపకం యూనిట్లు, 175 అలంకార చేపల పెంపకం యూనిట్లు, 200 సముద్రపు నాచు పెంపకం యూనిట్లను ఏర్పాటు చేశారు. బాపట్ల జిల్లా పరసావారిపాలెంలో పీఎంఎంఎస్‌వై పథకం కింద రూ.88.08 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ అభివృద్ధి చేస్తున్నారు. సాగరమాల పథకంలో రాయదరువు గ్రామం వద్ద పూడిపోయిన సముద్ర ముఖ ద్వారాన్ని తెరిచి, 20 వేల మత్స్యకార కుటుంబాలకు మేలు చేస్తున్నారు.

మత్స్యకారులకు ఆర్థిక సాయం

'మత్స్యకార సేవలో' కింద వేట నిషేధ సమయంలో ఒక్కో మత్స్యకార కుటుంబానికి ప్రభుత్వం రూ.20 వేలు జీవనభృతిగా ఇస్తోంది. 2025లో 1,21,433 కుటుంబాలకు రూ.242.86 కోట్ల సాయం చేసింది. ప్రమాదవశాత్తు మరణించిన మత్స్యకారులకు రూ.10 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. గడచిన ఏడాదిలో 256 క్లైములను పరిష్కరించారు. చేపల వేట కోసం లీటర్‌కు రూ.9 రాయితీపై 21,574 పడవలకు డీజిల్ సరఫరా చేస్తోంది. సముద్ర చేపల ఉత్పత్తిని పెంచేందుకు 60:40 కేంద్ర, రాష్ట్ర వాటాగా రూ.7.70 కోట్లతో 22 ఆర్టిఫిషియల్ రీఫ్ (కృత్రిమ దిబ్బ)లను ఏర్పాటు చేశారు. రెండో దశలో 162 ఏర్పాటు చేయనున్నారు. చేపల ఉత్పత్తిని పెంచడానికి తీర ప్రాంతంలో 9.50 లక్షల సముద్ర చేపల సీడ్స్‌ను విడుదల చేయాలని నిర్ణయించగా, కాకినాడ తీరంలో 50 వేల సముద్ర చేపల సీడ్స్‌ను వదిలారు. తీర ప్రాంతంలోని మత్స్యకార గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, జీవనోపాధి కార్యకలాపాలకు రూ.2 కోట్ల చొప్పున 15 గ్రామాలకు రూ.30 కోట్లు కేటాయించారు. పీఎంఎంఎస్‌వై కింద 2025లో రాయితీపై 772 యూనిట్ల పడవలు, వలలు, ఇంజన్లు మత్స్యకారులకు సరఫరా చేశారు.

సంక్రాంతికి నవ్వులు పంచుతుంది



- నవీన్ పొలిశెట్టి

'మన ఒత్తిడిని దూరం చేసి, హాయిగా నవ్వించేలా ఉంటుంది 'అనగనగా ఒక రాజు' చిత్రం. ప్రచార చిత్రాలకు వచ్చిన స్పందన సినిమా విజయంపై నమ్మకాన్ని ఇచ్చింది. మా చిత్రం సంక్రాంతి పండుగకు ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది' అని నవీన్ పొలిశెట్టి అన్నారు. ఆయన కథానాయకుడిగా మారి దర్శకత్వం వహించిన చిత్రమిది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం మంగళవారం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. నాగవంశీ మాట్లాడుతూ 'గోదావరి నేపథ్యంలో జరిగే ఒక అందమైన కథతో ఈ సినిమా రూపొందింది. నవీన్ శైలిలో చాలా సరదాగా సాగుతుంది. వినోదంతో పాటు ఒక మంచి ఎమోషన్ ఉన్న చిత్రమిది. అన్ని హంగులతో తెరకెక్కిన సంక్రాంతి సినిమాను కుటుంబంతో కలసి చూడండి' అని కోరారు.

కథానాయిక మీనాక్షి చౌదరి మాట్లాడుతూ 'మేమందరం ఎంతో కష్టపడి ఒక మంచి సినిమాతో మీ ముందుకు వస్తున్నాం. మా సినిమా చూసి నవ్వులతో ఈ సంక్రాంతి పండుగను ఎంజాయ్ చేయండి' అని అన్నారు. సంక్రాంతి సందర్భంగా మా సినిమా విడుదలవుతున్నందుకు ఆనందంగా ఉంది, ఈ సారి రాజుగారితో పండుగను ఎంజాయ్ చేయండి అని మారి ప్రేక్షకులను కోరారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

రేటింగ్‌లు, రివ్యూలపై నిషేధం

- **ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు**

చిరంజీవి నటించిన 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమాకు సంబంధించి బుక్ మై షోలో రివ్యూలు, రేటింగ్స్‌పై నిషేధం విధిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇటీవల ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో 'అనగనగా ఒక రాజు', 'నారి నారి నడుమ మురారి' చిత్రాల నిర్మాతలు కూడా కోర్టును ఆశ్రయించారు. బుక్‌మై షో వంటి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఈ చిత్రాలకు సంబంధించి రివ్యూలు, రేటింగ్‌లను నిషేధిస్తూ ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 'సినిమాకు ప్రేక్షకులే అసలైన న్యాయనిర్ణేతలు, బాధ్యతాయుతమైన ఆన్‌లైన్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి, ఉద్దేశపూర్వకంగా చేసే వ్యతిరేక ప్రచారాలను అడ్డుకోవడానికి ఈ చర్య తోడ్పడుతుంది' అని 'సితార ఎంటర్‌టైన్‌మెంట్స్' సంస్థ పేర్కొంది.

టికెట్ ధరలు పెంచడం లేదు



అనిల్ సుంకర

శర్వానంద్ కథానాయకుడిగా రామ్ అబ్బరాజు దర్శకత్వంలో రూపుదిద్దుకున్న చిత్రం 'నారి నారి నడుమ మురారి'. సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సినిమా నేడు విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియా సమావేశం నిర్వహించింది. నిర్మాత అనిల్ సుంకర మాట్లాడుతూ 'ఈ సినిమాలో శ్రీవిష్ణుకి ఓ మంచి అతిథి పాత్ర ఉంది. ఆయన ఉన్నంత సేపూ మీరు నవ్వుతూనే ఉంటారు. ఈ చిత్రం డబుల్ హిట్ అవుతుందని నరేశ్ వీకే అంటున్నారు. రామ్ అబ్బరాజు అంత అద్భుతంగా తీర్చిదిద్దారు. కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్ డ్రామా అన్నీ ఉన్న చిత్రమిది. గతంలో సంక్రాంతికి వచ్చిన శర్వా చిత్రాలు 'శతమానం భవతి', 'ఎక్స్‌ప్రెస్ రాజా'. సూపర్ హిట్ అయ్యాయి. ఇప్పుడు 'నారి నారి నడుమ మురారి'తో శర్వాకు మూడో సంక్రాంతి అవుతుంది. మేము టికెట్ రేట్లు పెంచడం లేదు. సాధారణ ధరల్లోనే అందరికీ అందుబాటులో ఉంటాయి. కుటుంబ సభ్యులందరూ కలసి చూడాలి' అని కోరారు. వీకే నరేశ్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో ఓ కొత్త టైమింగ్‌తో కొత్త యాంగిల్‌లో శర్వాను చూస్తారు. మళ్లీ వచ్చే సంక్రాంతి వరకూ అందరూ ఈ సినిమా గురించే మాట్లాడుకుంటారు' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు రామ్ అబ్బరాజు మాట్లాడుతూ 'ఇది హాస్య భరిత కుటుంబ కథా చిత్రం. అందర్నీ అలరిస్తుంది. అసలైన పండగ ఆఫర్ ఇస్తున్నాము. ఎంఆర్‌పీ ధరలకే టికెట్లు ఉంటాయి' అని చెప్పారు. హీరోయిన్లు సంయుక్త, సాక్షి వైద్య తదితరులు పాల్గొన్నారు.

ఈ ఘనత మెగాస్టార్‌దే



- అనిల్ రావిపూడి

'నా కెరీర్‌లో అత్యంత వేగంగా కేవలం 25 రోజుల్లో స్ర్కిప్ట్ పూర్తి చేసిన సినిమా 'మన శంకర వరప్రసాద్ గారు'. చిరంజీవిగారిలోని ప్రత్యేకతలన్నింటినీ కలిపి కథ రాశాను కాబట్టే స్ర్కిప్ట్ త్వరగా పూర్తయింది. ఈ సినిమాలోని ప్రతి సన్నివేశానికి ఆయనే స్ఫూర్తి. కాబట్టి ఈ సక్సెస్ క్రెడిట్ కూడా ఆయనకే దక్కుతుంది' అని అనిల్ రావిపూడి అన్నారు. ఆయన దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రమిది. సుస్మిత కొణిదెల, సాహు గారపాటి నిర్మించారు. సినిమా ఇటీవలే విడుదలైన సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. నిర్మాత సాహు మాట్లాడుతూ 'మెగాస్టార్‌తో సినిమా చేయాలనేది నా కల. సినిమా విజయం సాధిస్తుందని చెప్పాను. ఇప్పుడు అదే జరుగుతోంది. వచ్చే వారం నుంచి బయ్యర్లు, ఎగ్జిబిటర్లు పండగ చేసుకుంటారు' అని అన్నారు. సుస్మిత కొణిదెల మాట్లాడుతూ 'నాన్నగారు (చిరంజీవి) ఈ సినిమా ప్రారంభించేముందు నా పేరు అడిగి... 'ఆ పేరును నిలబెట్టుకో' అన్నారు. ఈ సినిమా విజయంతో ఆ పేరు నిలబెట్టుకున్నానని భావిస్తున్నా' అని అన్నారు.

ఇళయరాజాతో మాకు కోర్టు చిక్కులు లేవు

ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా పాటల వినియోగంపై ఇటీవల తలెత్తిన వివాదాల నేపథ్యంలో 'మన శంకర వరప్రసాద్' చిత్రం దర్శకుడు అనిల్ రావిపూడి వివరణ ఇచ్చారు. ఇళయరాజాతో తమకు ఎలాంటి కోర్టు కేసుల ప్రమాదం లేదన్నారు. 'మా నిర్మాతలు స్వయంగా వెళ్లి ఇళయరాజా గారిని కలిశారు. 'చిరంజీవి గారి సినిమాలో మీ పాటను వాడుకోవాలనుకుంటున్నా'మని అడిగారు. ఆయన వెంటనే 'వాడుకోండి' అని అనుమతినిచ్చారు' అని వివరించారు.





విజయవాడ గుణదలలో ఏర్పాటు చేసిన భారీ బరి



బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం తూర్పు పాలెంలో బరుల వద్ద పుంజులతో పందెంరాయుళ్లు

తిరుపతిలోని శిల్పారామం వద్ద మంగళవారం రాత్రి భోగి మంటల సందడి

బెజవాడ హౌస్‌ఫుల్

విజయవాడలో అన్ని స్టార్ హోటళ్లు, లాడ్జీలు నిండిపోయాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో గన్నవరం నియోజకవర్గంలో కేసరపల్లి, గుడివాడ, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో భారీగా బరులు ఏర్పాటు చేశారు. నందిగామ నియోజకవర్గంలో కొత్తగా క్యాసినోను పరిచయం చేస్తున్నారు. సంక్రాంతి సంబరాలను వీక్షించడానికి పొరుగున ఉన్న తెలంగాణ నుంచి సందర్శకులు భారీగా వస్తున్నారు. విజయవాడలో వసతి ఏర్పాటు చేసుకోవడంతో నగరంలో మొత్తం 15 స్టార్ హోటళ్లు, 80 లాడ్జీలలో మొత్తం 5 వేల గదులు నిండిపోయాయి. గదులన్నీ వారం రోజుల వరకు బుక్ చేసుకున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు. విజయవాడలో వసతి ఏర్పాటు చేసుకుని సందర్శకులు గుడివాడ, గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో జరిగే కోడిపందేలను చూడటానికి వెళ్తారు. కొంతమంది ఏలూరు జిల్లా మీర్జాపురంలో ఏర్పాటు చేసిన హైటెక్ కోడిపందేల శిబిరం వద్దకు, మరికొంతమంది భీమవరంలో జరిగే బరుల వద్దకు వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఈ సంక్రాంతి సీజన్‌లో మొదటిసారిగా క్యారవాన్స్‌ను కూడా సిద్ధం చేశారు. కృష్ణా-ఏలూరు జిల్లాల మధ్యన గన్నవరం, నూజివీడుల సరిహద్దున బిళ్ళనపల్లి, మీర్జాపురంల వద్ద ఏర్పాటు చేస్తున్న టెక్ కోడి పందేలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వీవీఐపీలు వస్తున్నారు. పలువురు రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, సినీ రంగానికి చెందిన ప్రముఖులు వస్తున్నారు. ఇప్పటికే వీరికోసం ఏసీ గ్లాస్ గ్యాలరీలను ఏర్పాటు చేశారు. విజయవాడ, హనుమాన్ జంక్షన్, ఏలూరు, నూజివీడు, గన్నవరంలో హోటల్స్ అన్నింటినీ వీరి కోసం బుక్ చేశారు. పోటీలు జరిగే రోజున అక్కడే విశ్రాంతి తీసుకోవటానికి నిర్వాహకులు క్యారవాన్స్ రప్పించారు. మంగళవారం సాయంత్రానికి నాలుగు రాగా, అర్ధరాత్రికి మరో ఆరు వరకు రానున్నాయి. రూ.కోట్లలో పందేలు కాస్తుండటంతో.. అతిథులకు ఆ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కువ పందేలు కొట్టేవారికి థార్, బ్రెజా కార్లను కూడా ఇస్తున్నారు. వీటిని భోగి రోజున బరులకు తీసుకువస్తారు. రామన్నగూడెం, సింగన్నగూడేలలో పందేల నిర్వాహకులు విజేతలకు బైక్‌లు ఇస్తున్నారు.

పందేలకు సై!

(మొదటి పేజీ తరువాయి)

ఆడటానికి రంగం సిద్ధమైంది. పెద్ద ఎత్తున బరులు ఏర్పాట్లు చేశారు. పలు చోట్ల కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టారు. కోడి పందేలతో పాటు అదే సమయంలో గుండాటలు, పేకాటలూ జోరుగా జరగనున్నాయి. కోడి పందేలు తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పలువురు రాజకీయ, సినీ, పారిశ్రామిక ప్రముఖులు ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాలకు రానున్నారు. విజయవాడలో మొత్తం హోటళ్లు, లాడ్జీలు నిండిపోయాయి. ఏకంగా 5 వేల గదులను బుక్ చేసుకున్నారు. తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖులు ఇక్కడ బస చేసి, కోడి పందేలు చూసేందుకు ఉమ్మడి కృష్ణా, గోదావరి జిల్లాలకు వెళ్లనున్నారు. ఈ సీజన్‌లో ఎన్టీఆర్-ఏలూరు జిల్లా సరిహద్దున వీవీఐపీల కోసం ఏకంగా క్యారవాన్స్ ఏర్పాటు చేయడం ప్రత్యేకత. పలు ప్రాంతాల్లో విజేతలకు అందజేసేందుకు కార్లు, బుల్లెట్లు, బైకులు సిద్ధంగా ఉంచారు. కొన్ని చోట్ల ముహూర్తం కోసం మంగళవారమే పందేలను లాంఛనంగా ప్రారంభించారు. పోలీసులతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో, వారికి మామూళ్లతో ఈ జూద క్రీడలు హోరెత్తిపోనున్నాయి. సంక్రాంతి సంబరాలు, కోడి పందేలు చూసేందుకు ఇతర రాష్ట్రాలు, నగరాల నుంచి గోదావరి జిల్లాలకు బస్సులు, వాహనాల్లో పెద్దఎత్తున వస్తూనే ఉన్నారు. విజయవాడ నుంచి ఆ జిల్లాలకు వచ్చే వాహనాల సంఖ్య మంగళవారం భారీగా పెరిగింది. కలపర్రు టోల్‌గేటు వద్ద వాహనాల రద్దీ పెరిగింది. మంగళవారం రాత్రి 8 గంటల వరకూ 17,221 వాహనాలు దాటాయి. తెల్లవారేసరికి మరో 20 వేల వరకూ వస్తాయని అంచనా.

తూర్పులో 'ఢీ'కి.. బరులు రెడీ

అమలాపురం, రాజోలుతో పాటు మెట్ట ప్రాంతమైన జగ్గంపేట తదితర చోట్ల బరులకు బోణీ చేశారు. కోనసీమలో వందకు పైగా సిద్ధమయ్యాయి. ముఖ్యంగా ఐ.పోలవరం మండలం మురమళ్లలోని సువిశాలమైన ప్రాంతంలో ఫ్లడ్ లైట్ల వెలుగులో పందేలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. జిల్లాలోనే అతిపెద్ద వీఐపీ బరిగా పేరొందిన ఇక్కడకు వచ్చే అతిథులు, పందెంరాయుళ్లకు సకల సౌకర్యాలు కల్పించారు. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల్లోనూ వందల బరుల్లో పందేల జోరు కొనసాగనుంది. ఇక ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చిన్నాపెద్దా కలిపి ఒక్కో బరిలో రోజుకు కోడి పందేలు, గుండాట కలిపి రూ. 15 లక్షల నుంచి రూ. 1.50 కోట్ల వరకు లావాదేవీలు జరుగుతాయని అంచనా. మురమళ్లలో రోజుకు రూ. 2 కోట్ల వరకు లావాదేవీలు జరగనున్నాయి. కాకినాడ రూరల్, తుని, సామర్లకోట, పిఠాపురం, పెద్దాపురంలో అత్యధిక పందేలు గెలిచిన వారికి బుల్లెట్లు, కార్లు గిఫ్ట్‌లుగా ఇవ్వబోతున్నారు. కరప మండలంలో మూడు రోజుల పందేల విజేతకు ఇన్నోవా కారు అందించనున్నట్టు ప్రకటించారు. వెరసి ఉమ్మడి జిల్లాలో భోగి రోజు కోడి పందేలు, గుండాటల్లో రూ. 70 కోట్లు చేతులు మారతాయని భావిస్తున్నారు.

బాపట్లలో కత్తులు దూసిన కోళ్లు

బాపట్ల జిల్లాలో మంగళవారమే సంక్రాంతి సందడి మొదలైంది. చుట్టుపక్కల జిల్లాలతోపాటు తెలంగాణ నుంచి కూడా వేలాది మంది తరలివచ్చి లక్షల్లో పందేలు కాశారు. జిల్లాలోని అధికార పార్టీ ప్రధాన నేత ఆధ్వర్యంలో పది బరులు ఏర్పాటు చేశారు. వాటి సమీపంలోనే పేకాట, కోతముక్క, గుండాట, నంబర్ల ఆటలు నిర్వహించారు. చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో రూ.10వేలు, రూ.20వేలు, రూ.50వేలు, రూ.లక్ష విభాగాల్లో ప్రత్యేక బరులు ఏర్పాటు చేశారు. వీఐపీ బరుల్లో లక్ష నుంచి రూ.3 లక్షల వరకు పందేలు నిర్వహించారు. మహిళలు సైతం భారీగా తరలివచ్చారు. బరుల వద్దే ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేశారు.



బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలోని వీవీఐపీ బరిలో భారీ జనసందోహం మధ్య కోడిపందేలు



ఏలూరు జిల్లాలో ప్రత్యేక ఏర్పాట్లు

ఏలూరు జిల్లాలో కోడి పందేలకు బరులు సిద్ధమయ్యాయి. పోలీసులు పలుచోట్ల అడ్డుకున్నప్పటికీ బుధవారం ఉదయానికి పునరుద్ధరించే దిశగా రాజకీయ నాయకులు పావులు కదుపుతున్నారు. పందెం కోళ్ల పోట్లాటకు భోగి రోజు ఉదయం 10.30 గంటలకు ముహూర్తాలను కూడా పెట్టేసుకున్నారు. నూజివీడు రూరల్ మండలం మీర్జాపురంలో 10 ఎకరాల బరి సిద్ధమైంది. రాజకీయ నాయకులు, ముఖ్యమైన నేతలతో మూడు రోజులు పందేలు వేస్తారు. గుండాట, లోన, బయట పేకాటకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక్కడ మూడు వేలమందికి పైగా కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. కైకలూరు రూరల్ మండలంలోని భుజబలపట్నంలో ప్రతీ రోజు రెండు కోట్లకు పైగా డబ్బులు చేతులు మారుతాయని చెబుతున్నారు. ఇక్కడ కైకలూరు-నరసాపురం హైవే పక్కన భారీ సెట్టింగులతో రెండు ఎకరాల్లో బరి ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఆకివీడు, దుంపగడప, ఉండి, కైకలూరు, ఏలూరు, ఏలూరుపాడు, ఐ.భీమవరం, కలిదిండి నుంచి పెద్ద ఎత్తున తిలకించడానికి వస్తారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో 5 ఎకరాలోపు స్థలాన్ని బరులకు సిద్ధం చేశారు. పోలవరం ముంపు మండలమైన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో భారీగా బరులు సిద్ధం చేశారు. చింతలపూడిలో తెలంగాణ సరిహద్దు సమీపంలోని చింతపల్లి, రాఘవాపురంలో మామిడి, పామాయిల్ తోటల్లోనే భారీగానే జరగనున్నాయి. ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఇళ్ల స్థలాల మధ్య భారీ బరిలో హైటెక్ ఏర్పాట్లు చేశారు. తెలంగాణ నుంచి కూడా ఇక్కడకు భారీగా రానున్నారు. ముదినేపల్లిలో పెదపాలపర్రు, బొమ్మినంపాడులో వరుసగా ఐదు పందేల్లో గెలిచిన పుంజు యజమానికి కారును బహుమతిగా ఇవ్వనున్నారు.



జాతీయ స్థాయి డ్రాగన్ పడవ పోటీల్లో వెయ్యి మీటర్ల విభాగంలో ప్రథమ విజేత.. బండారు బలగం టీమ్(ఏలూరు)కు బహుమతి అందజేస్తున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ

డ్రాగన్ పడవ పోటీల విజేత ఏలూరు టీమ్

- విజేతకు రూ.2లక్షల నగదు, ట్రోఫీ అందజేత
- పాల్గొన్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు శ్రీనివాసవర్మ, అనిత

ఆత్రేయపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురంలో సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ ఉత్సవ్ పేరిట మూడురోజుల పాటు జాతీయస్థాయి డ్రాగన్ పడవ పోటీలు ఉత్సాహంగా ముగిశాయి. మంగళవారం ఉత్కంఠగా సాగిన ఫైనల్ పోటీల్లో.. 1000 మీటర్ల విభాగంలో ఏలూరుకు చెందిన బండారు బలగం టీమ్ ప్రథమస్థానం దక్కించుకుంది. వీరికి రూ.2లక్షల నగదు పురస్కారం ట్రోఫీని.. ముఖ్య అతిథిగా హాజరైన కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అందజేశారు. పల్నాడు టీమ్‌కు ద్వితీయస్థానం రూ.లక్ష, కోనసీమ టీమ్‌కు తృతీయ స్థానం రూ.50వేల నగదు పురస్కారం, ట్రోఫీలను అందజేశారు. 500మీటర్ల విభాగంలో జంగారెడ్డిగూడేనికి చెందిన ఎర్రకాలువ టీమ్ ప్రథమ స్థానం రూ.70వేలు, కర్నూలు టీమ్ ద్వితీయ స్థానం రూ.50వేలు, పల్నాడు-2 తృతీయ స్థానం రూ.30వేలు, ట్రోఫీలు అందజేశారు. అంతకుముందు ఈ పోటీలను హోంమంత్రి అనిత, పర్యాటకమంత్రి కందుల దుర్గేశ్, చిన్నతరహా పరిశ్రమల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించారు. కాగా, సంక్రాంతి సంబరాల్లో భాగంగా పర్యాటక ప్రదేశమైన ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల వద్ద ఏర్పాటు చేసిన ఫుడ్‌ఫెస్టివల్‌ను హోంమంత్రి అనిత సందర్శించారు. ఆత్రేయపురం పూతరేకులను ఆమె రుచి చూశారు. ఈ సందర్భంగా మంత్రులు అనిత, కందుల దుర్గేశ్ సరదాగా సోది చెప్పించుకున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తదితరులు పాల్గొన్నారు.



ఆత్రేయపురంలో హోరాహోరీగా సాగుతున్న ఫైనల్ పోటీల్లో పడవలు



మంగళవారం నారావారి పల్లెలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, టీచర్లతో చంద్రబాబు దంపతులు

నారావారి పల్లెలో ముందే సంక్రాంతి

- సొంతూరులో వేడుకల్లో పాల్గొన్న సీఎం కుటుంబం

తిరుపతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): నిత్యం ఇటు పార్టీ కార్యకలాపాలు, అటు పాలనా కార్యక్రమాలతో తీరిక లేకుండా గడిపే సీఎం చంద్రబాబు మంగళవారం దానికి భిన్నంగా కనిపించారు. సంక్రాంతి నేపథ్యంలో కుటుంబంతో కలసి స్వగ్రామంలో సేదదీరారు. నేతలతో పాటు ఆప్తులనూ కలిసి పలకరించారు. సతీమణి, కుమారుడు, కోడలు, మనవడు, ఇతర బంధువులతో కలసి ఉత్సాహంగా సంక్రాంతి ముందస్తు వేడుకల్లో పాల్గొన్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలోని తన నివాసానికి సోమవారం రాత్రి చంద్రబాబు చేరుకున్నారు. మంగళవారం ఉదయం అక్కడి టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు సంక్రాంతి సంస్కృతిని, సంప్రదాయాలను ప్రతిబింబించే ముగ్గులు వేశారు. చంద్రబాబు ఆ ముగ్గులను పరిశీలించి, మహిళలు, యువతులను అభినందించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే చంద్రబాబు నివాసం ఎదుట మైదానంలో పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. సీఎం దంపతులు, మంత్రి లోకేశ్ దంపతులు, ఇతర సన్నిహిత బంధువులు పోటీలను పరిశీలించారు. బ్యాలెన్స్ వాకింగ్, కోడి పందేలు(కత్తిలేని), త్రీ లెగ్ రేస్, గ్లాస్ అండ్ బెలూన్ రన్, పొటాటో గేదరింగ్, గన్నీ బ్యాగ్ రేస్, మ్యూజికల్ చెయిర్స్, లెమన్ అండ్ స్పూన్, టెయిల్ పికింగ్, సెల్ఫ్ డిఫెన్స్ వంటి పోటీలలో చుట్టుపక్కల గ్రామాల స్కూలు విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన వారికి సీఎం దంపతులు బహుమతులు ప్రదానం చేశారు.



ఆటల పోటీలలో దేవాన్ష్

మనవడి ఆటలతో మురిసిన చంద్రబాబు దంపతులు

మంత్రి లోకేశ్ దంపతుల కుమారుడు నారా దేవాన్ష్ ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాడు. నందమూరి బాలకృష్ణ చిన్న కుమార్తె తేజస్విని, ఎంపీ భరత్ దంపతుల కుమారుడు ఆర్యవీర్ కూడా స్కూలు పిల్లలతో కలిసి ఆటలు ఆడాడు. వీరిద్దరూ పోటీలలో పాల్గొనడం చూసి సీఎం దంపతులు మురిసిపోయారు. నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, నందమూరి కుటుంబీకులు, సీఎం సోదరుడి కుమారుడు, సినీ హీరో నారా రోహిత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రారంభోత్సవాలు

సీఎం చంద్రబాబు తన స్వగ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం ప్రారంభోత్సవాలు, భూమిపూజలు చేశారు. నారావారిపల్లె సమీపంలోని మూలపల్లి చెరువును సందర్శించారు. అక్కడ నీవా బ్రాంచి కెనాల్ నుంచి మూలపల్లి చెరువు సహా నాలుగు చెరువుల మీదుగా కల్యాణి డ్యామ్‌కు కృష్ణా జలాలను మళ్లించి పొలాలకు సాగునీటితో పాటు తిరుపతి, తిరుమల తాగునీటి అవసరాలు తీర్చేలా రూ.126 కోట్లతో చేపట్టే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. నారావారిపల్లిలో 30 పడకల నుంచి 50 పడకల స్థాయికి పెంచిన ప్రభుత్వ ఆస్పత్రిని, రూ.4.27 కోట్లతో నిర్మించిన 33-11 కేవీ సెమీ ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను, రూ.1.40 కోట్లతో నిర్మించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ భవనాన్ని, రూ.77 లక్షలతో శేషాచల లింగేశ్వరాలయానికి నిర్మించిన సిమెంట్ రోడ్డును ప్రారంభించారు. అలాగే, తిరుపతి రుయా ఆస్పత్రిలో నిర్మించిన రోగుల సహాయకుల వసతి భవనానికి, ఎస్వీయూలో రూ.7.50 కోట్లతో నిర్మించిన పురుషుల హాస్టల్‌ను, రూ. 5 కోట్లతో నిర్మించిన మహిళల హాస్టల్‌ను కూడా ప్రారంభించారు. రూ.10 లక్షలతో పాడి ఆవులకు వసతి కేంద్రం నిర్మాణానికి, ఎస్వీయూలో రూ.6 కోట్లతో సెంట్రలైజ్డ్ ల్యాబ్ భవన నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు.





అమరావతిలోని రాష్ట్ర సచివాలయం ప్రాంతం మంగళవారం ఇలా బోసిపోయి కనిపించింది. సంక్రాంతి నేపథ్యంలో ఉద్యోగులు, సందర్శకుల హడావుడి కనిపించలేదు.



తెనాలిలో శివలింగం, నంది ఆకారంలో చేసిన లడ్డూ

నంది, శివలింగం రూపంలో లడ్డూ ప్రసాదం

- మహంకాళి అమ్మవారి తిరునాళ్లకు తరలింపు

తెనాలి అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మహంకాళి అమ్మవారి తిరునాళ్లలో అమ్మవారికి సమర్పించే ప్రసాదాన్ని భక్తులు గుంటూరు జిల్లా తెనాలిలో చేయించారు. స్థానిక శశి డెలిషియస్‌లో భారీ శివలింగం, నందీశ్వరుని ఆకృతిలో లడ్డూ ప్రసాదం చేయించడం విశేషం. తాడేపల్లిగూడెంలో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభించి 46 ఏళ్లయిన సందర్భంగా ఈ దఫా 46 కిలోల ప్రసాదం చేయించినట్లు మంగళవారం లడ్డూ ప్రసాదాన్ని తీసుకువెళ్లేందుకు వచ్చిన యువకులు విలేకరులకు తెలిపారు.

కలెక్టర్.. అడ్వెంచర్ స్కైరైడ్!

- భీమవరం సంక్రాంతి సంబరాల్లో ఆటవిడుపు



కాళ్ళ జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో సంప్రదాయ పోటీలతోపాటు పారా మోటార్ ఏరియల్ అడ్వెంచర్ స్కై రైడ్‌ను కూడా ఏర్పాటు చేశారు. పెద అమిరంలో మిత్ర హాస్పిటల్ ఎదురుగా ఉన్న ఖాళీ మైదానంలో ఏపీ అడ్వెంచర్స్ ప్రమోటర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ రైడ్‌ను జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డిలతో కలిసి ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ప్రారంభించారు. తొలుత కలెక్టర్ నాగరాణి సాహసోపేతంగా రైడ్ చేసి స్థానిక నాయకులను, ప్రజలను, యువతను ఉత్సాహపరిచారు.

సీమకు జగన్ సున్నం

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులు చేయడం నిజం! సీమకు జగన్ చేసిందేమిటి, చంద్రబాబు చేసిందేమిటి... ప్రాజెక్టుల వారీగా చూస్తే!

'అనంత' ప్రాజెక్టులు...

2014-19 మధ్య అప్పటి సీఎం చంద్రబాబు అనంతపురం జిల్లాలో కరువు పల్లెలకు హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలు మళ్లించి కరువు శాశ్వతంగా నివారించాలని సంకల్పించారు. రూ.900 కోట్లతో జీడిపల్లి-అప్పర్ పెన్నా ఎత్తిపోతల పథకం, రూ.850 కోట్లతో జీడిపల్లి-భైరవానితిప్ప ఎత్తిపోతల ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 30-35 శాతం పనులు పూర్తి చేశారు. 2019లో ప్రభుత్వం మారడంతో పనులు ఆగిపోయాయి. జగన్ ఈ రెండు ప్రాజెక్టులను ఆపివేశారు. కొత్తగా శ్రీసత్యసాయి జిల్లా(పుట్టపర్తి)లో హంద్రీనీవా నుంచి 195 మైనర్ ఇరిగేషన్ (ఎంఐ) చెరువులు నింపే పనులను రూ.850 కోట్లతో చేపట్టారు. 25 శాతం పనులు చేసినా ఒక్కపైసా కూడా నిధులు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాకే రూ.60 కోట్ల బిల్లులు చెల్లించారు.

కడప ప్రాజెక్టులు...

కడప జిల్లాలో అత్యంత కీలకమైన జలాశయం గండికోట. గాలేరు-నగరి ప్రాజెక్టులో భాగంగా 26.85 టీఎంసీల సామర్థ్యంతో 2004-09 మధ్యలో నిర్మించారు. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద రూ.1.86 లక్షలు ఇచ్చారు. 2014లో అధికారం చేపట్టిన సీఎం చంద్రబాబు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ రూ.6.75 లక్షలకు పెంచారు. గండికోటలో నీటి నిల్వకు అడ్డంకిగా ఉన్న కడప-అనంతపురం వయా తాడిపత్రి రోడ్డును పూర్తిగా అలైన్‌మెంట్ మార్చేసి కొత్త రోడ్డు నిర్మించారు. తొలిసారిగా 12 టీఎంసీలు నిల్వ చేయడంతో పాటు పులివెందులకు కృష్ణా జలాలు అందించారు. జీఎన్ఎస్ఎస్ ఫేజ్-2 పనులు కూడా మొదలు పెట్టారు.

పునాది రాళ్లకే సరి...

సీఎంగా జగన్ బాధ్యతలు చేపట్టాక కడప జిల్లాలో రాయలసీమ దుర్భిక్ష నివారణ మిషన్‌లో భాగంగా గాలేరు నగరి-హంద్రీనీవా లిఫ్ట్ స్కీమ్‌కు రూ.4,373.93 కోట్లు, ఎర్రబల్లి ఎత్తిపోతల పథకానికి రూ.853.63 కోట్లు, కుందూ-టీజీపీ లిఫ్ట్‌కు రూ.419.42 కోట్లు, పులివెందుల బ్రాంచి కెనాల్ (పీబీసీ), సీబీఆర్, జీకేఎల్ఐ కాలువల కింద మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టుకు రూ.1,256 కోట్లు, గండికోట-చిత్రావతి, గండికోట-పైడిపాలెం లిఫ్టుల సామర్థ్యం పెంపునకు రూ.2,601.28 కోట్ల వ్యయంతో.. ఇలా మొత్తం ఏడు ప్రాజెక్టులకు రూ.10,388.23 కోట్లతో శంకుస్థాపన చేశారు. కానీ ఒక్క ప్రాజెక్టు కూడా మొదలు పెట్టలేదు. రాజోలి, జొలదరాశి ప్రాజెక్టుల పరిస్థితీ ఇంతే.

జగన్ హయాంలో

చంద్రబాబు 12 టీఎంసీలు నింపారు.. తాను అంతకంటే ఎక్కువగా నింపాలనే అత్యుత్సాహంతో రాత్రికి రాత్రి తాళ్లప్రొద్దుటూరు గ్రామాన్ని బలవంతంగా ఖాళీ చేయించి 26 టీఎంసీలు నింపారే తప్పా.. ఆ నీటిని వినియోగించుకునే పంట కాలువలు పూర్తి చేయలేదు.

భారతీ సిమెంట్స్‌కు నీళ్లు


సర్వరాయసాగర్, వామికొండ జలాశయాలు గత టీడీపీ ప్రభుత్వంలోనే దాదాపుగా పూర్తయ్యాయి. పంట కాలువలు పూర్తి చేస్తే దాదాపు 45 వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. జగన్ హయాంలో పంట కాలువలు పూర్తి చేయలేదు. కానీ... జగన్‌కు చెందిన భారతీ సిమెంట్స్, ఆయన మేనమామ కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి చేపల చెరువుకు మాత్రమే నీటిని వాడుకుంటున్నారు.



కడప జిల్లా వీఎన్‌పల్లి మండలంలోని గాలేరు-నగరి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన సర్వరాయ సాగర్ జలాశయం

ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు దాకా...

ఏటా వందల టీఎంసీల కృష్ణా వరద జలాలు శ్రీశైలం డ్యామ్ దాటుకొని కడలి పాలవుతున్నాయని.. ఆ నీటిని ఒడిసి పట్టి కరువుసీమకు మళ్లిస్తే కరువు, వలసలు ఉండవని.. ఈ ప్రాంతం సస్యశామలం అవుతుందని మొట్టమొదట తలచిన వ్యక్తి ఎన్టీఆర్. తెలుగు గంగ, హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టులకు రూపకల్పన చేసింది ఆయనే. సీమ ప్రాజెక్టుల విషయంలో మొదటి నుంచి టీడీపీ చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోంది. 2004-2014మధ్యలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సీమ ప్రాజెక్టులు పూర్తి చేయడంలో కృషి చేసిందని నిపుణులు అంటున్నారు. అయితే... గత జగన్ ప్రభుత్వం ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని చెబుతున్నారు. ఉన్న ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకపోగా, కొత్త ప్రాజెక్టులు చేపట్టలేదు.



శ్రీశైలం డ్యామ్ నిర్వహణ

జగన్ ఐదేళ్ల పాలనలో శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణను గాలికొదిలేశారు. ప్రాజెక్టు నిర్వహణ కోసం ఒక్క పైసా కూడా నిధులు ఇవ్వలేదని ఇంజనీర్లు చెబుతున్నారు. దీంతో... డ్యామ్ పరిస్థితి ప్రమాదకరంగా మారింది. అంతకుముందు రాష్ట్ర విభజన తరువాత శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణపై నాడు సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టారు. 2009లో వరదకు దెబ్బతిన్న డ్యామ్ మరమ్మతులకు ప్రతిపాదనలు తయారు చేయించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక శ్రీశైలం డ్యామ్ శాశ్వత మరమ్మతులు, ప్రొటెక్టివ్ స్టీల్ సిలిండర్ల ఏర్పాటుకోసం రూ.203.95 కోట్లు మంజూరు చేశారు. రూ.5.9 కోట్లతో డ్యామ్ ఇరువైపుల కొండ రాళ్లు జారిపడకుండా షాట్‌క్రీటింగ్ పనులు, 2009లో వరదలకు కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం రూ.25.50 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. ప్రొటెక్టివ్ స్టీల్ సిలిండర్ల ఏర్పాటుకు ఇప్పటికే అధ్యయనం చేయించారు. కొత్తవి ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు.

కుప్పానికి కృష్ణా జలాలు..


హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా కుప్పం బ్రాంచి కెనాల్ నిర్మాణానికి రూ.413 కోట్లతో 2015లో నాటి సీఎం చంద్రబాబు అనుమతులు ఇచ్చారు. 2019 నాటికి దాదాపుగా 90-95 శాతం పనులు పూర్తి చేశారు. తరువాత వైసీపీ ప్రభుత్వం రావడంతో పనులు ఆగిపోయాయి. కుప్పం బ్రాంచి కెనాల్ పనుల కోసం ఒక్క పైసా కూడా ఖర్చు చేయలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు తొలిసారిగా పులివెందులకు కృష్ణా జలాలు మళ్లించిన ఘనత సొంతం చేసుకోగా.. కుప్పానికి తాను నీళ్లు ఇచ్చాననే క్రెడిట్ సాధించాలనే ఎత్తులు వేసి అభాసుపాలయ్యారు. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.197 కోట్లతో కుప్పం బ్రాంచి కెనాల్ సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు చేపట్టి యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు.

హంద్రీనీవా విస్తరణ

ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు అందించాలనే లక్ష్యంతో హంద్రీనీవా పథకం చేపట్టారు. 2004 నుంచి పనులు జరుగుతూ....నే ఉన్నాయి. 2014లో సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టాక 2017-18లో రూ.1,030 కోట్లతో కాలువ విస్తరణ పనులు చేపట్టారు. నాలుగు ప్యాకేజీలుగా పనులు చేపట్టి రూ.285.77 కోట్లు ఖర్చు చేశారు. తర్వాత జగన్ వచ్చారు. విస్తరణ పనులు ఆపేశారు. 6,500 క్యూసెక్కులకు విస్తరిస్తామంటూ 2023లో రూ.6,182.19 కోట్లతో టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లకు పనులు అప్పగించినా పైసా కూడా ఖర్చు చేయలేదు. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు రూ.3 వేలకోట్లతో మాల్యాల నుంచి కుప్పం వరకు కాలువ విస్తరణలో భాగంగా మట్టి, సీసీ లైనింగ్ పనులు పూర్తి చేశారు.



జగన్ సర్కారులో కర్నూలు సమీపంలో హంద్రీనీవా కాలువ



కూటమి వచ్చాక విస్తరణ ఇలా..

కర్నూలు ప్రాజెక్టులు

కర్నూలు జిల్లాలో కరువు, వలసలు నివారించాలనే లక్ష్యంతో ఆలూరు, ఆదోని నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాలకు సాగు, 195 గ్రామాలకు తాగునీరు ఇవ్వాలని వేదావతి ఎత్తిపోతల ప్రాజెక్టుకు రూ.1,942.80 కోట్లు.. మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.1,985.42 కోట్లు మంజూరు చేసి టెండర్లు పిలిచారు. పనులు మొదలు పెట్టారు. అలాగే గుండ్రేవుల జలాశయానికి రూ.2,950 కోట్లు కేటాయిస్తూ జీవో ఇచ్చారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఈ పనులన్నింటినీ ఎక్కడికక్కడే ఆ పనులు ఆపేశారు. గంపెడు మట్టి కూడా తీయలేదు. మళ్లీ కూటమి సర్కారు వచ్చాకే రూ.6,581.96 కోట్ల విలువైన వేదావతి, ఆర్డీఎస్ కుడి కాలువ, రాయలసీమ లిఫ్ట్ పనులు కొనసాగించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.



విలేకరులతో మాట్లాడుతున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి

కేసీఆర్, జగన్ మ్యాచ్ ఫిక్సింగ్

- కుటుంబ పత్రికలతో తెలుగు వారి మధ్య చిచ్చు
- ప్రాజెక్టులపై సాక్షిది ఒక మాట, 'నమస్తే'ది మరో మాట
- వైసీపీ, బీఆర్ఎస్‌పై విరుచుకుపడ్డ పట్టాభిరాం

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): "రెండు పత్రికలు.. రెండు కుటుంబాలు.. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలను మోసం చేస్తున్నాయి. జగన్, కేసీఆర్ పత్రికలు రెండు తెలుగు రాష్ట్రాల్లో కుట్రలకు తెరదీస్తున్నాయి" అని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ధ్వజమెత్తారు. తెలుగు రాష్ట్రాలు బాగుండాలని సీఎం చంద్రబాబు కోరుకుంటే.. తెలుగు రాష్ట్రాలు సర్వనాశనం కావాలని వైసీపీ, బీఆర్ఎస్ కోరుకుంటున్నాయని మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "కేసీఆర్, జగన్ కలిసి ఉంటూనే తమ తమ పత్రికల ద్వారా తెలుగు ప్రజల నడుమ విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం, ఇతర ప్రాజెక్టులపై నమస్తే తెలంగాణ, సాక్షి పత్రికలు తప్పుడు కథనాలు ప్రచురిస్తున్నాయి. తెలంగాణ నీటికి చంద్రబాబు అడ్డుపడుతున్నారంటూ నమస్తే తెలంగాణలో రాస్తే... చంద్రబాబు తెలంగాణకు న్యాయం చేస్తున్నారంటూ సాక్షి కథనాలు ప్రచురిస్తోంది. రాయలసీమ లిఫ్టును ఆపింది తామే అని హరీశ్‌రావు చెప్పినట్లు నమస్తే తెలంగాణలో రాస్తే... సీమ లిఫ్టును తానే ఆపించినట్లు రేవంత్‌రెడ్డి అన్నట్లు సాక్షిలో రాస్తారు. నీ రాష్ట్రంలో నీ డ్రామా నీవు ఆడు.. నా రాష్ట్రంలో నా డ్రామా నేను ఆడుతా అంటూ జగన్, కేసీఆర్ మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నారు" అని పట్టాభి పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కేసీఆర్, కేటీఆర్‌లు జగన్‌కు అనుకూలంగా చేసిన వ్యాఖ్యల వీడియో క్లిప్పులు, సాగునీటి ప్రాజెక్టులపై నమస్తే తెలంగాణ, సాక్షి పత్రికల్లో భిన్నంగా వస్తున్న కథనాల క్లిప్పులను పట్టాభి ప్రదర్శించారు. "16 తెలంగాణ ప్రాజెక్టులపై చంద్రబాబు ఫిర్యాదు చేసి అడ్డుకున్నారంటూ నమస్తే తెలంగాణలో కథనం రాశారు. అదే... సాక్షిలో మాత్రం చంద్రబాబు తెలంగాణ ప్రాజెక్టులను అడ్డుకోవడం లేదని రాశారు"అని పట్టాభి ధ్వజమెత్తారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని వైసీపీ హయాంలోనే ఎన్జీటీ ఆపివేసిందని, అప్పుడు జగన్ ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదని ప్రశ్నించారు. రాయలసీమ లిఫ్ట్ పేరుతో పెద్దిరెడ్డి సుమారు వెయ్యి కోట్ల రూపాయలు దోచుకున్నారని, అందుకే మిథున్ రెడ్డి ఆస్తులు అడ్డగోలుగా పెరిగాయని అన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఆస్తులు, ప్యాలెస్‌ల కోసం జగన్ పనిచేస్తున్నారని విమర్శించారు.

జగన్, కేసీఆర్ కుట్ర రాజకీయాలు


- తెలుగు ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నారు: మంత్రి సవిత



తాడేపల్లి ప్యాలెస్ వద్ద జగన్, బీఆర్ఎస్ నేతల కటౌట్ ఫొటోను చూపుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు కేసీఆర్, జగన్ కలిసి కుట్ర రాజకీయాలు చేస్తున్నారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మండిపడ్డారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలోని తన కార్యాలయంలో మంగళవారం ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. సీఎం చంద్రబాబు నాయుడు నదులను అనుసంధానం చేసిన సంగతి తెలుగు రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని అన్నారు. స్వార్థ రాజకీయాల కోసం తెలంగాణ నాయకులు కొన్ని రోజుల నుంచి ఏపీపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. వాటిని అవకాశంగా తీసుకుని చంద్రబాబును రాయలసీమ ద్రోహి అని జగన్ తన సొంత మీడియాలో చిత్రీకరిస్తున్నారని అన్నారు. రాయలసీమ ప్రాజెక్టులను ఆపింది తానే అని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారని, దానిపై జగన్ ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. చేయడం చేతకాక, చేసేవారిపై జగన్ లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సొంత వ్యాపారాల కోసం కేసీఆర్‌తో జగన్ కుమ్మక్కై ఏపీ ప్రాజెక్టులను ఆపారని ఆరోపించారు. తాడేపల్లి ప్యాలెస్ వద్ద కేసీఆర్, కేటీఆర్, జగన్ ఉన్న కటౌట్‌లను ఏర్పాటు చేశారని, దానికి జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అహర్నిశలూ కష్టపడుతున్న సీఎం చంద్రబాబుపై బురదచల్లడం మానుకోవాలని హితవు పలికారు. గత ఎన్నికల్లో జగన్‌కు 11 సీట్లు ఇచ్చారని, వచ్చే ఎన్నికల్లో జీరో ఖాయమని చెప్పారు.

సీమకు జగన్ చరిత్రాత్మక ద్రోహం: సోమిరెడ్డి



కండలేరు జలాశయం వద్ద ప్రసంగిస్తున్న సోమిరెడ్డి.. పక్కన టీడీపీ నేతలు

రాపూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమ ప్రాజెక్టుల విషయంలో గత వైసీపీ పాలనలో జగన్ అత్యంత దారుణమైన, చరిత్రాత్మకమైన ద్రోహం చేశారని మాజీ మంత్రి, టీడీపీ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని కండలేరు జలాశయాన్ని వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్, నెలవల విజయశ్రీ, టీడీపీ నెల్లూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షులు బీద రవిచంద్ర, పనబాక లక్ష్మిలతో కలిసి సోమిరెడ్డి సందర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో వైసీపీ వైఫల్యాలను ఎండగట్టారు. 'జగన్ ముఖ్యమంత్రి కాగానే రాయలసీమలోని 102 సాగునీటి ప్రాజెక్టులను 'ప్రీ-క్లోజర్' పేరుతో ఆపేసి, సీమ గొంతు కోశారు. రాష్ట్రవ్యాప్తంగా రద్దు చేసిన 198 ప్రాజెక్టుల్లో సగానికిపైగా సీమలోనే ఉండడం ఆయనకు ఆ ప్రాంతంపై ఉన్న వివక్షకు నిదర్శనం. సీమ ప్రాజెక్టులకు 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.12,441 కోట్లు ఖర్చు చేస్తే.. 2019-24 మధ్య వైసీపీ హయాంలో రూ.2,011 కోట్లే వ్యయం చేసింది. అన్నిటికీ రివర్స్ టెండరింగ్ అని హోరెత్తించిన జగన్..రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులను మాత్రం అధిక ధరలకు మాజీ మంత్రి పెద్దిరెడ్డి కంపెనీకి అప్పగించారు. ఆ పథకానికి అనుమతులు రాకముందే పనులు ప్రారంభించి, కోర్టులకు తప్పుడు అఫిడవిట్లు ఇవ్వడం వల్లే ఎన్జీటీ ఈ ప్రాజెక్టును అడ్డుకుంది. కాంట్రాక్టర్ల ప్రయోజనాల కోసమే హడావుడి చేసి రూ.990 కోట్ల ప్రజాధనాన్ని బూడిదలో పోశారు. అన్నమయ్య ప్రాజెక్టు నిర్వహణలో విఫలమై 42 మంది ప్రాణాలు కోల్పోవడానికి జగన్ కారణం కాదా? జగన్ కనీసం చూడడానికి రాలేదు' అని దుయ్యబట్టారు.



వద్దనుకున్న ప్రాజెక్టుకే జై!

- కేంద్ర అనుమతుల కోసం 'బనకచర్ల' కొనసాగింపు
- అవి వచ్చాక నల్లమలసాగర్‌కే పరిమితం
- ఇప్పటికే బనకచర్ల పీఎఫ్ఆర్ జలసంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్
- అదే అలైన్‌మెంట్‌తో నల్లమలసాగర్ రిపోర్టును మళ్లీ అప్‌లోడ్ చేస్తే తిరస్కరణ తప్పదు
- కేంద్ర ఆమోదం పొందేందుకు కసరత్తు

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకున్నా.. సాంకేతిక ప్రతిబంధకాల దృష్ట్యా దానిని కొనసాగించాల్సిన పరిస్థితి తలెత్తింది. పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టు కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) రూపకల్పన టెండర్‌ను ఐబీసీ-శ్రీరామ కన్‌స్ట్రక్షన్స్ కన్సార్టియం ఇప్పటికే దక్కించుకుంది. సాధారణంగా డీపీఆర్ తయారయ్యాక కేంద్ర వెబ్‌సైట్‌లో ఆ సమాచారాన్ని అప్‌లోడ్ చేయాలి. ఇప్పటికే పోలవరం-బనకచర్ల పథకం ముందస్తు సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్)ను దాదాపు అదే అలైన్‌మెంట్‌తో కేంద్ర వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. కేంద్ర జలశక్తి శాఖకు, కేంద్ర జల సంఘానికి, కేంద్ర అటవీ పర్యావరణ శాఖలకు పంపారు. ఇవి సాంకేతిక-ఆర్థిక సాధ్యాసాధ్యాల నివేదిక (టెక్నో-ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్టు-టీఈఎఫ్ఆర్) ఇస్తాయి. సాంకేతికంగా ఒకసారి అలైన్‌మెంట్‌తో పీఎఫ్ఆర్ లేదా డీపీఆర్‌ను అప్‌లోడ్ చేస్తే.. అదే అలైన్‌మెంట్‌తో కొత్తగా మరో డీపీఆర్‌ను సాఫ్ట్‌వేర్ ఆమోదించదు. తిరస్కరిస్తుంది. రాష్ట్ర జల వనరుల శాఖ ఈ సాంకేతిక అవరోధాన్ని గుర్తించింది. దీనిని అధిగమించాలంటే ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ సంస్థలకు సమర్పించిన పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం పీఎఫ్ఆర్‌ను ఆమోదింపజేసుకోవడమే ఉత్తమమన్న నిర్ణయానికి వచ్చింది. పోలవరం-నల్లమలసాగర్ పథకాన్ని మూడు దశల్లో చేపట్టేందుకు రూ.58,700 కోట్లు ఖర్చవుతుంది. అదే పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకానికి రూ.81900 కోట్లు వ్యయమవుతుంది. ఇప్పటికే బనకచర్ల పథకాన్ని ఆమోదించాలని సీఎం చంద్రబాబు పలుసార్లు ప్రధాని మోదీకి, కేంద్ర ఆర్థిక, జలశక్తి మంత్రులు నిర్మలా సీతారామన్, సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర అభ్యంతరాలతో ఈ పథకాన్ని రాష్ట్రప్రభుత్వం ఉపసంహరించుకుంది. దాని బదులు పోలవరం-నల్లమలసాగర్‌ను రూ.58,700 కోట్ల అంచనాతో చేపట్టాలని నిర్ణయించింది. ఇప్పుడు బనకచర్ల అనుసంధాన పథకం ఆమోదం పొందాక.. నల్లమలసాగర్ వరకే ప్రాజెక్టును చేపడుతున్నట్లుగా అనుమతులు పొందాలని జల వనరుల శాఖ నిర్ణయించింది. కడలిపాలయ్యే వరద జలాలను రోజుకు రెండు టీఎంసీల చొప్పున 100 రోజుల్లో 200 టీఎంసీలను నల్లమలసాగర్‌కు తరలించాలన్నది ఈ పథకం ముఖ్యోద్దేశం.

పాతాళగంగ పైపైకి!

(మొదటి పేజీ తరువాయి)

నదులు, చెరువులు, వాగుల్లో నీటి లభ్యత ఉందని, దీంతో భూగర్భజలాలు ఆశాజనంగా ఉన్నాయని రిటైర్డు వాతావరణ అధికారి పీవీ రామారావు అన్నారు. సాధారణంగా 3 నుంచి 8మీటర్ల వరకు భూగర్భ జలాలు ఉంటే పంపుసెట్ల ద్వారా నీటిని తోడటంలో ఎటువంటి ఒత్తిడి ఉండదని, అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో అంతకంటే పైకి ఉన్నాయని తెలిపారు. గతేడాది జనవరి 1 నుంచి డిసెంబరు 31వ తేదీ వరకు కురిసిన వర్షాలు, భూగర్భజలాలు పెరిగిన తీరుపై ఆయన విశ్లేషించారు. తెలంగాణలో సాధారణ వర్షపాతం 85.9 సెంటీమీటర్లకుగాను 113.8 సెంటీమీటర్లు (సాధారణం కంటే 32% ఎక్కువ), రాయలసీమలో 64.5 సెం.మీ.కు 78 సెం.మీ.(21% ఎక్కువ), కోస్తాంధ్రలో 92.4 సెం.మీ.కు గాను 98.2 సెం.మీ. (6% ఎక్కువ) వర్షపాతం నమోదైంది. దీనివల్ల భూగర్భ జల మట్టాలు పెరగడంతో రబీలో వ్యవసాయ అవసరాలు, వేసవిలో తాగునీటి అవసరాలకు తగినంత నీరు అందుబాటులో ఉండనుంది. ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో కోస్తాంధ్రలో 32.3 సెం.మీ. కుగాను 39.5 సెం.మీ., రాయలసీమలో 23.6 సెం.మీ.కు గాను 31.5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. తెలంగాణలో 12.4 సెం.మీ.కు గాను 17.9 సెం.మీ. నమోదైంది. అయితే ఈ సీజన్‌లో తుఫాన్ల ప్రభావంతో వర్షాలు ఎక్కువగా కురిశాయి. మొంథా తుఫాన్‌తో కోస్తా, రాయలసీమలో పుష్కలంగా వర్షాలు కురిశాయి. అక్టోబరు 28న రికార్డుస్థాయిలో 16 సెంటీమీటర్లు, ప్రకాశం జిల్లాల్లో సగటున 15, నెల్లూరులో 13, కోస్తాంధ్ర మొత్తం 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఒంగోలులో అక్టోబరు 29న 25 సెం.మీ.ల వర్షం పడింది. తెలంగాణలోని వరంగల్ రూరల్‌లో 20, హనుమకొండలో 19, కరీంనగర్‌లో 18 సెంటీమీటర్లు వర్షం కురిసింది. దిత్వా తుఫాన్ కారణంగా తిరుపతిలో 12.2 సెం.మీ., నెల్లూరులో 9.3 సెం.మీ. వర్షపాతం నమోదైంది. డిసెంబరు 10 తరువాత ఏపీలో వర్షాలు కురవలేదు.

ఉభయ గోదావరి జిల్లాల్లో ఆందోళనకరం

జూన్ నుంచి సెప్టెంబరు వరకు నైరుతి రుతుపవనాల సీజన్‌లో తెలంగాణలో 95.9 సెంటీమీటర్లు (సాధారణం కంటే 30% ఎక్కువ), కోస్తాంధ్రలో 58.7 సెం.మీ.(2శాతం ఎక్కువ), రాయలసీమలో 46.6 సెం.మీ.లు (14 3% ఎక్కువ) వర్షపాతం నమోదైంది. రెండు రుతుపవనాల సీజన్లు, అక్టోబరు, నవంబరు నెలల్లో తుఫాన్ల ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో భూగర్భజల మట్టాలు కోస్తాంధ్రలో 1.2 మీటర్లు (3.94 అడుగులు), రాయలసీమలో 2.47 మీటర్లు (8.1 అడుగులు) మేర పైకి వచ్చాయి. డిసెంబరు 1 నాటికి తూర్పుగోదావరి జిల్లాలో 18.62 మీటర్లు (61.07 అడుగులు), ఏలూరు జిల్లాలో 16.23 మీటర్లు(53.23 అడుగులు), పశ్చిమగోదావరి జిల్లాలో 7.44 మీటర్లు (24.4 అడుగులు) లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. ఈ మూడు జిల్లాల్లో భూగర్భజలాలు లోతుగా ఉండడం ఆందోళనకరంగా మారింది. అయితే మిగిలిన జిల్లాల్లో సంతృప్తికరంగా ఉండటంతో కోస్తాంధ్రలో సగటున 3 నుంచి 6 మీటర్ల లోతులో ఉన్నాయి. అక్టోబరులో కురిసిన వర్షాలతో ఒంగోలులో భూగర్భజలాలు ఏకంగా 18 అడుగులు పైకి వచ్చాయి. రాయలసీమ పరిధిలోని తిరుపతిలో 3.12 మీటర్లు (10.56 అడుగులు), నంద్యాలలో 3.91 మీటర్లలో (12.82 అడుగులు) ఉండగా, ఎక్కువ లోతులో సత్యసాయి జిల్లాలో 10.68 మీటర్లు (35.03 అడుగులు), అనంతలో 9.36 మీటర్ల (36.70 అడుగులు) వరకూ ఉన్నాయి. మిగిలిన జిల్లాల్లో 4.5-6.7 మీటర్ల (15-22 అడుగులు) లోతులో ఉన్నాయి. తెలంగాణలో ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో 2.89 మీటర్లు (9.48 అడుగులు), భూపాలపల్లెలో 8.42 మీటర్లు (27.62 అడుగులు) ఉన్నాయి. తెలంగాణలో 33 జిల్లాలకు గాను 17 జిల్లాల్లో సగటున 5మీటర్లు (16.40 అడుగులు), మిగిలిన 16 జిల్లాల్లో 5 నుంచి 10 మీటర్లు (15.9 నుంచి 33 అడుగులు) లోతులో భూగర్భజలాలు ఉన్నాయని రామారావు తెలిపారు. గతేడాది వేసవిలో ఎక్కువగా వర్షాలు కురిశాయని, ఆతరువాత రెండు రుతుపవనాల సీజన్లలో మిగులు వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు పైకి వచ్చాయని.. దానివల్ల ఈ ఏడాది వేసవిలో భూగర్భ జలాలకు కొరత ఉండదని ఆయన పేర్కొన్నారు. రాయలసీమలోసైతం గత రెండేళ్లలో మంచి వర్షాలు కురవడంతో భూగర్భజలాలు మెరుగుపడ్డాయని విశ్లేషించారు.

రొమ్ము, ప్రొస్టేట్ క్యాన్సర్‌కు కొత్త ఔషధం!

- ఏయూ కెమిస్ట్రీ విభాగం పరిశోధకుల అభివృద్ధి
- మూడేళ్ల కృషికి దక్కిన పేటెంట్ ఫలితం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అతిపెద్ద సమస్యల్లో క్యాన్సర్ ఒకటి..! భారత్‌లోనూ కొన్నేళ్లుగా రొమ్ము, ప్రొస్టేట్ క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయి. బాధితులకు మందులు, శస్త్రచికిత్సలు, కీమో వంటి విధానాల్లో చికిత్స అందిస్తున్నా ఫలితం అంతంత మాత్రంగానే ఉంటోంది..! అయితే రొమ్ము, ప్రొస్టేట్ క్యాన్సర్‌పై దివ్యౌషధంలా పనిచేసే మెడిసిన్‌ను ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కెమిస్ట్రీ విభాగానికి చెందిన పరిశోధక బృందం అభివృద్ధి చేసింది. మూడేళ్లపాటు శ్రమించి వారు తయారుచేసిన ఈ ఔషధం క్యాన్సర్‌పై సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఉందని గుర్తించిన కేంద్ర ప్రభుత్వానికి చెందిన పేటెంట్ ఆఫీస్ కొద్దిరోజుల క్రితమే దానికి పేటెంట్‌ను అందించింది. దీంతో ఈ మెడిసిన్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు మార్గం సుగమమైంది. ఇంజనీరింగ్ కెమిస్ట్రీ విభాగాధిపతి, వర్సిటీ ఐపీఆర్ చైర్, ఆర్ అండ్ ప్రాజెక్టు హెడ్ ప్రొఫెసర్ బి.కిశోర్‌బాబు, పరిశోధక విద్యార్థి భీశెట్టి వెంకట శివ అప్పారావు ఈ పరిశోధన సాగించారు. కో-గైడ్‌గా ప్రొఫెసర్ స్వర్ణలత వ్యవహరించగా, వీర్రాజు, గోపి సహకారం అందించారు. ఈ పరిశోధనలో భాగంగా నాప్తాలిమైడ్ డెరివేటివ్ సమ్మేళనంతో కూడిన ఔషదాన్ని వారు తయారు చేశారు. దీనికి నాప్తాలిమైడ్ డెరివేటివ్‌గా నామకరణం చేశారు. పరిశోధనల్లో భాగంగా ఈ మందుని పలు రకాల క్యాన్సర్ కణాలపై పరీక్షించగా... రొమ్ము, ప్రొస్టేట్ క్యాన్సర్‌కు కారణమవుతున్న కణాలపై సమర్థంగా పనిచేసినట్టు తేల్చారు.

తదుపరి దశకు తీసుకువెళ్లేలా..

ఏయూ పరిశోధక బృందం చేసిన ఈ ఆవిష్కరణకు 20 ఏళ్ల కాలానికి పేటెంట్ దక్కింది. ఈ పేటెంట్ కాలంలో మందు తయారీపై హక్కులు పరిశోధకులకు దక్కనున్నాయి. అయితే ఈ ఔషధంలోని సామర్థ్యాన్ని గుర్తించిన విశాఖ నగరానికి చెందిన ఒకప్రముఖ క్యాన్సర్ ఆస్పత్రి వీరితో ఎంవోయూ చేసుకుంది. కొద్ది రోజుల్లోనే అన్ని అనుమతులతో జంతువులు,మనుషులపై ట్రయల్స్ నిర్వహణకు సిద్ధమవుతున్నట్టు ప్రొఫెసర్ బి.కిశోర్‌బాబు తెలిపారు.

మార్షల్ ఆర్ట్స్‌లో మీ విజయం స్ఫూర్తిదాయకం

- డిప్యూటీ సీఎంకు ప్రధాని మోదీ లేఖ

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): జపనీస్ కత్తిసాము కళ కెంజుట్సులో అధికారిక ప్రవేశం పొందడం ద్వారా అరుదైన ఘనత సాధించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఈ మేరకు ప్రధాని మోదీ ప్రత్యేక లేఖ ద్వారా తన సందేశాన్ని సోమవారం సాయంత్రం పవన్‌కు పంపించారు. 'జపనీస్ మార్షల్ ఆర్ట్స్ రంగంలో మీరు సాధించిన విజయాలను తెలుసుకున్నా. ఇటు ప్రజా జీవితంలో, అటు సినిమా కెరీర్‌లో బిజీగా ఉంటూనే క్రమశిక్షణతో, నిజాయితీతో మార్షల్ ఆర్ట్స్ అభ్యసించడం ప్రశంసనీయం. మార్షల్ ఆర్ట్స్‌లో దశాబ్దాల పాటు అంకిత భావంతో మీరు చేసిన సాధన స్ఫూర్తిదాయకం. మీ విజయం ద్వారా వృత్తిపరమైన బాధ్యతలు కొత్తవిషయాలు నేర్చుకునేందుకు అడ్డంకి కాదన్న బలమైన సందేశాన్ని యువతరానికి ఇచ్చారు. ఫిట్ ఇండియా లాంటి కార్యక్రమాలకు మీలాంటి వ్యక్తులు స్ఫూర్తినివ్వాల్సిన అవసరం ఉంది. ఫిట్నెస్ పట్ల మీకున్న క్రమశిక్షణ ఎంతో మందికి ప్రేరణ ఇస్తుంది. మీరు సాధించిన ఈ విజయానికి మరోసారి అభినందనలు" అని మోదీ తన లేఖలో పేర్కొన్నారు. ఆయనకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ ప్రత్యుత్తరం పంపించారు.

వాహనాలపై రహదారి భద్రతా సెస్

(మొదటి పేజీ తరువాయి)



సోమవారం ఆయన ఆమోదం తెలిపారు. ఈ నేపథ్యంలో న్యాయశాఖ మంగళవారం ఆర్డినెన్స్ జారీ చేసింది. దీంతో లైఫ్ ట్యాక్స్ చెల్లించే వాహనాలు ఇకపై అదనంగా 10 శాతం రహదారి భద్రతా సెస్సును చెల్లించాల్సి ఉంటుంది. వాహనాల కొనుగోలు దారులు ఆయా వాహనాల ధరపై కనిష్ఠంగా 9 శాతం నుంచి గరిష్ఠంగా 18 శాతం జీవితకాల పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పుడు లైఫ్ ట్యాక్స్‌పై 10 శాతం సెస్సుగా చెల్లించాలి. ఉదాహరణకు రూ.లక్షకు పైగా ఖరీదైన బైకు కొనుగోలు చేసే వారు 12 శాతం లైఫ్ ట్యాక్స్(రూ.12 వేలు)తో పాటు అదనంగా రూ.1200 సెస్ చెల్లించాల్సి ఉంటుంది. అదేవిధంగా రూ.25 లక్షల ఖరీదైన కారు కొనుగోలు చేసే వారు 18శాతం లైఫ్ ట్యాక్స్(రూ.4.50 లక్షలు)తో పాటు మరో రూ.45 వేలు అదనంగా చెల్లించాలి. ఈ విషయమై ఇటీవల రవాణా శాఖ వివరణ ఇస్తూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణల్లో భాగంగా 28శాతం జీఎస్టీని 18శాతానికి తగ్గించిందని.. రోడ్డు భద్రత కోసం విధిస్తున్న సెస్ చాలా చిన్న మొత్తమేనని తెలిపింది. కాగా, రాష్ట్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతుండటంతో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఈ క్రమంలో వాహనాల జీవితకాల పన్నుపై అదనంగా వసూలు చేసే 10 శాతం సెస్సును రహదారి భద్రతను పటిష్ఠపరిచేందుకు వినియోగించనుంది. ఈ నిధులతో రహదారుల మరమ్మతులు, బ్లాక్ స్పాట్స్ తొలగింపు, సిగ్నలింగ్ వ్యవస్థ బలోపేతం చేస్తారు.

ఇక.. స్వర్ణ గ్రామం.. స్వర్ణ వార్డు!

- ఆర్డినెన్సు జారీచేసిన గవర్నర్ నజీర్
- మారనున్న సచివాలయాల ముఖచిత్రం
- ప్రజలకు మరింత పారదర్శక సేవలు

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు స్వర్ణగ్రామం, స్వర్ణవార్డుగా మారాయి. ఈ మేరకు రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఆర్డినెన్సు జారీ చేశారు. ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల చట్టం-2023ను సవరిస్తూ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను ఆయన ఆమోదించారు. డిసెంబరు 30న జరిగిన మంత్రి వర్గ సమావేశంలో చట్ట సవరణ ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. స్వర్ణాంధ్ర లక్ష్యసాధనలో గ్రామ, వార్డు సచివాలయాలు కీలకపాత్ర పోషిస్తాయని, దానికి అనుగుణంగా కార్యనిర్వాహకుల పాత్రలు, బాధ్యతలను సవరించాల్సిన అవసరం ఉందని, ఈ నేపథ్యంలోనే గ్రామ, వార్డు సచివాలయాల పేర్లు మార్చాలని మంత్రి మండలి అభిప్రాయపడింది. ఈ ఆర్డినెన్సు ప్రకారం జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖ పేరును ఇక నుంచి స్వర్ణగ్రామం, స్వర్ణవార్డు శాఖగా పిలుస్తారు. అన్ని ప్రభుత్వ



కార్యాలయాల బోర్డులు, అధికారిక లెటర్ హెడ్లను తక్షణమే ఈ కొత్త పేర్లకు అనుగుణంగా మార్చాలని ప్రభుత్వం ఇటీవల మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలను ఆదేశించింది. సంస్కరణల్లో భాగంగా సచివాలయ వ్యవస్థకు సరికొత్త గుర్తింపు తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ మార్పు కేవలం పేరుకే పరిమితం కాకుండా, ప్రజలకు మరింత పారదర్శకంగా సేవలు అందించడమే ఉద్దేశమని సీఎం చంద్రబాబు తెలిపారు.

ఏపీ ఉద్యోగులకు నిమ్స్ సేవలు పునరుద్ధరించండి

- తెలంగాణ ప్రభుత్వానికి ఏపీ సర్కారు లేఖ

హైదరాబాద్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని నిమ్స్‌లో తమ ప్రభుత్వోద్యోగులు, పెన్షనర్లకు వైద్య సేవలందేలా చూడాలని తెలంగాణ ప్రభుత్వానికి ఏపీ సర్కారు మరోమారు లేఖ రాసింది. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగుల ఆరోగ్య పథకం, డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ కింద నిమ్స్ ఆస్పత్రిని ఎం-ప్యానల్‌మెంట్ చేయాలని తెలంగాణ ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శికి ఏపీ ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ రిమైండర్ పంపారు. ఇంతకుముందు గతేడాది ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో తాము పంపిన లేఖలకు తెలంగాణ నుంచి ఎటువంటి స్పందన లేదని ఈ లేఖలో ప్రస్తావించారు. హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లో జీవిస్తూ.. అత్యవసర/ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలకు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్న ఏపీ పెన్షనర్లు, ప్రభుత్వోద్యోగులు.. నిమ్స్‌లో చికిత్సకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారన్నారు. మరోవైపు, 'మేమంతా హైదరాబాద్ వాసులమే. నిమ్స్‌లో ఏపీ సర్కారు ఉద్యోగులు, పెన్షనర్లకు చికిత్స పొందే అవకాశం కల్పించాలి. ఏపీ ప్రభుత్వ లేఖపై తెలంగాణ సర్కారు సానుకూలంగా స్పందించాలి' అని అసోసియేషన్ ఫర్ ఏపీ పెన్షనర్స్ సెటిల్డ్ ఎట్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి టీఎంబీ బుచ్చిరాజు విజ్ఞప్తి చేశారు.

డిఫెన్స్ ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహకాలు

- 2025-30 మార్గదర్శకాలు విడుదల

అమరావతి జనవరి 13(ఆంధ్రజ్యోతి): డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలకు అవసరమయ్యే పరికరాలు, యంత్ర సామగ్రి, మోటార్లను ఉత్పత్తి చేసే రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ(ఎంఎస్ఎంఈ)లకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రోత్సాహకాలను ప్రకటించింది. 2025-30 సంవత్సరాలకుగాను ఆ ప్రోత్సాహకాలను అందించే మార్గదర్శకాలను పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్.యువరాజ్ మంగళవారం విడుదల చేశారు. ఈ మార్గదర్శకాల మేరకు ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పరిశ్రమలు, క్లస్టర్లు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ), మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్ (ఎంఆర్ఓ), డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ అండర్‌టేకింగ్ (డీపీఎస్‌యూ), సివిల్ ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చర్లు, సప్లయర్స్, మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ (ఎంఓడీ) రంగాలకు ప్రోత్సాహకాలను అందిస్తారు. కనిష్ఠంగా రూ. 30 కోట్ల మేర సింగిల్ పర్చేజ్ ఆర్డర్లకు ప్రోత్సాహకాలను ఇస్తారు. ఎంఎస్ఎంఈలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసే ప్రదర్శనల్లో తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు వీలుగా విమాన, రైలు, ప్రయాణాలు, వీసా చార్జీల్లోనూ రాయితీ ఇస్తారు.

వివేకా హత్య కేసులో.. మళ్లీ సుప్రీంకు సునీత

- పాక్షిక దర్యాప్తునకు ట్రయల్ కోర్టు ఆదేశాలపై సవాల్

న్యూఢిల్లీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ తదుపరి దర్యాప్తుపై ఆయన కుమార్తె నర్రెడ్డి సునీత మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో మరింత లోతుగా సీబీఐ దర్యాప్తు జరపాలని కోరితే.. ట్రయల్ (సీబీఐ) కోర్టు పరిమితంగా, పాక్షికంగా మాత్రమే విచారించడానికి అనుమతి ఇచ్చిందని తెలిపారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా ట్రయల్ కోర్టు విచారణ జరపలేదని, కేవలం ఇద్దరి పాత్రపైనే విచారణ జరపాలని పాక్షిక ఆదేశాలిచ్చిందని పేర్కొన్నారు. హత్యలో అసలు సూత్రధారుల పాత్ర బయటకు రావాలంటే పూర్తిస్థాయి దర్యాప్తు అవసరమని తెలిపారు. ఆమె దరఖాస్తును విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు, దీంతోపాటు, పెండింగ్ పిటిషన్లపై విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది.

రవాణాకు ప్రధాన నోడల్ వ్యవస్థగా ఏపీ లింక్

- నాలుగు సంస్థలకు అపెక్స్ కంపెనీగా వ్యవహారం
- 2047 నాటికి 450 బిలియన్ డాలర్ల ఎగుమతులే లక్ష్యం

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రవాణా రంగానికి ప్రధాన నోడల్ వ్యవస్థగా రాష్ట్ర లాజిస్టిక్స్ ఇన్‌ఫ్రా కార్పొరేషన్ (ఏపీ లింక్)ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర మౌలిక సదుపాయాల కల్పనా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ (ఏపీఆర్‌డీసీ), రాష్ట్ర మారిటైమ్‌బోర్డు (ఏపీఎంబీ), రాష్ట్ర ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ అథారిటీ (ఏపీఏడీసీఎల్), రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (ఏపీఎస్‌డబ్ల్యూసీ)లకు అపెక్స్ కంపెనీగా ఏపీ లింక్ (ఏపీఎల్ఐఎన్‌సీ) వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. దీని ప్రకారం.. 2047 నాటికి 450 బిలియన్ డాలర్ల ఎగుమతులు ఏపీ లింక్ లక్ష్యం. జీఎస్‌డీపీలో ఏటా 2.4 ట్రిలియన్ డాలర్లు సాధించేలా, అదే విధంగా తలసరి ఆదాయం ఏటా 42,000 డాలర్లకు చేరుకునేలా వ్యాపార కార్యకలాపాలను చేపట్టాలి. ఈ సంస్థ పెట్టుబడులను రాష్ట్ర లాజిస్టిక్ రంగంలో పెడుతుంది. రవాణా రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు సహకారం అందిస్తుంది. ఈ సంస్థ నిర్వహణకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేస్తారు. పోర్టులు, రోడ్లు, రైలు కనెక్టివిటీతో ఏపీ లింక్ అనుసంధానం అవుతుంది. లాజిస్టిక్ పార్కులు, ఇండస్ట్రియల్ క్లస్టర్లు, మల్టీమోడల్ హబ్‌లను సంస్థ నిర్వహిస్తుంది. సీపోర్టు, ఎయిర్‌పోర్టు ఆధారిత పరిశ్రమలకు ప్రోత్సాహాన్ని ఇస్తుంది.

ఈ-ఆఫీస్‌లోనే ఫైల్స్: ఆరోగ్యశాఖ కమిషనర్

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఈ-ఆఫీస్ విధానంలో అధికారిక కార్యకలాపాలు నిర్వహించని డీఎంహెచ్‌వోలు, వైద్యులు, అధికారులపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ హెచ్చరించారు. జిల్లాల్లోని ఆరోగ్యశాఖ అధికారులతో మంగళవారం ఆయన వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. పీహెచ్‌సీల నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయం, ఆర్జేడీ కార్యాలయాల వరకూ అధికారిక ఉత్తరప్రత్యుత్తరాలు, సిబ్బంది సర్వీస్ వ్యవహారాలు, అనుమతులు తదితర అంశాలపై ఈ-ఆఫీస్ విధానంలోనే కార్యకలాపాలు కొనసాగాలన్నారు. లేదంటే బాధ్యులను సస్పెండ్ చేస్తామన్నారు. తప్పని పరిస్థితుల్లో కోర్టు కేసుల వ్యవహారాలు, బ్యాంకు చెక్కుల వరకు మాత్రమే ఫిజికల్ ఫైల్స్ ఉండాలని చెప్పారు. ఈ-ఆఫీస్ విధానం ఈనెల 7వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిందని, ప్రభుత్వాస్పత్రుల్లో రోగుల వివరాలు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డుల్లోనే నమోదు కావాలని స్పష్టం చేశారు. మరోవైపు జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా విడుదలైన నిధులను అవసరాలు, ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి వెంటనే ఖర్చు చేయాలన్నారు. అర్హులైన ఉద్యోగులు, అధికారులకు వెంటనే పదోన్నతులు ఇవ్వాలని, జాప్యం చేస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీహెచ్‌సీల్లో ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టాఫ్‌నర్సుల ఖాళీల భర్తీకి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

- 5వ తరగతి, ఇంటర్‌లో చేరికకు దరఖాస్తుల ఆహ్వానం

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ప్రవేశాలకు సాంఘిక సంక్షేమ శాఖ సిద్ధమైంది. ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్స్ కార్యదర్శి ప్రసన్న వెంకటేష్ మంగళవారం ఆ నోటిఫికేషన్‌ను జారీ చేశారు. గురుకులాల్లో ఐదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు అవకాశం కల్పిస్తున్నామని, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ ఖాళీగా ఉన్న సీట్లలో కూడా ప్రవేశాలు ఇస్తామని తెలిపారు. అర్హత కలిగిన బాలబాలికలు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. గురుకులాల్లో చదివే విద్యార్థుల కోసం విజయవాడ కేంద్రంగా నీట్ కోచింగ్ కూడా ప్రారంభించామన్నారు.

తిరిగిరాని లోకాలకు మన రాజకుమారి

- రాణి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్ కన్నుమూత
- ప్రసిద్ధ కవి గుంటూరు శేషేంద్ర జీవన సహచరి
- దక్షిణాదిలోనే ఒకనాటి సంపన్న కుటుంబాల్లో ధన్‌రాజ్‌గిర్ ఒకటి
- నిజాం కుటుంబంతో ఆత్మీయ బంధం
- 1973లో నోబెల్ పురస్కారానికి నామినేట్
- నేడు హైదరాబాద్‌లో అంత్యక్రియలు

హైదరాబాద్ సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలోనే అత్యంత సంపన్న కుటుంబాల్లో ఒకరైన ధన్‌రాజ్‌గిర్ వారసురాలు, ప్రఖ్యాత హిందీ, ఆంగ్ల కవయిత్రి, ప్రసిద్ధ కవి గుంటూరు శేషేంద్ర శర్మ జీవన సహచరి రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్ (96) ఇకలేరు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు జ్ఞాన్ బాగ్ ప్యాలస్‌లో తుదిశ్వాస విడిచారు. 1930, ఆగస్టు17న నిజాం సంస్థాన సలహాదారుడు రాజా ధన్‌రాజ్‌గిర్, రాణి ప్రమీలా దేవిలకు ముంబైలో ఇందిరా దేవి జన్మించారు.చిన్నతనంలోనే హైదరాబాద్‌కు వచ్చారు. ఇక్కడే మెహబూబియా బాలికల పాఠశాలలో హైస్కూల్ విద్య అభ్యసించారు. అనంతరం ఆమె ఇల్లు జ్ఞాన్ బాగ్ ప్యాలెస్సే ఆమె విద్యాలయంగా మారింది. ఇక్బాల్ ప్రేరణతో చిన్న వయసులోనే సాహిత్యాభిమానిగా మారారు. తొమ్మిదో ఏటనే రచనలు రాయడం ప్రారంభించారు. ముంబై, పూణె, ఊటీ, హైదరాబాద్ నగరాల్లో వీరికి రాజ ఠీవిని ప్రతిబింబించే అందమైన ప్యాలెస్‌లున్నాయి. హైదరాబాద్ వారసత్వ కట్టడాల్లో ఒకటైన జ్ఞాన్ బాగ్ ప్యాలెస్ వీరి పూర్వీకులు యూరోపియన్ శైలిలో 1890లో నిర్మించారు. తండ్రి రాజా ధన్ రాజ్‌గిర్ సాహిత్యాభిమాని కావడంతో బాల్యం నుంచి ఆంగ్ల, హిందీ, ఉర్దూ, మరాఠా సాహితీవేత్తలతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఇది ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది. ఉర్దూలో ఆమె ద్విపదులు రాశారు. "ది అపోస్టల్ " పేరుతో తొలి కవితా సంపుటి వెలువడింది. రిటర్న్ ఎటర్నిటీ, పోయెమ్స్ ఆఫ్ మై నేషనల్ మెమోరీ, విండ్ బ్లోస్ ఫ్రమ్ స్కాఫోల్డ్ తదితర 12 పుస్తకాలు ఇందిరా దేవి రాశారు. తన కుటుంబ వారసత్వ చరిత్రను "మెమోరీస్ ఆఫ్ ది దక్కన్ " పేరుతో కాఫీటేబుల్ బుక్ గా ప్రచురించారు. వరల్డ్ పోయెట్రీ సొసైటీ ఇంటర్ కాంటినెంటల్ సంస్థ 1973లో ఇందిరా దేవిని నోబెల్ సాహిత్య పురస్కారానికి నామినేట్ చేసింది. ఇలాంటి అరుదైన గౌరవం పొందిన తొలి భారతీయ కవయిత్రి ఇందిరాదేవి కావడం విశేషం. ఆమె రాసిన కొన్ని ఆంగ్ల కవితలను ప్రముఖ కవి ముగ్ధుమ్ ఉర్ధూ లోకి అనువదించారు.



శేషేంద్రతో వివాహం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీకి మొట్టమొదటి అధ్యక్షురాలిగా ఇందిరాదేవి బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె చిత్రకారిణి కూడా. ముంబైలో ఎం.ఎఫ్ హుస్సేన్ సారథ్యంలో ఇందిర గీసిన చిత్రాలతో 1970వ దశకంలో ప్రదర్శన నిర్వహించారు. శేషేంద్ర శర్మతో వివాహానంతరం కవిత్వ రచనకు విరమణ ప్రకటించారు. 'ఒకే ఇంట్లో ఇద్దరు కవులు ఉండకూడదు' అన్నది ఆమె అభిప్రాయం. శేషేంద్ర వల్ల తెలుగు సాహితీ సమాజంతో ఇందిరకు పరిచయం ఏర్పడింది. శేషేంద్ర రాసిన పది వేల ఉత్తరాలతో నాచారంలో ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు. అందులో నాలుగు వేల పోస్టు కార్డులు ఉండడం విశేషం. గుంటూరు శేషేంద్ర శర్మ రచనలపై ఆయన సంతతికి, ఇందిరాదేవి మధ్య వివాదం నడిచింది. న్యాయపోరాటంలో ఆమెకు ప్రతికూలంగా ఫలితం వచ్చింది.



మహాకవి శ్రీశ్రీ అరెస్టు సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వెంగళరావుకు ఫోన్ చేసి విడుదల చేయాల్సిందిగా ఇందిర కోరినట్లు ఓ సందర్భంలో 'ఆంధ్రజ్యోతి నవ్య'తో ఆమె చెప్పారు. జాతీయ ఉర్దూ కవులతో పాటు కవి సమ్రాట్ విశ్వనాథతోనూ ఆత్మీయానుబంధం ఉంది. నిజాం సంస్థానంలో రెండుసార్లు ప్రధానిగా పని చేసిన మహా రాజా కిషన్ ప్రసాద్‌తో ఇందిర క్యారమ్స్ ఆడారు. మౌంట్ బాటెన్, సర్దార్ జఫ్రీ, ఖైఫీ అజ్మీ వంటి వారితో మంచి పరిచయం ఉండేది. ఏడో నిజాంతోనూ సంభాషించిన ఘనత ఇందిర సొంతం. ఇక్బాల్, నెహ్రూ, సర్వేపల్లి, నిజాం కుటుంబసభ్యులు ప్రిన్సెస్ ఇస్రా, దుర్రె షావర్, ఫైగా, సాలార్ జంగ్ వంశస్థులతో ఇందిరా దేవి మైత్రీ కొనసాగించారు. ఇందిరాదేవి ధన్ రాజ్‌గిర్ అంత్యక్రియలు బుధవారం ఉదయం అంబర్‌పేట శ్మశాన వాటికలో జరుగుతాయని మహేష్ విశ్వనాథ తెలిపారు. ఆమె తుది కోరిక మేరకు అత్యంత సాదాసీదాగా తెలుగు వైదిక సంప్రదాయం ప్రకారం కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ తమ్ముడు రామ్మూర్తి కుమారుడు విశ్వనాథ శోభనాద్రి చేతుల మీదగా అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు సమాచారం.

వ్యక్తిత్వ హనన కథనాలపై తెలంగాణలో సిట్

- సజ్జనార్ పర్యవేక్షణలో 8 మందితో ఏర్పాటు

హైదరాబాద్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మహిళా ఐఏఎస్ అధికారి వ్యక్తిత్వ హననం, సీఎం రేవంత్‌రెడ్డి ఫొటోల మార్ఫింగ్ కేసుల విచారణకు సంబంధించి హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో 8మంది సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటు చేస్తూ డీజీపీ శివధర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ పబ్లిక్ టీవీ వాట్సాప్ గ్రూపులో కావలి వెంకటేశ్ అనే వ్యక్తి రేవంత్ ఫొటోను మార్ఫింగ్ చేసి ఓ అసత్య కథనాన్ని పోస్టు చేశాడని, దీన్ని మరికొందరు షేర్ చేశారని నారాయణపేట జిల్లా మద్దూర్ పోలీసుస్టేషన్‌లో ఈ నెల 11న కాంగ్రెస్ నేత గూళ్ల నరసింహ ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 196(2),353(1)(ఏ), 352తో పాటు ఐటీ చట్టం కింద కూడా కేసు నమోదు చేశారు. ఇదే విధంగా మహిళా ఐఏఎస్ అధికారి వ్యక్తిత్వాన్ని కించపరిచే విధంగా కొన్ని టీవీ చానళ్లు, యూట్యూబర్లు కథనాలను ప్రసారం చేశారంటూ ఐఏఎస్ అధికారుల సంఘం కార్యదర్శి జయేశ్‌రంజన్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ వార్తా కథనాన్ని ముందుగా ప్రసారం చేసిన ఎన్‌టీవీతో పాటు తెలుగు స్క్రైబ్, ఎంఆర్ మీడియా తెలంగాణ, ప్రైమ్ 9 తెలంగాణ, పీవీ న్యూస్, సిగ్నల్ టీవీ తెలుగు, ఓల్గా టైమ్స్, మిర్రర్ టీవీ, టీ న్యూస్ తెలుగు చానళ్లపై చర్యలు తీసుకోవాలని జయేశ్ రంజన్ తన ఫిర్యాదులో కోరారు.

కుట్ర ఉంటే కనిపెడతాం

మహిళా ఐఏఎస్ అధికారి పేరును వెల్లడించకుండా గతంలో ఆమె పనిచేసిన 3 పోస్టులను కథనంలో చెప్పడం ద్వారా ఆమె గుర్తింపును సులభతరం చేశారంటూ ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సంఘాలు, రెవెన్యూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో వాటి గుట్టు విప్పడానికి సిట్ అవసరమని ప్రభుత్వం భావించినట్లు సమాచారం. ఈ కథనాన్ని ఎవరు రూపొందించారు.. ఎందుకు ప్రసారం చేశారన్న దానిపై సిట్ దర్యాప్తు చేయనుంది. బాధ్యులైన రిపోర్టర్, ఎడిటర్, సంస్థ యాజమాన్యం పాత్రను గుర్తించడానికి సిట్ అధికారులు రంగంలో దిగారు. ఈ కథనం ప్రసారం వెనుక కుట్ర ఉంటే కనిపెడతామని డీజీపీ స్పష్టం చేశారు. కాగా, మహిళా ఐఏఎస్‌పై కథనాన్ని ప్రచారం చేసిన అంశంపై ప్రముఖ టీవీ చానల్ యాజమాన్యం విచారం వ్యక్తం చేసింది.

అలిపిరిలో టౌన్‌షిప్.. బోర్డు సమష్టి నిర్ణయమే!

- 2018లోనే మాస్టర్ ప్లాన్ ఆమోదం
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై టీటీడీ వివరణ
- మాస్టర్ ప్లాన్‌లో ఉన్నది 'అలిపిరి' అనే
- మరి శిల్ప శిక్షణ సంస్థ స్థలమే ఎందుకు?

తిరుపతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం అలిపిరిలో టౌన్‌షిప్ నిర్మాణం అనేది బోర్డు సభ్యులందరూ చర్చించి తీసుకున్న సమష్టి నిర్ణయమని టీటీడీ స్పష్టం చేసింది. ఈనెల 12వ తేదీ సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో "ఈ తిరకాసేమిటి తిరుమలేశా?" అన్న శీర్షికన ప్రచురితమైన వార్తపై టీటీడీ స్పందించింది. భక్తుల సౌలభ్యం కోసం వారు సులువుగా చేరుకునే అలిపిరి ప్రాంతంలో వసతి సముదాయం ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందని బోర్డు నిర్ణయించిందని దేవస్థానం ఒక ప్రకటనలో తెలిపింది. సమష్టిగా తీసుకున్న ఆ నిర్ణయాన్ని టీటీడీ ఛైర్మన్‌కు ఆపాదించడం సరైంది కాదని తెలిపింది. 2018లోనే అలిపిరి సమీపంలో భక్తుల వసతి సదుపాయాల కోసం శిల్ప శిక్షణా సంస్థ పరిసరాల్లో 38 ఎకరాల్లో నాలుగు బ్లాకులతో కూడిన భవన సముదాయాన్ని నిర్మించాలని టీటీడీ బోర్డు తీర్మానం చేసిందని తెలిపింది. 2019-24 మధ్య వైసీపీ హయాంలో అలిపిరి కాకుండా ప్రత్యామ్నాయ ప్రాంతంలో స్పిరిచ్యువల్ సిటీ ఏర్పాటు కోసం 2021, 2022, 2023లో నాలుగు సార్లు బోర్డు తీర్మానాలు చేసిందని తెలిపింది. అయితే ఆ ఐదేళ్లలో ఈ దిశగా ఎలాంటి అభివృద్ధి జరగలేదని పేర్కొంది. గతేడాది డిసెంబరు 16న అలిపిరి-చెర్లోపల్లి రోడ్డులో పేరూరు గ్రామ సర్వే నంబరు 604-9లో టీటీడీకి చెందిన 20 ఎకరాల భూమిలో తీర్థ యాత్రికుల టౌన్‌షిప్ నిర్మాణానికి డిజైన్లు రూపొందించే ప్రతిపాదన బోర్డు సమావేశంలో చర్చకు వచ్చిందని, దీనిని శిల్ప శిక్షణా సంస్థ, ప్రొడక్షన్ సెంటర్ ఉన్న ప్రాంగణంలో ఏర్పాటు చేయాలని తీర్మానించినట్టు తెలిపింది. ప్రస్తుతం శిల్ప శిక్షణాసంస్థను సూచిస్తూ ప్రతిపాదించిన టౌన్‌షిప్ ప్రాజెక్టు వాస్తవానికి 2018లో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో భాగమని టీటీడీ తెలిపింది.



శ్రీ వెంకటేశ్వర సంప్రదాయ ఆలయ శిల్ప శిక్షణ సంస్థ

తీర్మానంలో ఆ మాటేదీ?

అలిపిరిలో టీటీడీకి ప్రత్యామ్నాయ స్థలాలున్నప్పటికీ... శిల్ప శిక్షణ సంస్థ స్థలాన్నే ఎందుకు ఎంపిక చేసుకున్నారన్నది 'ఆంధ్రజ్యోతి' ప్రశ్న. ప్రతిష్ఠాత్మకమైన ఆ సంస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. టౌన్‌షిప్ నిర్మాణానికి అధికారులు నిర్దిష్టంగా మరో స్థలాన్ని సూచించినప్పటికీ బోర్డు శిల్ప శిక్షణ సంస్థ స్థలాన్నే ఎంపిక చేసుకుంది. దీనికి టీటీడీ సమాధానం ఇవ్వలేదు. 2018లోనే అప్పటి బోర్డు శిల్ప శిక్షణ సంస్థ స్థలంలో టౌన్ షిప్ నిర్మించేందుకు తీర్మానించినట్లు టీటీడీ చెబుతోంది. అయితే... నాటి తీర్మానం ప్రతిని పరిశీలిస్తే అందులో ఎక్కడా శిల్ప శిక్షణ సంస్థ స్థలంలో టౌన్‌షిప్ కట్టాలని ప్రతిపాదనే లేదు. 'అలిపిరి'లో అని మాత్రమే ఉంది. దీంతో తాజాగా టీటీడీ ఇచ్చిన వివరణ అయోమయానికి గురి చేస్తోంది. ఇక... 2019 జనవరి 8న జరిగిన బోర్డు సమావేశంలో ఒక బ్లాకు నిర్మాణానికి టెండర్లను ఆమోదించారు. ఆ తీర్మానంలో కూడా అలిపిరిలో భక్తులకు వసతి కోసం ఒక బ్లాకు నిర్మాణం అని మాత్రమే ఉంది తప్ప శిల్ప శిక్షణ సంస్థ స్థలంలో నిర్మించాలని ఎక్కడా ప్రస్తావించలేదు. అంతేకాదు... ప్రతిపాదిత నిర్మాణ స్థలంలో చెట్ల నరికివేతకు అటవీ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో 2019 అక్టోబరు 23 నాటి బోర్డు సమావేశం సంబంధిత పనులను రద్దు చేస్తూ తీర్మానించింది.

ఒక వ్యక్తికి ఒకే లైసెన్స్

- టెండర్ నోటిఫికేషన్‌లో ఈ నిబంధన చేర్చండి
- ఏపీఎస్ఆర్టీసీ అధికారులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వనరులు అవసరమైన ప్రజలకు అందాలి తప్ప ఒకే వ్యక్తికి వాటిపై గుత్తాధిపత్యం కల్పించడానికి వీల్లేదని హైకోర్టు తేల్చిచెప్పింది. ఒకే వ్యక్తికి అనేక షాపులు కేటాయించే విధానాన్ని ఏపీఎస్ఆర్టీసీ కొనసాగించడాన్ని తప్పుపట్టింది. ప్రస్తుత కేసులో టెండర్ నోటిఫికేషన్‌లో లాసుగుల ఆధారంగా పిటిషనర్ యర్రగుంట్ల బస్టాండ్‌లో అనేక షాపులు దక్కించుకొని, వాటిని థర్డ్‌పార్టీలకు అక్రమంగా సబ్‌లీజుకి ఇచ్చారంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పిటిషనర్ టెండర్ నిబంధనలు, లీజు షరతులను ఉల్లంఘించాడని తెలిపింది. ఈ నేపథ్యంలో 2024 జనవరి 4న ఇచ్చిన టెండర్ నోటిఫికేషన్‌ను కొట్టివేసింది. భవిష్యత్తులో ఇచ్చే టెండర్లలో ఒక వ్యక్తికి ఒకే లైసెన్స్ అనే నిబంధన చేర్చాలని ఏపీఎస్ఆర్టీసీకి స్పష్టం చేసింది. గత టెండర్ ప్రక్రియలో పాల్గొన్నవారి డిపాజిట్లు మూడు వారాల్లో తిరిగి చెల్లించాలని ఆదేశించింది. పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఇటీవల తీర్పు ఇచ్చారు. కడప జిల్లా, కలసపాడుకు చెందిన వి.రబ్బానీ బాషా యర్రగుంట్ల బస్టాండ్‌లో ఏడు షాపులను టెండర్ ప్రక్రియ ద్వారా ఐదేళ్ల కాలానికి లీజుకు తీసుకున్నారు. అయితే అద్దె చెల్లించకపోవడం, షాపులను థర్డ్ పార్టీకి సబ్‌లీజుకు ఇవ్వడం, ఇతర టెండర్ నిబంధనలు ఉల్లంఘించారనే కారణంతో ఏపీఎస్ఆర్టీసీ అధికారులు 2023 నవంబరు, డిసెంబరు నెలల్లో లైసెన్స్‌లు రద్దు చేశారు. 2024 జనవరిలో ఆ షాపులకు మళ్లీ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. లైసెన్స్ రద్దు చేయడం, మళ్లీ టెండర్ నోటిఫికేషన్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ అదే ఏడాది రబ్బానీ బాషా హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన న్యాయమూర్తి పిటిషనర్ లీజు నిబంధనలు ఉల్లంఘించడమేకాక, వాస్తవాలను దాచిపెట్టి కోర్టులో పిటిషన్ వేశారని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను కొట్టివేశారు.

'ప్రైవేటు' బాదుడుపై ఆర్టీఏ కొరడా

- సంక్రాంతి స్పెషల్ డ్రైవ్‌లో పలు ప్రైవేటు బస్సులపై చర్యలు
- అదనపు చార్జీల వసూలుపై 209 కేసులు, రూ.21 లక్షల ఫైన్

అమరావతి, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల నుంచి టికెట్ చార్జీల రూపంలో వేలాది రూపాయలు వసూలు చేసిన ప్రైవేటు ట్రావెల్స్‌పై రవాణా శాఖ కొరడా ఝుళిపించింది. పొరుగు రాష్ట్రాల నుంచి కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు వచ్చే ప్రయాణికుల రద్దీని గమనించి.. ప్రైవేటు బస్సుల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా చార్జీలను పెంచేశాయి. ఇవి.. సాధారణ రోజుల్లో విమాన చార్జీలకు దాదాపు సమానంగా ఉన్నాయంటూ రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఆర్టీఏ అధికారులతో రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా సమావేశమై, ప్రైవేటు ట్రావెల్స్ అదనపు బాదుడుపై చర్యలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు రోజుల పాటు తనిఖీలు చేపట్టిన ఎంవీఐలు.. అదనపు చార్జీలకు సంబంధించి 209 బస్సులపై కేసులు నమోదు చేసి, రూ.21.04 లక్షల జరిమానా విధించారు. మరోవైపు పన్ను, పర్మిట్ తదితర నిబంధనల ఉల్లంఘనపై 678 బస్సులపై కేసులు పెట్టి, రూ.36.86 లక్షల జరిమానా వసూలు చేశారు. అదనపు చార్జీలపై పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా 54 కేసులు నమోదు చేసి, రూ.5.40 లక్షల ఫైన్ విధించినట్లు కమిషనర్ ఎం.కే.సిన్హా తెలిపారు. కోనసీమ జిల్లాలో 39 కేసుల్లో రూ.3.90 లక్షలు, చిత్తూరులో 30 కేసుల్లో రూ.3 లక్షలు జరిమానా వసూలు చేసినట్టు చెప్పారు. ఇతర ఉల్లంఘనలపై అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 61 కేసులు పెట్టి, రూ.9.76 లక్షల ఫైన్ వేశామని, ఎన్టీఆర్ జిల్లాలో 92 కేసులు, పల్నాడులో 39 కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు వెల్లడించారు. ప్రభుత్వం గరిష్ఠంగా అనుమతించిన మేరకు 50 శాతం అదనంగా చార్జీలు తీసుకున్న బస్సులు మినహా.. అంతకు మించి వసూలు చేసిన వాటిపై చర్యలు తీసుకున్నట్లు వివరించారు. తిరుగు ప్రయాణంలో కూడా ప్రయాణికుల నుంచి అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పండగలైనా, సాధారణ రోజులైనా నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. ఉల్లంఘించే ట్రావెల్స్ వివరాలను ఆధారాలతో సహా 9281607001 నెంబర్‌కు తెలియ జేయాలని సిన్హా సూచించారు.

పశు బీమా.. రైతుకు ధీమా

- ప్రీమియంలో 85% రాయితీ
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మద్దతు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, పందులు మరణిస్తే.. పశుపోషకులు నష్టపోకుండా వారిని ఆర్థికంగా ఆదుకునేది పశు బీమా పథకమే! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ పథకాన్ని అమలు చేస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో కేవలం నష్టపరిహారం మాత్రమే.. ఇవ్వగా.. కూటమి ప్రభుత్వం వచ్చాక ఏకంగా 85% ప్రీమియం రాయితీతో బీమా పథకాన్ని ప్రారంభించింది. పశు పోషకులు కేవలం 15% ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. ఈనెల 19నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఉచిత పశు వైద్య శిబిరాల్లో అర్హత ఉన్న పశువులకు బీమా సౌకర్యాన్ని కల్పించనున్నారు. ఈ పథకంలో ఇంకానమోదుకాని పశుపోషకుల వివరాలను నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ

పశు బీమా పరిహారం లబ్ధిదారులైన పశుపోషకుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ అవుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు రాష్ట్రంలో 3,59,453 పశువులకు బీమా వర్తింపజేశారు. 9,036 చనిపోయిన పశువులకు బీమా పరిహారంగా రూ.19,65,89,470 నేరుగా పశుపోషకుల బ్యాంక్ ఖాతాలకు జమ చేసినట్లు పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు తెలిపారు.

ప్రీమియం చెల్లింపు ఇలా..

ఒక్కో మేలురకం పశువుకు రూ.30వేలు, సంకర జాతి పశువులకు రూ.15వేలు, జీవాలకు రూ.6వేలు బీమా పరిహారం అందించనున్నారు. రూ.30వేల విలువైన పశువుకు బీమా ప్రీమియం రూ.1,920 చెల్లించాలి. దీనిలో కేంద్ర, రాష్ట్రాలు రూ.1,632(85%) భరిస్తాయి. మిగిలిన కేవలం రూ.288(15%) పశుపోషకులు చెల్లిస్తే చాలు!. గత ప్రభుత్వంలో బీమా ప్రీమియం రూ.384 వసూలు చేశారు. ఇక ఇప్పుడు దేశవాళీ రకం పశువులకు రూ.15వేల బీమాకు ప్రీమియం రూ.960 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించనున్నాయి. మిగితా రూ.144 పశుపోషకులు చెల్లించాలి. సన్న జీవాలకు ప్రీమియం వరుసగా 1,2,3 ఏళ్ల కాలానికి బీమా చేస్తారు. తొలి ఏడాది రూ.6 వేల బీమాకు 3% ప్రీమియం కింద రూ.153 రాయితీ లభించనుండగా, లబ్ధిదారు రూ.27 చెల్లిస్తే సరిపోతుంది. ఈ బీమా గరిష్ఠంగా 10 ఆవులు లేదా గేదెలు, 100 జీవాలు, 50 పందులకు వర్తిస్తుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.